అనుదినం... జనస్వరం

www.navatelangana.com

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

సోమవారం 20-01-2025

సంపుటి : 11 | సంచిక : 20 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | 14 పేజీలు | వెల : 6.50



సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సమావేశ నిర్ణయాలను వెల్లడిస్తున్న, ప్రకాశ్ కరత్, చిత్రంలో పశ్చిమబెంగాల్ కార్యదర్శి ఎండీ సలీం

పాలస్తీనాలో శాంతికి రాజకీయ పరిష్కారం కనుగొనాలి

ఇజ్రాయిల్, హమాస్ మధ్య కాల్పుల విరమణను స్వాగతించిన సీపీఐ(ఎం)

పలు అంశాలపై కొల్‌కతాలో సీపీఐ (ఎం) కేంద్ర కమిటీ చర్చ

పార్టీ జాతీయ మహాసభలకు సన్నాహాలు

న్యూఢిల్లీ : ఇజ్రాయిల్, హమాస్ మధ్య కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందాన్ని సీపీఐ (ఎం) స్వాగతించింది. ఈ ఒప్పందం ఆదివారం నుంచి అమలులోకి వచ్చింది. పదిహేను నెలలకు పైగా గాజాలోని పాలస్తీనా ప్రజలపై ఇజ్రాయిల్ సాగించిన జాతి నిర్మూలన యుద్ధంలో 46 వేల మందికి పైగా ప్రాణాలు కోల్పోగా, 1.20 లక్షల మంది గాయపడ్డారని పార్టీ తెలిపింది. కాల్పుల విరమణ తొలి దశ ఆరు వారాల పాటు ఉనికిలో ఉంటుందని, ఆ తర్వాత శాంతిని, రాజకీయ పరిష్కారాన్ని కనుగొనే వరకూ దానిని కొనసాగించాలని అభిప్రాయపడింది. పాలస్తీనాలో శాంతి నెలకొనేలా, స్వతంత్ర పాలస్తీనా ఏర్పాటుకు చర్యలు చేపట్టేలా భారత ప్రభుత్వం దౌత్యపరంగా కృషి చేయాలని సూచించింది. ఈ నెల 17-19 తేదీల మధ్య కొల్‌కతాలో సమావేశమైన సీపీఐ (ఎం) కేంద్ర కమిటీ పలు అంశాలపై చర్చించింది. వాటిపై ఆదివారం ఒక ప్రకటన ...3లో



హైదరాబాద్‌లో

భారీ ఐటీ పార్క్

రూ. 450 కోట్ల పెట్టుబడులకు ఒప్పందం

- 10 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటు
- క్యాపిటల్‌ల్యాండ్ ప్రతినిధులతో సీఎం రేవంత్ చర్చలు



క్యాపిటల్‌ల్యాండ్ ప్రతినిధులతో సీఎం రేవంత్ , మంత్రి శ్రీధర్‌బాబు, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, తదితరులు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

హైదరాబాద్‌లో భారీ పెట్టుబడి పెట్టేందుకు సింగపూర్‌కు చెందిన ప్రముఖ రియల్ ఎస్టేట్ కంపెనీ ముందుకొచ్చింది. రాష్ట్రంలో రూ.450 కోట్లతో అత్యాధునిక ఐటీ పార్కు ఏర్పాటు చేస్తున్నట్టు క్యాపిటల్ ల్యాండ్ కంపెనీ ప్రకటించింది. ఆ దేశంలో పర్యటిస్తున్న ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని తెలంగాణ ప్రతినిధి బృందంతో జరిగిన ఉన్నతస్థాయి సమావేశంలో కంపెనీ నిర్ణయం తీసుకుంది. 10 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో భారీ ఐటీ పార్క్‌ను అభివృద్ధి చేయనుంది. క్యాపిటల్ ల్యాండ్ చేపట్టే కొత్త ఐటీ పార్కు హైదరాబాద్ అభివృద్ధిలో మరో మైలు రాయిగా నిలుస్తుందని సీఎం ఈ సందర్భంగా అభిప్రాయ పడ్డారు. బ్లూ చిప్ కంపెనీలు కోరుకునే ప్రీమియం సదుపాయాలు, గ్లోబల్ కెపబిలిటీ సెంటర్లకు పెరుగుతున్న డిమాండ్‌ను అందుకునేలా అన్ని సౌకర్యాలు ఐటీ పార్కులో అందుబాటులో ఉంటాయి. కంపెనీ ఇండియా ట్రస్ట్ మేనేజ్‌మెంట్ సీఈవో గౌరీశంకర్ నాగభూషణం మాట్లాడుతూ రేవంత్ సారథ్యంలో హైదరాబాద్ అన్ని రంగాల్లో సుస్థిర వృద్ధి చెందుతోందనీ, తమ సంస్థ కార్యకలాపాలను తెలంగాణలో విస్తరించటం ఆనందంగా ఉందని అన్నారు. క్యాపిటల్ ల్యాండ్ సంస్థ ఇప్పటికే హైదరాబాద్‌లో అంతర్జాతీయ టెక్ పార్క్ (ఐటీపీహెచ్), అవాన్స్ హైదరాబాద్, సైబర్‌పెర్ల్ పార్కులను చేపట్టింది. గతంలో ఈ సంస్థ ప్రకటించిన 25 మెగావాట్ల ఐటీ లోడ్ డేటా సెంటర్ ఈ ఏడాది మధ్యలో అందుబాటులోకి రానుంది. ఐటీపీహెచ్ రెండో దశ ...13లో

సింగపూర్ నదిలో సీఎం పడవ ప్రయాణం 5లో..



ముగిసిన సింగపూర్ పర్యటన

దావోస్‌కు చేరుకున్న ముఖ్యమంత్రి బృందం

నేటి నుంచి వరల్డ్ ఎకనామిక్స్ ఫోరమ్

భారీ పెట్టుబడులే లక్ష్యంగా ప్రణాళికలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలోని తెలంగాణ ప్రతినిధి బృందం మూడు రోజుల సింగపూర్ పర్యటన విజయవంతంగా ముగిసింది. అక్కడ నుంచి ఆదివారం రాత్రి సీఎంతో ...5లో



14లో..

అమ్మాయిలు, అబ్బాయిలు ఖోఖో చాంపియన్స్

అరంగేట్ర ప్రపంచకప్ టైటిల్స్ మన సొంతం

ఖోఖో ప్రపంచకప్ 2025

భారత్ చరిత్ర సృష్టించింది. ప్రథమ ఖోఖో ప్రపంచకప్‌లో టీమ్ ఇండియా చాంపియన్‌గా అవతరించింది. ప్రపంచ వ్యాప్తంగా 39 జట్లు పోటీపడిన ఉత్కంఠభరిత ప్రపంచకప్‌లో భారత మహిళల, పురుషుల జట్లు విజేతలుగా నిలిచాయి. అమ్మాయిలు నేపాల్‌ను చిత్తు చేయగా.. అబ్బాయిలు సైతం నేపాల్‌పై ఘన విజయం సాధించారు.

ట్రంప్ ప్రమాణస్వీకార వేళ హోరెత్తిన నిరసనలు

వాషింగ్టన్‌లో భారీ ప్రదర్శన

ఇతర నగరాలలో కూడా ఆందోళనలు

'ట్రాన్స్ లైవ్స్ మ్యాటర్', 'స్టాండప్... ఫైట్ బ్యాక్', 'ట్రస్ట్ బ్లాక్ ఉమెన్', 'ఉయ్ కాంట్ బి సైలెంట్' అంటూ నినాదాలు



వాషింగ్టన్ : అమెరికా 47వ అధ్యక్షుడుగా డోనాల్డ్ ట్రంప్ బాధ్యతలు చేపడుతున్న తరుణంలో వాషింగ్టన్ నగరం నిరసనలతో హోరెత్తింది. ట్రంప్ విధానాలను నిరసిస్తూ వేలాది మంది ప్రజలు భారీ ప్రదర్శన నిర్వహించారు. 'ట్రాన్స్ లైవ్స్ మ్యాటర్', ...13లో

నైజీరియాలో పేలిన పెట్రోల్ ట్యాంకర్

70 మంది మృతి

వివరాలు 13లో

రుణమాఫీ కాలే.. రైతుభరోసా రాలే


రాష్ట్రంలో 402 మంది రైతుల ఆత్మహత్యలు

బాధిత కుటుంబాలకు రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి : మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు 13లో.

మూడు గంటలు ఆలస్యంగా అమల్లోకి కాల్పుల విరమణ..

13లో.

15 నెలలుగా గాజాపై ఇజ్రాయిల్ మారణకాండ



తప్పుదోవ పట్టిస్తున్న పతంజలి ప్రకటనలు

బాబా రాందేవ్‌పై అరెస్ట్ వారెంట్

కేరళలోని పాలక్కడ్ జిల్లా కోర్టు ఉత్తర్వులు

వివరాలు 13లో

మరోసారి రైతు ఉద్యమానికి తలవంచిన మోడీ సర్కార్

ఫిబ్రవరి 14న చర్చలకు రమ్మని కేంద్రం ప్రకటన

వైద్య సాయం పొందుతున్న దల్లేవాల్

ఎంఎస్పీపై చట్టబద్ధత కల్పించడం సహా వివిధ డిమాండ్లు

11 నెలలుగా పరిష్కారంకోసం ఆందోళనలు



న్యూఢిల్లీ : డిమాండ్ల సాధన కోసం ఆందోళన సాగిస్తున్న పంజాబ్ అన్నదాతలలో చర్చలు జరుపుతామని కేంద్రం ప్రకటించింది. దీంతో ఆమరణ దీక్ష చేస్తున్న రైతు నాయకుడు జగ్జిత్ సింగ్ దల్లేవాల్ వైద్య సాయం పొందేందుకు అంగీకరించారు. అయితే పంటల కనీస మద్దతు ధరలకు (ఎంఎస్పీ) చట్టబద్ధత కల్పించేంత వరకూ నిరవధిక దీక్ష కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు. పంజాబ్‌లో నిరసన తెలుపుతున్న రైతులతో ఫిబ్రవరి 14న చండీగఢ్‌లో చర్చలు జరుపుతామని కేంద్ర ప్రభుత్వం తెలిపింది. అంతకుముందు సంయుక్త కార్యదర్శి ప్రియ రంజన్ నేతృత్వంలో కేంద్ర వ్యవసాయ ...13లో



మద్దతు ధర సాధనకు ఐక్య ఉద్యమాలు

- టి. సాగర్, ప్రధాన కార్యదర్శి, తెలంగాణ రైతు సంఘం



పంటలకు మద్దతు ధరలను సాధించేందుకు అన్ని రైతు సంఘాలతో కలిపి ఐక్య ఉద్యమాలు నిర్వహిస్తాం. ఐక్య కార్యాచరణ రూపొందించి, సమరశీల పోరాటాలు చేస్తాం. ప్రభుత్వ పథకాలు అర్హులకు అందుబాటులోకి తెచ్చేలా ఒత్తిడి పెంచుతాం. సాగునీటి ప్రాజెక్టులను ప్రాధాన్యతాక్రమంలో నిర్మించాలి. భవిష్యత్తులో భూ నిర్వాసితుల సమస్యలు పెరుగుతాయి. ప్రభుత్వం రహదారులు, ప్రాజెక్టులు, పరిశ్రమల ...13లో

'ఇట్లయితే సాగేదెట్టా. చేయి చాచి అడిగినా గత సర్కారు మా గోడు పట్టించుకోలేదు. కష్టాల కడలిలో నుంచి మేము బయట పడేదెట్టా' ఏ రైతు నోట విన్నా ఇదే ఆవేదన. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆలోచన విధానాలే రైతుల కష్టాలకు కారణమవుతున్నాయి. అవి తీసుకున్న నిర్ణయాలే అన్నదాతలకు ఉరితాళ్లుగా మారుతున్నాయి. చివరకు తాము పండించిన పంటను ఎంతకు అమ్ముకోవాలో తెలియని పరిస్థితుల్లో రైతులు ఉన్నారంటే అర్థం చేసుకోవచ్చు. విత్తనం విత్తే నాటి నుంచి పంటను అమ్ముకునేదాకా రైతు ఎదుర్కొంటున్న కష్టాలు, బాధలు వర్ణనాతీతం. కౌలు రైతుల గోస కష్టాలమయం. అది ఎవరికీ పట్టనిది. గత పాలకుల నుంచి నేటి పాలకుల వరకు అనుసరిస్తున్న విధానాల్లో ఏలాంటి మార్పూ లేదు. దశాబ్దాల కాలంగా పెండింగ్‌లో ఉన్న పోడు సాగుదారులకు పట్టాలు ఇవ్వలేదు.

సాగేదెట్టా?

కష్టాల కడలిలో రైతన్న

సర్కారు విధానాలే రైతుల మెడకు ఉరితాళ్లు

గాలికొదిలేసిన నాటి బీఆర్‌ఎస్ సర్కారు

ధరణి సృష్టించిన సమస్యలెన్నో...

హామీలను పట్టించుకోని కాంగ్రెస్ ప్రభుత్వం

కౌలు రైతులకు గుర్తింపేది?

అన్నదాతలకు అండగా తెలంగాణ రైతు సంఘం

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో రైతు సమస్యల పరిష్కారానికి తెలంగాణ రైతు సంఘం ఎన్నో పోరాటాలు నిర్వహించింది. రాష్ట్రంలో 11.5 లక్షల పోడు రైతులకుగానూ, సుదీర్ఘ పోరాట ఫలితంగా నాలుగు లక్షల రెండువేల మందికి పట్టాలను సాధించింది. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం రైతు బంధు పథకాన్ని అమలు చేసి, మిగతా సబ్సిడీలను ఇవ్వలేదు. ఇదే కాలంలో కేంద్ర ప్రభుత్వం మూడు సాగు చట్టాలను తీసుకొచ్చి రైతులను కూలీలుగా మార్చే ప్రక్రియకు శ్రీకారం చుట్టింది. పచ్చని పంట పొలాలను కార్పొరేట్లకు కట్టబెట్టేలా కేంద్రం తీసుకున్న నిర్ణయంపై రైతన్న కన్నెర చేశారు. జాతీయస్థాయిలో సుదీర్ఘ కాలం పోరాటం సాగింది. రైతుసంఘాలు, కార్మిక, సామాజిక సంఘాలు జాతీయ పోరాటానికి మద్దతుగా నిలిచాయి. లక్షల మంది ...13లో

ఇందిరమ్మ పాలనలో పేదలందరికీ ఇండ్లు

- గృహనిర్మాణ శాఖను పునరుద్ధరించాం : ఉద్యోగుల సంఘం డైరీ ఆవిష్కరణలో మంత్రి పొంగులేటి



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

'కూడు, గూడు, గుడ్డ...గరీబీ హటావో' నినాదంతో ఇందిరమ్మ పేదల గుండెల్లో కొలువయ్యారని రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఇందిరమ్మ పాలనలో పేదలందరికీ ఇండ్లను నిర్మించి ఇవ్వడమే ఈ ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఆదివారం హైదరాబాద్‌లోని మంత్రుల సముదాయంలో తెలంగాణ రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ ఉద్యోగుల డైరీ (2025) క్యాలెండర్‌ను మంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు వచ్చే నాలుగు సంవత్సరాలలో దశల వారీగా రాష్ట్రంలో అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి ఇస్తామని ప్రకటించారు. ప్రజల ఆకాంక్షలకనుగుణంగా ప్రభుత్వం పని చేస్తుందని, ప్రభుత్వ ఆలోచనలకు అనుగుణంగా ఉద్యోగులు పని చేయాలని సూచించారు. పేదలకు ఇండ్లు నిర్మించే గృహనిర్మాణ శాఖను గత ప్రభుత్వం పూర్తిగా నిర్వీర్యం చేసిందని అన్నారు. ఆ విభాగాన్ని మూసివేసి ఉన్న ఉద్యోగులను ఇతర శాఖలలో విలీనం చేసిందని గుర్తు చేశారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఒక్కొక్క అడుగు వేస్తూ...ఈ శాఖను పునరుద్ధరించి లబ్ధిదారుల ఎంపిక నుంచి ఇండ్ల నిర్మాణం, పర్యవేక్షణ వరకు అవసరమైన యంత్రాంగాన్ని సమకూర్చుకున్నదని తెలిపారు. 326 మంది ఉద్యోగులను తిరిగి నియమించడం ద్వారా గృహ నిర్మాణ కార్పొరేషన్‌ను బలోపేతం చేశామన్నారు. కార్యక్రమంలో ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు గవ్వ రవీందర్‌రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొగ్గుల వెంకటరామిరెడ్డి, సీనియర్ నేత కంది రవీందర్‌రెడ్డి, ఉపాధ్యక్షులు భాస్కర్‌రెడ్డి, కుమార్, రమేష్, రఘు, లింగయ్య, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి

టీఎస్‌యూటీఎఫ్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్‌యూటీఎస్) డిమాండ్ చేసింది. రిటైర్‌మెంట్ వయసు పెంపు ఆర్థిక సమస్యలకు పరిష్కారం కాదనీ, పెన్షనర్ల చెల్లింపులు వాయిదా వేయడం కోసం ఉద్యోగ విరమణ వయస్సు పెంచాలని ప్రభుత్వ యోచన సరైంది కాదనీ, ఆ ప్రతిపాదన విరమించుకుని పెండింగ్ బిల్లులను తక్షణమే విడుదల చేయాలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చావ రవి, ఎ వెంకట్ డిమాండ్ చేశారు. ఆదివారం హైదరాబాద్‌లోని ఆ సంఘం రాష్ట్ర కార్యాలయంలో రాష్ట్ర ఆఫీసు బేరర్స్ సమావేశాన్ని నిర్వహించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. పీఆర్సీ నివేదికను వెంటనే తెప్పించి సంఘాలతో చర్చించి 1.07.2023 నుండి అమలు చేయాలనీ, బకాయి పడిన నాలుగు వాయిదాల కరువు భత్యాన్ని వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కేజీబీవీ, యూఆర్ఎస్, ఆశ్రమ పాఠశాలల కాంట్రాక్టు ఉద్యోగులకు కనీస టైమ్ స్కేలు ఇవ్వాలనీ, గురుకులాల పనివేళలు విద్యార్థులకు, ఉపాధ్యాయులకు అనుకూలంగా మార్చాలని కోరారు. రాష్ట్ర బడ్జెట్‌లో విద్యకు 15శాతం కేటాయించాలనీ, విద్యాసంస్థల్లో ఉపాధ్యాయులపై అరాచక శక్తుల దాడులు అరికట్టాలన్నారు. జీడీపీలో 6శాతం విద్యకు కేటాయించాలనీ, ఎన్ఈపీ 2020ని రద్దు చేయాలనీ, జాతీయ పెన్షన్ పథకాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆదాయపు పన్ను మినహాయింపు పరిమితిని పాత విధానంలో రూ.8 లక్షలకు పెంచాలనీ, పొదుపు మొత్తాలపై రాయితీని రూ.5 లక్షలకు పెంచాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమావేశంలో ఉపాధ్యక్షుడు కె జంగయ్య, కోశాధికారి టి లక్ష్మారెడ్డి, కార్యదర్శులు రాజశేఖరరెడ్డి, రాములు, జి సమ్మారావు, కె రంజిత్ కుమార్, జి నాగమణి, డి సత్యానంద్, మల్లారెడ్డి, శ్రీధర్, రవి కుమార్, రవి ప్రసాద్ గౌడ్, జ్ఞానమంజరి, సింహాచలం, వెంకటప్ప, యాకయ్య ప్రధాన సంపాదకులు పి మాణిక్ రెడ్డి పాల్గొన్నారు.



ఐక్య ఉద్యమాలతోనే సమస్యలకు పరిష్కారం

- కార్మిక-కర్షక పోరాటాలను ఉధృతం చేయాలి :

కార్మిక కర్షక ఐక్యత ర్యాలీలో తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మూడ్ శోభన్

నవతెలంగాణ-కంఠేశ్వర్

ఐక్య ఉద్యమాలతోనే సమస్యలకు పరిష్కారం లభిస్తుందని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మూడ్ శోభన్ అన్నారు. కార్మిక కర్షక పోరాటాలను ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. 1982లో తమిళనాడులో రైతాంగ హక్కుల కోసం జరిగిన కార్మిక, కర్షక రైతాంగ ప్రదర్శన పైన ఆనాటి ప్రభుత్వం విచక్షణారహితంగా జరిపిన కాల్పులలో 10 మంది నాయకులు అక్కడికక్కడే చనిపోయారు. [illegible]

ట్రంప్‌తో ముకేశ్ అంబానీ దంపతులు భేటీ

- ప్రమాణస్వీకారానికి హాజరు

వాషింగ్టన్ డీసీ : అమెరికా అధ్యక్షుడిగా ప్రమాణస్వీకారం చేయడానికి ఒక రోజు ముందు డొనాల్డ్ ట్రంప్‌తో రిలయన్స్ ఇండస్ట్రీస్ ఛైర్మెన్ ముకేశ్ అంబానీ దంపతులు భేటీ అయ్యారు. [illegible]

పాలస్తీనాలో శాంతికి రాజకీయ పరిష్కారం కనుగొనాలి



(మొదటిపేజీ తరువాయి) విడుదల చేసింది. ఆ వివరాలు...

జమిలి ఎన్నికల బిల్లుపై...



లోక్‌సభకు, రాష్ట్రాల శాసనసభలకు ఒకేసారి ఎన్నికలు నిర్వహించేందుకు వీలుగా మోడీ ప్రభుత్వం పార్లమెంటులో రెండు బిల్లుల్ని ప్రవేశపెట్టింది. వీటిలో మొదటిది 129వ రాజ్యాంగ సవరణ బిల్లు. [illegible]

మందిరం-మసీదు వివాదాలపై...

1991వ సంవత్సరపు ప్రార్థనా స్థలాల చట్టాన్ని [illegible]



[illegible]

పార్టీ జాతీయ మహాసభలకు సన్నాహాలు

ఈ సంవత్సరం ఏప్రిల్ 2-6 తేదీల మధ్య మదురైలో జరగనున్న 24వ పార్టీ మహాసభల ముందు ఉంచే ముసాయిదా రాజకీయ తీర్మానం పైన కేంద్ర కమిటీ చర్చించింది. [illegible] ఫిబ్రవరి 1వ తేదీన విడుదల చేస్తారు. [illegible] మార్చి 22, 23 తేదీలలో సమావేశం కావాలని కేంద్ర కమిటీ నిర్ణయించింది.



[illegible]

యూజీసీ ముసాయిదా నిబంధనలపై...



యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ ముసాయిదా నిబంధనలు-2025ను కేంద్ర కమిటీ తీవ్రంగా వ్యతిరేకించింది. [illegible]

వ్యవసాయ మార్కెటింగ్ ముసాయిదా ఫ్రేమ్‌వర్క్‌పై...



[illegible]

ఈసీ నిబంధనలపై...



[illegible]

కేజ్రీవాల్‌ను అడ్డుతొలగించేలా బీజేపీ కుట్ర : అతిశీ



న్యూఢిల్లీ : అరవింద్ కేజ్రీవాల్‌ను ఎన్నికల్లో ఓడించలేని బీజేపీ ఆయన్ని 'తొలగించడానికి' కుట్ర చేస్తోందని ఢిల్లీ ముఖ్యమంత్రి అతిశీ ఆరోపించారు. [illegible]

అమిత్‌షా 'గోబ్యాక్'

ఏపీ వామపక్షాల ఆధ్వర్యంలో హోరెత్తిన నిరసనలు

విజయవాడ: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌పై పార్లమెంట్‌లో అనుచిత వ్యాఖ్యలు చేసిన, అవమానించిన కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా విజయవాడ పర్యటనను వ్యతిరేకిస్తూ వామపక్షాల ఆధ్వర్యంలో ఆదివారం ఏపీ వ్యాప్తంగా నిరసనలు హోరెత్తాయి. [illegible]



[illegible]

అమిత్ షాకు విందు 'సిగ్గు చేటు'

- దళిత, గిరిజన, ప్రజాసంఘాలు

[illegible]

సాగునీటి శాఖపై మంత్రి ఉత్తమ్‌కు అవగాహన లేదు

- బీఆర్ఎస్ మాజీ ఎంపీ వినోద్‌కుమార్



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

సాగునీటి శాఖపై ఆ శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి కనీస అవగాహన లేదని బీఆర్ఎస్ మాజీ ఎంపీ బి.వినోద్‌కుమార్ విమర్శించారు. [illegible]

విద్యాసంస్థలకు మార్గనిర్దేశం అవసరం

- జేఎన్‌టీయూహెచ్ డైరెక్టర్ డాక్టర్ కె విజయకుమార్‌రెడ్డి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

[illegible]

సర్వే సిబ్బందికి హాజరుకు ధ్రువీకరణ పత్రం ఇవ్వాలి : టీఎస్‌సీపీఎస్ఈయూ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

[illegible]

దావోస్ పర్యటనకు ఏపీ సీఎం చంద్రబాబు

ఐదు రోజుల పర్యటనకు బృందం

విజయవాడ: రాష్ట్రానికి పెట్టుబడులే లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు అమరావతి నుంచి ఢిల్లీ మీదుగా దావోస్ పర్యటనకు బయలుదేరారు. [illegible]



నారా లోకేశ్, పరిశ్రమలశాఖ మంత్రి టీజీ భరత్, ఈడీబీ అధికారులు దావోస్ వెళ్తున్నారు.

ట్యాక్స్ టెర్రరిజానికి అంతం పలకండి

కేంద్రానికి కాంగ్రెస్ విజ్ఞప్తి



న్యూఢిల్లీ : [illegible]

21, 27తేదీల్లో యూజీసీ నెట్ పరీక్ష..

అడ్మిట్ కార్డులు విడుదల



న్యూఢిల్లీ: యూజీసీ-నెట్ డిసెంబర్ 2024 పరీక్షకు సంబంధించిన అడ్మిట్ కార్డులు విడుదలయ్యాయి. [illegible] 011-40759000 నంబర్ లేదా ugcnet@nta.ac.inకు [illegible]

అడ్మిట్ కార్డుల కోసం...

[illegible]



విహంగమై ఎగురుతున్నది

పాఠశాలలకు సెలవులు ఇచ్చారు
బాల్యం ఆకాశంలో పతంగయ్యింది
వీధులలో అల్లరి వరదై పారుతుంది
ఇల్లంత సందడితో నిండుతుంది
చదువు పంట సాగు చేసిన
కనురెప్పలు
తాళ్ళను విప్పుకొని నిద్ర చెట్టు కింద
రెప్పలు వాల్చాయి
తల్లిదండ్రులకు బాల్యం
గుండెచప్పుడు వినిపిస్తుంది
బాల్యం ఇంట్లో పెరుగు మీగడై
వొలికి పోతుంది
చదువు బరువు మోసి మోసి
వంగిన మనసు
జూలు విప్పుకొని నిటారై
పరుగు తీసింది
ఎప్పుడు చదువు చిల్కొయ్యకు
వేలాడుతున్న బాల్యం
విడుదలయ్యింది
పొట్టనిండా తింటే
నిద్ర దేవత వచ్చి
ఆవహిస్తుందని వెలితిగా ఉండే
చిన్ని బొజ్జలు నిండుగై
గురకపెడుతున్నాయి
ఉదయం సంధ్యా చూడక
పెలుసుబడ్డ బాల్యం
సూర్యరష్మిలో తానం చేస్తుంది
మట్టి సొబగులు తెలియక
పీచుకట్టిన ఇప్పుడు అందులో
బొర్లి తనువుకు రుద్దుకుంటున్నాయి
మబ్బుల ఇరుకుల్లో
ఇరికిన చందమామ
స్వేచ్ఛగా ఇప్పుడు వెలుగులీనుతుంది

- గుండెల్లి ఇస్తారి
9849983874

సూఫీ పద్యం

వాకింగ్ అంటే
పొద్దున సాయంత్రం
పార్కుల్లోనో సర్వీసు రోడ్డుమీదో
కాలుకొద్దీ తిరిగి రావటం అనే
తెలుసు మనకు-

సంభాషణ అంటే
పక్కనున్నపుడో ఎదురుపడినప్పుడో
ఇరుగుపొరుగుతో ఏదో ఒక మతలబును
వీలుకొద్దీ పంచుకోవడం అనే గుర్తు మనకు-

నేను ముప్పై ఏండ్లకు పైగా
ఉదయ సాయంత్రాలు నడుస్తూ ఉండటాన్నే
బాగున్నానంటున్నాడొకాయన
తేనీటి రసభాషణంలో-



సమీపం దూరం
ఏ కరచాలనాన్ని నిరాదరించింది లేదు
ఆరుపదుల జీవికలో
సహవాసులు నాకో లాగరిథం పట్టిక
అంటున్నాడొకాయన
వాకరిని తనక్కూడా నడిపిస్తూ-

అబద్ధాల్ని నిజాలుగా రక్తికట్టించే
నీతిబాహ్యపు లోకాన
కట్టుకథలతో సత్యాన్ని తుదముట్టించే
విలోమ జగత్తులో
తన లోపలకు తను నడవకుండా
తనతో తను మాట్లాడుకోకుండా
మనిషి

బయట ఎన్నేండ్లు నడుస్తూ
ఎంత మందితో
ఎంత సుదీర్ఘంగా సంభాషించినా
బాగుండేది
బావుకునేది
వట్టి గుండుసున్నా అన్నాడో సూఫీ
అత్తర్ పద్యమొకటి ఆలాపిస్తూ-

ఆడంబరం తెర చించి
అహంభావం చెర విడిపించి
నడకనూ పలకరింపునూ
ముర్షిద్ వెనకాల ముస్తాబు చేయడానికి
సమయం లేదాయె.

- డా.బెల్లి యాదయ్య
9848392690

స్త్రీల పట్ల తెలుగు శతకాల చూపు!

ఈ శ్రీనివాస రెడ్డి

ఆంధ్ర వాఙ్మయమున శాఖోపశాఖలుగా వికాసమునందిన కావ్య ప్రక్రియల్లో శతకమొకటి. ప్రాకృత, సంస్కృత ప్రక్రియల ననుసరించి తెలుగు శతక రచన ప్రారంభమై, కాలక్రమేణా విశిష్ట సాహితీ ప్రక్రియగా రూపొందింది. తెలుగులో పన్నెండో శతాబ్దంలో శతకమావిర్భవించినది. ఈ ఎనిమిది వందల యేండ్లలో తెలుగు శతకం శాఖోపశాఖలుగా విస్తరిల్లి స్వరూపంలోనూ స్వభావంలో ఎంతో మార్పు చెందింది. భారతీయ భాషల్లో ఎందులోనూ శతక ప్రక్రియ తెలుగులో వలె బహుముఖ వికాసము పొంది వైశిష్ట్యం పొందలేదు. నేటికీ ఏ మూలనో ఒక చోట శతకం వెలువడుతూనే ఉన్నది. సజీవ స్రవంతి వలె అవిచ్ఛిన్నంగా సాగుతూ వస్తున్నది శతకమే.

శతక పద్యాల్లో ఎక్కువగా లోక నీతులు, సామాజిక చైతన్యానికి సంబంధించినవి ఉంటాయి. సమాజంలోని అన్ని సమస్యలు భిన్న కోణాల్లోంచి దర్శించి ఆ దర్శన వైశిష్ట్యాన్ని పద్యాల్లో కనపరిచేవారు శతకకారులు. కుటుంబ వ్యవస్థలోని లోటు పాట్లు, మతం పేరిట జరుగుతున్న దోపిడీలు, విగ్రహారాధనను నిరసించడం, కుహనా గురువులు, దొంగ సన్యాసులు ఒకటేమిటి కనిపించిన ప్రతి సామాజిక అస్తవ్యస్తత మీద వీరు కలం ఝళిపించేవారు. ఈ పద్యాలకు బహుళ ప్రచారం లభించటానికి కారణాలు చాలా ఉన్నాయి. సామాన్య నీతులను ప్రజల హృదయాలకు హత్తుకొనేట్టు వారికి పరిచితమైన భాషలో, స్పష్టమైన రీతిలో సూటిగా, తేటగా, శక్తివంతంగా వ్యక్తీకరించటం, సామాన్యులైన వారిలో తమను ఒకనిగా భావించుకుని నీతి ఉపదేశం చేయటం ప్రధాన గుణం. సునిశితమైన హాస్య, వ్యంగ్య, అధిక్షేప చమత్కృతులతో కల్పించి, నవ్వించి ఎదుటివారి లోపాలను, తన లోపాలను, గుర్తెరిగి ఉపదేశించిన రీతిని గమనించేట్టు చేసే శైలిని ప్రదర్శించే వారు.

కానీ దురదృష్టవశాత్తు శతకాల్లో స్త్రీలకు ఇవ్వాల్సిన గౌరవమైన స్థానాన్ని ఇవ్వలేదు. మహిళల హక్కుల గురించి గాని, వారి స్వేచ్ఛా స్వాతంత్ర్యాల గురించి గానీ, వారు గురువుతున్న వివక్షత గురించి గానీ శతకాల్లో ఎక్కడా వివరించినట్టు మనకు కనపడదు. దానికి కారణం బహుశా శతకకారులు ఎక్కువ మంది పురుషులు అవ్వటం, వారు రచించిన కాలంలో సమాజంలో పురుషాధిక్యత ఎక్కువగా ఉండటం. శతకకారులు కూడా సామాన్య ప్రజానీకం వలే, పితృస్వామ్య వ్యవస్థ వైపు మొగ్గుచూపుతూ స్త్రీల పట్ల చిన్న చూపు కలిగి ఉండటం ఇంకొక కారణం.

మొదటగా మనం, వేమన శతకంలోని పద్యాలను పరిశీలించినట్లయితే మహిళల వ్యక్తిత్వాన్ని ఎంతో చులకనగా ఆయన చిత్రీకరించాడని చెప్పక తప్పదు. భార్య సంపద ఉన్నప్పుడు మాత్రమే భర్తను గౌరవిస్తుందని, భార్యను అదుపులో పెట్టుకోలేకపోతే గౌరవం ఇవ్వదని, మహిళలు మగవారికి ఎదురు చెప్పకూడదని, భర్త ఎంత చెడ్డ వాడైనా కూడా అతనిని సేవిస్తూ ఉండాలనే అభిప్రాయాన్ని తన పద్యాల్లో కనపరిచాడు. ఆధునిక భావజాలం కల వేమన మహిళల పట్ల ఇటువంటి ఆలోచనలు కనపరచడం కొంతవరకూ దురదృష్టకరం. వేమన మొదట స్త్రీలోలుడు. వేశ్యా వాటికల చుట్టూ తిరిగినట్టు చరిత్ర చెబుతోంది. వేమన రాజకీయాలు పట్టించుకోక ఒక వేశ్య వలలో చిక్కుకుంటాడు. వేమన వదిన నరసాంబ రాణి. ఆ వేశ్య.. రాణి ఆభరణాలు ధరించి అద్దంలో చూసుకోవాలని కోరుతుంది. మాతృప్రేమ గల నరసాంబ రాణి బులాకి తప్ప మిగతా అభరణాలు యిచ్చింది. వేశ్య బులాకీ కూడా కావాలని పట్టుబట్టింది. చీకట్లోనూ దీపంలాగే వెలిగే బులాకీని, ఆభరణాలు అన్నీ వేసుకున్న తర్వాత వేశ్య నగ్న దేహం చూడమనే షరతుతో ఇస్తుంది. అలా చూసిన వేమనకు మగువంటే విరక్తి కలిగి రోతపుట్టి, కోటకు వెళ్లి పడుకుంటాడు. బహుశా అటువంటి వారి సాంగత్యం వల్లే మహిళల పట్ల ఇటువంటి అభిప్రాయానికి వచ్చి ఉండొచ్చు.

ఆలి తొలుత వంచ కథముదైతా వెనుక
వెనుక వంతు ననుట వెర్రితనము
చెట్టు ముదరనిచ్చి చిదిమితే బోవునా
విశ్వదాభిరామ వినుర వేమ

"భార్యను తొలిగానే అదుపులో పెట్టుకోవాలి. తర్వాత అదుపులో పెట్టుకోవచ్చులే అనుకొనుట వెర్రితనం. చెట్టు పెద్దదైన తర్వాత సులభంగా పీకలేం"

కలిమినాడు మగని కామముగాజూచును
లేమిజిక్కునాడు, లేవకుండు
మగువ మగనినైన మడియంగ జూచును
విశ్వదాభిరామ వినుర వేమ

"సంపద వున్నప్పుడు భార్య భర్తను ప్రేమతో చూస్తుంది. పేదరికంలో మంచంపై నుండి లేవకుండా ఇటువంటి భర్త చనిపోయినా బాగుండుననుకుంటుంది"

పై పద్యాల వంటివి స్త్రీలను చులకనగా చూపుతూ, పితృస్వామ్యాన్ని సమర్థిస్తూ చెప్పటం వేమన ప్రగతిశీల వ్యక్తిత్వానికి మచ్చగా మిగిలిపోతుంది.



తెలుగులో శతక సాహిత్యం పామరులకూ పండితులకూ వారధిగా నిలిచింది. వీటిలో వేమన శతకానికీ, సుమతీ శతకానికీ ఉన్న ప్రాచుర్యము గురించి వేరే చెప్పాల్సిన పని లేదు. శతక రచనల్లో కవికి బోలెడంత స్వేచ్ఛ ఉంది. చదివేవాడికి కూడా రోజుల తరబడి ఒకే గ్రంథాన్ని అధ్యయనం చేయాల్సిన పని బడదు. కనుక ఒక్క పద్యంతోనే కవికీ, చదువరికీ అనుబంధం ఏర్పడవచ్చును. శతకాలు క్లుప్తంగా విషయాన్ని విడమరచి చెప్పే సాధనాలు. అందుకే ఇవి ప్రజా కవిత్వముగా ఆదరణ సంతరించుకొని ఉండవచ్చును. ఇంతటి ప్రాచుర్యం గల శతకాల్లో స్త్రీని తక్కువగా చూపి వర్ణించుట, వ్యక్తిత్వాన్ని కించపరచడం ఎంతైనా ఆక్షేపణీయం.

ఇప్పటి "సామాజి స్పృహ" పరంగా ఉన్న అవగాహనతో చూస్తే కొన్ని పద్యాల్లో కనిపించే ఆనాటి దృష్టి అసంబద్ధంగా కనిపిస్తుంది. ముఖ్యంగా స్త్రీల పట్ల, కొన్ని కులాల పట్ల వ్యక్తమైన అభిప్రాయాలు దురాచారాలుగా అనిపిస్తాయి. ఎవరైనా తమ కాలానికి సంబంధించిన అభిప్రాయాలకు బందీలే అని మనం గ్రహించాలి.

క్రీ.శ. 1220-1280 మధ్య కాలంలో బద్దెన లేదా భద్ర భూపాలుడు రచించిన సుమతీ శతకంలో మహిళల పట్ల ఇటువంటి అభిప్రాయాలే కనపడతాయి. ఇతడు కాకతీయ రాణి రుద్రమదేవి (1262-1296) రాజ్యంలో ఒక చోళ సామంత రాజు. బహుశా ఒక మహిళ రాజ్యమేలటం ఇష్టపడక పోవడం లేదా ఒక మహారాణి కింద సామంతురాజులా కొనసాగటానికి అభిజాత్యం అడ్డు కావడమో కానీ, మహిళల పట్ల ఇటువంటి అభిప్రాయలు వ్యక్తం చేసి ఉండవచ్చు. మహిళల నోళ్లలో నిజాలు దాగవని ప్రజలకు విశ్వాసం ఉండదని, భార్యలు కేవలం సంపాదన ఉన్న భర్తలకే గౌరవిస్తారని, స్త్రీలు ప్రేమిస్తారని నమ్మకూడదని అభిప్రాయాలను కవి తన పద్యాల్లో వ్యక్తం చేశాడు.

అల్లుని మంచితనంబును
గొల్లని సాహిత్యవిద్య, కోమలి నిజమున్
బొల్లున దంచిన బియ్యముం
దెల్లని కాకులును లేవు తెలియర సుమతీ

అల్లుని మంచితనము, గొల్లవాని పాండిత్య జ్ఞానమును, ఆడదాని యందు నిజమును, పొల్లు ధాన్యములో బియ్యమును, తెల్లని రంగు కాకులు లోకములో నుండవు.

కోమలి విశ్వాసంబును
బాములతోఁజెలిమి యన్య భామలవలపున్
వేముల తియ్యఁదనంబును
భూమీశుల నమ్మికలును బొంకుర సుమతీ

స్త్రీల నమ్మకమును, పాముల స్నేహమును, పరస్త్రీల మోహమును, వేపచెట్ల తియ్య దనమును, రాజుల విశ్వాసమును నమ్మరాదు. అవి అసత్యములుగా నిర్ణయించి జీవనము చేయాలి అని భావం.

గడనగల మననిఁజూచిన
నడుగగడుగున మడుఁగులిడుచు రతివలు తమలో
గడ సుడుగు మగనిఁ జూచిన
నడుపీనుఁగు వచ్చెననుచు నగుదురు సుమతీ!

స్త్రీలు సంపాదన ఉన్న భర్తను చూస్తే అడుగులకు మడుగులు ఒత్తుతారు, పూజిస్తారు. సంపాదన లేని మగడిని చూస్తే నడిచే శవం వచ్చిందని హీనంగా మాట్లాడతారు.

ఇదే వరుసలో మర్రి వెంకయ్య రచించిన భాస్కర శతకం, పక్కి వెంకట నరసింహ కవి రచించిన కుమార శతకాలు కూడా వస్తాయి. వీరు కూడా మహిళల వ్యక్తిత్వాలను పురాణాల ఆధారంగా ఎప్పటివో పాత కథల ఆధారంగా చిత్రీకరించారు తప్ప కాలానుగుణంగా వస్తున్న మార్పులను వీరి పద్యాలలో కనపరచ లేకపోయారు.

అంగన నమ్మరాదు తనయంకెకురాని మహాబలాఢ్యువే
భంగుల మాయలొడ్డి చెఱపందల పెట్టు, వివేకియైన
సారంగధరుం బదంబుఁగరంబులు గోయఁగజేసెఁదొల్లిచి
త్రాంగియనేకముల్ నుడవరాని కుయుక్తులు పన్ని భాస్కరా!

స్త్రీ వ్యామోహముచే పురుషుని కోరగా అతడు నిరాకరించినచో వానికి అనేక నిందారోపణములు చేసి, రాజులచే కఠిన శిక్ష విధించు వరకు తన పన్నాగము వదలదు. పూర్వము చిత్రాంగియను స్త్రీ సారంగధరుని ప్రేమించగా, అతడు నిరాకరణ తెలుపగా రాజు వద్దకు వెళ్ళి అనేక ఫిర్యాదులు చేసి అతని కాళ్ళు, చేతులు నరికించినది కదా! అందుకే అలాంటి స్త్రీలను నమ్మరాదు. బలవంతుడైననూ బాధలకు గురియగును.

ఋణ మధిక మొనర్చి సమర్పణ
చేసిన తండ్రి విద్యరాని కొడుకు
లక్షణశాలి రాణి దుశ్చారిణియగు
జననియును దల్ప రిపులు కుమారా!

ఓ కుమారా! కుమారులకు అప్పులను ఆస్తులుగా ఇచ్చిన తండ్రి, విద్యలేని కుమారుడు, అందమైన భార్య, చెడునడత గల్గిన తల్లి ఆలోచించినచో వీరందరూ శత్రువులే సుమా!

సాధారణంగా ఇతర కావ్య, సాహిత్య ప్రక్రియలు పండితులకు పరిమితమైనాగాని, శతకాలు మాత్రం సామాన్య ప్రజానీకంలో ఆదరణపొందినవి. ఇలా తెలుగులో శతక సాహిత్యం పామరులకూ పండితులకూ వారధిగా నిలిచింది. వీటిలో వేమన శతకానికీ, సుమతీ శతకానికీ ఉన్న ప్రాచుర్యము గురించి వేరే చెప్పాల్సిన పని లేదు. శతక రచనల్లో కవికి బోలెడంత స్వేచ్ఛ ఉంది. చదివేవాడికి కూడా రోజుల తరబడి ఒకే గ్రంథాన్ని అధ్యయనం చేయాల్సిన పని బడదు. కనుక ఒక్క పద్యంతోనే కవికీ, చదువరికీ అనుబంధం ఏర్పడవచ్చును. శతకాలు క్లుప్తంగా విషయాన్ని విడమరచి చెప్పే సాధనాలు. అందుకే ఇవి ప్రజా కవిత్వముగా ఆదరణ సంతరించుకొని ఉండవచ్చును. ఇంతటి ప్రాచుర్యం గల శతకాల్లో స్త్రీని తక్కువగా చూపి వర్ణించుట, వ్యక్తిత్వాన్ని కించపరచడం ఎంతైనా ఆక్షేపణీయం.

మహిళా సాధికారతకు పెద్దపీట వేస్తున్న నేటి ఆధునిక యుగంలో మహిళలను కించ పరిచే భావనలు వచ్చే పద్యాలను నేటి తరానికి అందుబాటులో లేకుండా చూడాల్సిన అవసరం ఉంది. లేదా కాలానుగుణంగా వచ్చిన మార్పులకు అనుగుణంగా శతకాల్లోని పద్యాలను కూడా మార్చాల్సిన అవసరం ఉంది.

గుండెకో స్వాంతన

నాకిప్పుడొక గుండె తోడు కావాలి
లేకుంటే ఆ గుండె శబ్దించే లయాత్మక ధ్వని
ఆగిపోతుందేమోననెలా

సగం మోదం
అర్థం ఖేదం
ఆనందం పంచే అమృత హృదయం
విషాదం మింగించే హాలహలం
ఈ ద్వయం నిరంతరం
నా మస్తిష్కంలో జొరబడి
తెగ అల్లకల్లోలం చేస్తున్నాయి

అంతర్వాహినిలో అసమాన
నిరుపమాన ప్రేమ కెరటాలు
ఒక్కోసారి శాంతంగా
ఇంకోసారి అవిశ్రాంతంగా
సందడి చేస్తూ అలజడి సృష్టిస్తూ
ఉవ్వెత్తున ఎగసి పడుతున్నాయి

ఉన్నట్టుండి ఆకాశంలో విహారం
అధాటున అవనిపై పడదోయటం
ఇప్పుడు నా జీవనగమనంలో

ఎన్నెన్నో తీయని రాతిరి కలలు
మరెన్నో కరకు రాతి దెబ్బలు

అప్పుడప్పుడూ
నా గుండె గిన్నెలో కాసిన్ని
తేనెల మాటల ఊటలు జార్చినట్టే జార్చి
ఆ గిన్నెకు సూక్ష్మపు బెజ్జాలు పెట్టి
ఆ తావిని ఒలకబోస్తూ

అంటే మనసుకు సుగంధం పూసినట్టే పూస్తూ
తటాలున తిరస్కారపు సమ్మెతో కొట్టినట్టుగా

అందుకే... కనుకనే
నా గుండెకిప్పుడు
స్వాంతన కూర్చే లేపనం పూసే
ప్రేమ ధన్వంతరి కావాలి

ఈ నా హృదయంపై శాంతిగొల్పే
కమ్మని పలుకుల వాన కురవాలి
వదులైన తీగను సవరించి
శృతిలో పలికించే అనురాగ వీణ కావాలి.

- నాగముని. యం (నాగ్)
9490856185

చిరిగిన నోటు



నా చేతుల్ని నెలంతా కీబోర్డుకి
హవనంగా వేసా...
వేల లైన్ల కౌంటింగ్‌లో
అక్కడక్కడా వొవర్ మినిట్స్ కష్టం
ఉబ్బిన చేతల సాక్షిగా వగచుతాయి
నోళ్లు తెరిచిన కోరిక గొంతుక దప్పికని
పది జీతంరాళ్లు తీర్చలేక చతికిల బడ్డాయి
ఖర్మకాలి పేయి రెస్ట్ కోరితే
మొత్తంలోని కోతలు కలవర పెడతాయి
నెల జీతం కోసం
కళ్లు కాలెండర్‌కి ఉరేసుకుంటాయి
చిరిగిన వొక్క నోటుకై
బతుకుని ఉద్యోగానికి తాకెట్టు పెట్టినాను...
మధ్యతరగతి ఆశల కేకలలో
నిత్యం సతమతవుతూ జీవిస్తున్నాను.

- పుష్యమీ సాగర్, 7997072896

సాహితీ వార్తలు

21న వుప్పల నరసింహం యాదిలో సభ

సీనియర్ జర్నలిస్ట్, కథా రచయిత, వ్యాసకర్త వుప్పల నరసింహంను యాది చేసుకుంటూ ఈ నెల 21న మంగళవారం మధ్యాహ్నం 2 గంటలకు బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్‌లోని సురవరం ప్రతాపరెడ్డి ఆడిటోరియం 1వ అంతస్తులో హైదరాబాద్ మిత్రులు కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో సభ నిర్వహించనున్నారు. వుప్పల బాలరాజు సభాధ్యక్షులుగా, జయధీర్ తిరుమల రావు, బి.ఎస్.రాములు వక్తలుగా, ఆడెపు లక్ష్మీపతి, కవి యాకూబ్, సంగిశెట్టి శ్రీనివాస్, ఎస్.యం.ప్రాణ్ రావు, తుమ్మలపల్లి రఘురాములు, శంకర నారాయణ, అనిల్ అట్లూరి, వనపట్ల సుబ్బయ్య, కెపి.అశోక్ కుమార్, జంపాల ప్రవీణ్ తదితరులు ప్రసంగించనున్నారు.

రచనాతురాణాం న ధనం..



నేను పెన్ను పెట్టుకున్నన్ని రోజులూ
నా జేబుకి ఓ వెన్నెముక ఉండేది
క్రమంగా నేను
జేబులో డబ్బులు దోపుకోవటం చూసి
నా పెన్ను
తన పత్తీ (పాళీ), బుర్రా (క్యాప్) కొట్టుకొని
వద్దని మొత్తుకోవటం మొదలెట్టింది
నేనసలు విని బతికితే కదా!
పర్యవసానం...
ఇప్పుడు నా జేబుకి వెన్నునొప్పి వచ్చింది
పెన్ను పెయిన్‌తో రాయటమే లేదు

- నలిమెల భాస్కర్

అక్షర వైజయంతి 'స్వాతి శ్రీపాద'కు 'శ్రీమతి సుశీలా నారాయణరెడ్డి పురస్కారం'

దాదాపు నాలుగున్నర దశాబ్దాలుగా తెలుగు నేల మీద ప్రతిభామూర్తులైన స్త్రీమూర్తులను సత్కరిస్తూ, ప్రతిష్టాత్మక 'శ్రీమతి సుశీలా నారాయణ రెడ్డి పురస్కారం' అందిస్తోంది సుశీలా నారాయణ రెడ్డి ట్రస్టు. మహాకవి, భారతీయ జ్ఞానపీఠ పురస్కార గ్రహీత డాక్టర్ సి.నారాయణ రెడ్డి సతీమణి సుశీలమ్మ పేర కుటుంబ సభ్యులు 1984లో ప్రారంభించగా, తొలి పురస్కారం విధుషీమణి ఊటుకూరి లక్ష్మీకాంతమ్మకు అందించారు. ఇప్పటిదాకా నలభై ఒక్క మంది విద్వన్మణులైన స్త్రీ మూర్తులకు ఈ పురస్కారాన్ని అందించగా దీన్ని 'రసమయి' తన వేదిక మీద నిర్వహిస్తోంది. ఈ ప్రతిష్టాత్మక పురస్కారం 2025కు గాను ప్రముఖ కవయిత్రి, రచయిత్రి, తెలుగు ఆంగ్ల భాషానువాదకులు, విశ్రాంత కేంద్రీయ విద్యాలయ ఆంగ్లోపాధ్యాయిని స్వాతి శ్రీపాదకు దక్కింది.

- డా. పత్తిపాక మోహన్, 9966229548

నాలుగు దశాబ్దాలుగా రచనలు చేస్తున్న స్వాతి శ్రీపాద, మరో ముగ్గురు కవులు తమ తొలి రచనలు ఇందూరు భారతి ద్వారా అచ్చువేశారు. స్వాతి శ్రీపాద నిజామాబాద్ డిగ్రీ కళాశాల విద్యార్థినిగా ఉన్నప్పుడే ఈ సంకలనం వచ్చింది. స్వాతితో ఇందులో కవిత్వం తెచ్చిన ఆనాటి నిజామాబాద్ నవ యువ కవులు ఏ.సూర్యప్రకాష్, సైబ, బద్దూరిలు. 'చౌరస్తా' పేరుతో వచ్చింది. కవుల ముఖ చిత్రాలతో సైక్లోస్టైల్ ప్రింటు రూపంలో వచ్చిన ఈ కవితా సంకలనం ఆనాటి తెలంగాణ యువ కవుల బలమైన సంతకాల్లో ఒకటి. 1970 నుంచి కవిత్వం రాస్తున్న స్వాతి శ్రీపాద నిరంతరం కవిత్వం, ఇతర ప్రక్రియల్లో రచనా వ్యాసంగం నిర్వహిస్తున్నప్పటికీ ఉద్యోగరీత్యా వాటిని మరో రెండు దశాబ్దాల వరకు పుస్తకంగా తేలేదు. అటు తరువాత వెనుతిరిగి చూడలేదు. ఇప్పటి వరకు ఎనమది కవితా సంపుటాలు, ఆరు కథా సంపుటాలు, ఎనిమిది నవలలు, నలభైకి పైగా వివిధ భాషల్లోంచి తెలుగులోకి, తెలుగు నుంచి ఆంగ్లలోకి అనువాదాలు అచ్చయ్యాయి. తొలి యువ కవుల కవిత్వం చౌరస్తా తరువాత ఏర్చికూర్చిన కొన్ని కవితలను 'హృదయంలో అడుగులు' పేరుతో ప్రచురించింది స్వాతి. అటు తరువాత 'మనసుకు చూపుంటే...', 'ఎడారులు, ఎండ మావులు', 'సుప్తక్షణం', 'పోతబొమ్మ', 'కలలకు కాలం చెల్లింది' తెలుగు కవితా సంపుటాలు. 'వాకింగ్ టుగెదర్' పేరుతో ఆంగ్ల కవితా సంపుటి వచ్చాయి. 'మూగవీణ', 'అవతలివైపు', 'పొరలు', 'పంజరం విడిచి', 'మల్లెలు-కనకాంబరాలు' స్వాతి ప్రచురించిన కథా సంపుటాలు. 'పడమటి సూర్యోదయం', 'అపరిష్కృతం', 'పునరాగమనం', 'శిశిర వసంతం', 'చుక్కాని దీపం', 'జీవన వేదం', 'టగ్ ఆఫ్ వార్', 'ఎక్కడి నుంచి ఇక్కడి దాకా..' అచ్చయిన నవలా సాహిత్యం. నలభైకి పైగా తెలుగు, ఇంగ్లీష్‌లో చేసిన అనువాదాల్లో సాహిత్య అకాడమి, నేషనల్ బుక్ ట్రస్ట్ ఇండియా వంటి సంస్థలతో పాటు డా.సినారె, డా.ఎన్.గోపి, కె.శివారెడ్డి మొదలు నేటి నవ యువతరం రచయితలు, కవుల రచనలను ఆంగ్లంలోకి చేశారు. తెలుగులోకి ఆంగ్లం, హిందీ నుంచి తెచ్చినవి, బాల సాహిత్య అనువాదాల సంఖ్య ఎక్కువే.



కవయిత్రిగా స్వాతి శ్రీపాదది విలక్షణ అభివ్యక్తి, చక్కని భావ చేతన. దీనిని తొలి కవిత్వం నుంచి నేటి దాకా తన రచనల్లో చూపుతారామె. ముఖ్యంగా 'సుప్త క్షణాలు' కవితా సంపుటి చూస్తే స్వాతి అభివ్యక్తి, శిల్పం తెలుస్తుంది. 'ఒక్కడ ఎవరైనా ఒకటే' కవితా సంపుటి కూడా ఇలాంటిదే. ఇందులోని ప్రతి కవిత పదునైన భావచిత్రాలకు ఆలవాలంగా నిలుస్తుంది. దీనికి సిరికోన సిలీకాన్ వ్యాలీ బహుమతి వచ్చింది. తనకు తారసపడిన అనేక సంఘటనలు, సందర్భాలను, తన మస్తిష్కాన్ని తొలచిన అంశాలను కవయిత్రి ఇందులో కవిత్వంగా మలిచింది.

కథా, నవలా రచయిత్రిగా స్వాతి శ్రీపాద ప్రతి అక్షరంలో సామాజిక సమస్యలు, సంఘర్షణలను, తన మనసులోని అలజడులను కథలుగా మలిచింది. ఒకటని కాదు ప్రతి సంపుటి అందుకు సాక్ష్యంగా నిలుస్తుంది. విహారి కితాబు ఇచ్చినట్టు 'కథా సంవిధానాన్ని ఇడుపుగా పట్టుకున్న నేర్పరి' స్వాతి శ్రీపాద. మానవ జీవనంలోని అనేక పార్శ్వాలను ఎంత బాగా తన రచనల్లో వ్యక్తీకరించారో అమలిన శృంగారతత్వాన్ని కూడా తన రచనల్లో చక్కగా చెబుతారీమె. అందుకు స్వాతి రాసిన 'నీ కోసమె... నే' అనే కథ ఉదాహరణ. స్వాతి కథా కథన కౌశాలానికి, నిర్వహణతో పాటు చక్కని ఉహకు ఈ కథను మేలిమిరాయిగా పట్టి చూపొచ్చు. వీరి అనేక కథలు మధ్యతరగతి నేపథ్యాన్ని, అందులోని సాధకబాధకాల్ని వ్యాఖ్యానిస్తాయి. వాటికి కొన్నిసార్లు తాను పుట్టి పెరిగిన నిజామాబాద్ నేపథ్యంగా నిలిస్తే మరికొన్నింటికి తాను పనిచేసిన ఇతర రాష్ట్రాల్లోని భాషా ప్రదేశాలు ఆకారాలవుతాయి. మరికొన్ని తాను నివసిస్తూ నిత్యం చూస్తున్న అపార్టుమెంట్ జీవితాలు, అమెరికా జీవితాలను చూపిస్తే... కొన్ని



కథలు సమాజంలోని అనేక డొల్లలను మనకు వెక్కిరిస్తూ కనిపిస్తాయి. వీరి 'క్లాష్' కథను ఒకసారి మనం చూసినట్టయితే అది అనేకానేక అంశాలకు అతి పెద్ద కాన్వాస్‌గా మనకు కనబడుతుంది. కథను చెప్పనుగానీ కథలోని ప్రధాన పాత్రతో రచయిత్రి చెప్పించిన తీరు అదేంటో మనకు క్షణంలో అర్థమవుతుంది. ఇక స్వాతి శ్రీపాద నవలల విషయానికి వస్తే అన్నీ కూడా సమాజం తీరుతెన్నుల్ని, జీవితాలను ప్రతిబింబించేవే. ఎనిమిది నవలల్లో దేని విశిష్టత దానిదే అయినా, నవలా రచయిత్రిగా స్వాతిని విలక్షణంగా నిలబెట్టేది మాత్రం 'పురాగమనం' నవల. చదువుకున్న, నగరజీవులైన ఒంటరి మహిళగా కథానాయిక పాత్రను స్వాతి తీర్చిదిద్దిన విధానం అనితరసాధ్యంగా చెబుతారు 'దేరా'. ఒక్కమాటలో చెప్పాలంటే నిత్యం సంఘర్షణలకు లోనయ్యే ఆధునిక మహిళ అంతరంగం ఇది.

కవయిత్రిగా, కథా రచయిత్రిగా, అనువాదకులుగా దశాబ్దాలుగా తన ముద్రను వేసి, తనదైన సంతకాన్ని స్థిరపరచుకున్న స్వాతి శ్రీపాదకు ప్రతిష్టాత్మక సుశీలా నారాయణ రెడ్డి పురస్కారం లభించడం ప్రతిభకు అందిన అరుదైన గౌరవం, మరో తెలంగాణ సాహితీమూర్తికి దక్కిన స్ఫూర్తి పురస్కారం.

(ఈ రోజు రవీంద్ర భారతిలో సుశీలా నారాయణ రెడ్డి పురస్కారం అందుకుంటున్న సందర్భంగా...)

దర్వాజ పేజీపై మీ అభిప్రాయాలను, సూచనలను, సలహాలను, రచనలను darwajapage@ gmail.com కు పంపించగలరు. చిరునామా : దర్వాజ, నవతెలంగాణ, ప్లాట్‌నెం. 21/1, అజమాబాద్, ఇండస్ట్రియల్ ఏరియా, బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్- 500020

మేడ్చల్, శామీర్‌పేట్ కారిడార్లకు
వినూత్న మెట్రో మార్గాలు

- సీఎం సూచన మేరకు జేబీఎస్‌ను ప్రపంచ స్థాయి మెట్రో హబ్‌గా అభివృద్ధి చేస్తాం : మెట్రో ఎండీ ఎన్వీఎస్ రెడ్డి
- కంటోన్మెంట్ పరిసర ప్రాంతాల్లో ఎండీ క్షేత్రస్థాయి పరిశీలన

ఈ రెండింటితో ఎయిర్‌పోర్ట్ కారిడార్ అనుసంధానం



నవతెలంగాణ-సిటీబ్యూరో

హైదరాబాద్ మెట్రో ఫేజ్-2లో సరికొత్త సాంకేతిక ఆవిష్కరణలకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టనుంది. ముఖ్యంగా మేడ్చల్, శామీర్‌పేట్ దిశగా సాగే కారిడార్లు కొత్త రూపురేఖలు సంతరించుకోనున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దార్శనికతకు అనుగుణంగా మెట్రో ఎండీ ఎన్వీఎస్ రెడ్డి సారథ్యంలో సాంకేతిక నిపుణులు, అధికారులు హైదరాబాద్ ప్రజల సౌకర్యవంతమైన ప్రయాణానికి కొత్త మెట్రో మార్గాలను రూపొందించే కసరత్తును ప్రారంభించారు. ఫేజ్-2 పార్ట్ 'బీ'లో ప్యారడైజ్ - మేడ్చల్ (23కి.మీ), జేబీఎస్-శామీర్‌పేట్ (22కి.మీ) ప్రతిపాదిత కారిడార్ అలైన్‌మెంట్ల విషయంలో ఉన్న సాంకేతిక సవాళ్లను పరిష్కరించడానికి మెట్రో ఎండీ ఎన్వీఎస్ రెడ్డి, సీనియర్ ఇంజినీర్లు, సాంకేతిక సలహాదారులు ఆదివారం క్షేత్రస్థాయి పరిశీలన జరిపారు. ఈ రెండు కారిడార్ల ఏర్పాటులో ఇంజినీరింగ్ పరంగా ఎదురవుతున్న కొన్ని సంక్లిష్ట అంశాలను గుర్తించారు.

బేగంపేట్ విమానాశ్రయ సరిహద్దు వెంబడి ప్యారడైజ్ నుంచి బోయినపల్లి వరకు రోడ్డు వంపు చాలా ఎక్కువగా ఉండటం, విమానాశ్రయ అధికారుల ఆంక్షల కారణంగా హెచ్ఎండీఏ తన ఎలివేటెడ్ మార్గాన్ని కొంత దూరం పాటు భూగర్భ మార్గంగా మార్చుకుంది. ఈ అలైన్‌మెంట్‌ను బేగంపేట విమానాశ్రయం(తాడ్‌బండ్-బోయినపల్లి వైపు) రన్‌వే కింద దాదాపు 600 మీటర్ల దూరం భూగర్భ సొరంగం ద్వారా తీసుకువెళ్తుంది. హెచ్ఎండీఏ మార్గానికి అనుసంధానంగా రెండు స్థాయిలపైన ఉండే డబుల్ ఎలివేటెడ్ మెట్రో మార్గాన్ని ఈ భూగర్భ సొరంగంలోకి దింపి, మళ్లీ రెండు స్థాయిల ఎలివేటేడ్ మార్గంగా పైకి తీసుకురావడం అనేది ఇంజినీరింగ్ పరంగా అనేక సమస్యల్ని సృష్టిస్తుంది. ఈ సమస్యలను విశ్లేషించి అనువైన మార్గానికి ప్రణాళికలు సిద్ధం చేయడానికి మెట్రో అధికారులు నడుం బిగించారు. అలాగే, ముఖ్యమంత్రి సూచించిన ప్రకారం మేడ్చల్, శామీర్‌పేట్ కారిడార్‌ల ప్రారంభం స్థానాన్ని జేబీఎస్ వద్ద ఏకీకృతం చేయడం, ఇక్కడ ప్రపంచ స్థాయిలో ఒక హబ్‌ని ఏర్పాటు చేయడం, ఈ కారిడార్లు కొంత దూరం వెళ్లిన తర్వాత వాటిని విడదీసి, రెండు మెట్రో కారిడార్లుగా రూపొందించడం వంటి అంశాలను దృష్టిలో పెట్టుకొని తమ క్షేత్ర పర్యటనను మెట్రో ఎండీ కొనసాగించారు. తన బృందంతో కలిసి కంటోన్మెంట్ ప్రాంతంలోని అనేక ప్రత్యామ్నాయ రోడ్లపై పూర్తిగా నడిచి, సాధ్యమైనంత ఉత్తమమైన మెట్రో రైలు అలైన్‌మెంట్ ఏర్పాటుకు పరిశీలనలు జరిపారు.

సీఎం రేవంత్ రెడ్డి సూచన మేరకు ఉత్తర తెలంగాణ జిల్లాల నుంచి వచ్చే వారితోపాటు సికింద్రాబాద్, నగరంలోని ఉత్తర ప్రాంతాల నివాసితుల రాకపోకలు, ఇతర అవసరాలను తీర్చడానికి జేబీఎస్‌ను ఒక ప్రపంచ స్థాయి మెట్రో హబ్‌గా అభివృద్ధి చేసే ప్రణాళికలు రూపొందిస్తామని మెట్రో ఎండీ తెలిపారు. ఇందుకోసం

సులువుగా భూముల సమీకరణ..

జేబీఎస్ పరిసరాల్లో రాష్ట్ర ప్రభుత్వానికి, రక్షణశాఖకు చెందిన సుమారు 30 ఎకరాల భూమిని సమీకరించవచ్చని వెల్లడించారు. ఈ క్షేత్ర పర్యటనలో హెచ్ఏఎంఎల్ చీఫ్ ప్రాజెక్ట్ మేనేజర్ బి.ఆనంద్ మోహన్, జనరల్ మేనేజర్లు బి.ఎన్. రాజేశ్వర్, ఎం.విష్ణు వర్ధన్ రెడ్డి, ఎ. బాలకృష్ణ, డిప్యూటీ సీఈ(రైల్వేస్) జె.ఎన్.గుప్తా, ఇతర సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

అన్నివిధాలా అనువుగా ఉండేలా..!

జేబీఎస్-సికింద్రాబాద్ క్లబ్‌రోడ్, స్టాఫ్‌రోడ్(పికెట్ కేవీ స్కూల్ రోడ్), మడ్‌ఫోర్ట్ రోడ్, టీవోలి జంక్షన్ రోడ్, డైమండ్ పాయింట్ జంక్షన్, సెంటర్ పాయింట్ జంక్షన్, హస్మత్‌పేట్ జంక్షన్, బోయినపల్లి (సరోజిని పుల్లారెడ్డి బంగ్లా) రోడ్‌బీ తాడ్‌బండ్-ఆంజనేయ స్వామి ఆలయం రోడ్-తాడ్‌బండ్ జంక్షన్-ఎయిర్ పోర్ట్ ఆఫీస్ జంక్షన్-బోయినపల్లి చెక్ పోస్ట్ రోడ్ మొదలైనవి వీరు కాలినడకన పరిశీలించిన మార్గాల్లో ఉన్నాయి. క్లిష్టమైన మలుపులను, విమానాశ్రయం కింద భూగర్భంలో అలైన్‌మెంట్‌ను తీసుకువెళ్లే ఆవశ్యకతను నివారించే విధంగా, ప్రయివేట్ ఆస్తుల సేకరణను వీలైనంత తగ్గించే విధంగా ప్రత్యామ్నాయ మార్గాల లాభనష్టాలను అంచనా వేయాలని మెట్రో ఎండీ ఎన్వీఎస్ రెడ్డి అధికారులకు సూచించారు. అలైన్‌మెంట్ వీలైనన్ని ఎక్కువ నివాస కాలనీలకు, వాణిజ్య, వ్యాపార కేంద్రాలకు ప్రయోజనకరంగా ఉండాలని, స్టేషన్ స్థానాల నిర్ధారణ, వాటి సమీపంలో ఖాళీగా ఉన్న రాష్ట్ర ప్రభుత్వ-రక్షణ భూముల లభ్యత, మెరుగైన పార్కింగ్, ప్రయాణీకులకు కల్పించే సౌకర్యాలను గుర్తించాలని ఆయన ఆదేశించారు.

రెండు మెట్రో కారిడార్లను కలపడమే బెటర్

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించినట్టుగా జేబీఎస్ వద్ద ప్రారంభంలో రెండు మెట్రో కారిడార్‌లను కలపడం వల్ల ఎక్కువ ప్రయోజనం ఉంటుందని ఎన్వీఎస్ రెడ్డి వెల్లడించారు. దీనివల్ల బేగంపేట్ విమానాశ్రయం దిగువన సొరంగం ద్వారా మెట్రో అలైన్‌మెంట్‌ను తీసుకెళ్లాల్సిన పరిస్థితిని నివారించి, బోయినపల్లి రోడ్ (సరోజినీ పుల్లారెడ్డి బంగ్లా పక్కన) చివరన ఉన్న జాతీయ రహదారి జంక్షన్ వద్ద అలైన్‌మెంట్‌ను అనుసంధానించవచ్చని, అక్కడ నుంచి ఇప్పటికే విస్తరించిన జాతీయ రహదారి సర్వీస్ లేన్‌పై మెట్రో స్తంభాలను, వయాడక్టును జాతీయ రహదారుల సంస్థ నిర్మిస్తున్న ఫ్లైఓవర్లకు అంతరాయం కలగకుండా నిర్మించవచ్చన్నారు. దాంతో మేడ్చల్-జేబీఎస్-ఎంజీబీఎస్-చాంద్రాయణగుట్ట-విమానాశ్రయ లింక్ కూడా ఏర్పడుతుందని, దాదాపు 60 కిలోమీటర్ల సుదీర్ఘ మెట్రో కారిడార్ ఏర్పాటు సాధ్యమవుతుందని స్పష్టం చేశారు. జేబీఎస్-శామీర్‌పేట్ మెట్రో అలైన్‌మెంట్ విషయానికొస్తే, సికింద్రాబాద్ క్లబ్ సమీపంలో ఉన్న ప్రస్తుత మొదటి మెట్రో పిల్లర్ నుంచి డబుల్ ఎలివేటెడ్ స్ట్రక్చర్‌గా కరీంనగర్ హైవేపై హెచ్ఎండీఏ నిర్మించనున్న ఎలివేటెడ్ కారిడార్‌పై నేరుగా పొడిగించవచ్చని ఆయన వివరించారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఆత్మీయ భరోసా

- అధికారంలో ఉన్నప్పుడు కూలీలకు ఏకాన ఇవ్వనోళ్లు ఏదేదో మాట్లాడుతున్నరు
- కోటీశ్వరులకు రైతు బంధు ఇచ్చి కష్టజీవులను విస్మరించారు
- అపోహలు వీడి కూలీ భరోసాను స్వాగతించండి :మాజీమంత్రి హరీశ్‌రావుకు మంత్రి సీతక్క కౌంటర్



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

'భూమి లేని ఉపాధి కూలీలకు భరోసా కల్పించే ఉద్దేశంతో ఇందిరమ్మ ఆత్మీయ భరోసాకు ప్రజా ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. దేశంలో ఎక్కడా లేని విధంగా ఉపాధీ కూలీలకు రెండు దఫాల్లో ఏడాదికి రూ. 12 వేల ఆర్థిక సహాయం అందివ్వబోతున్నది. దేశానికే ఆదర్శంగా నిలవబోతున్నది. యావత్ దేశం ఈ స్కీం పట్ల ఆసక్తి చూపుతుండగా..తెలంగాణలోని కొన్ని రాజకీయ శక్తులు ఈ పథకంపై తప్పుడు గణాంకాలతో అపోహలు సృష్టించే ప్రయత్నం చేస్తున్నాయి. పదేండ్లు అధికారంలో ఉన్నప్పుడు కూలీలకు ఏకాన ఇవ్వని నేతలు ఇప్పుడు వారిపై కపట ప్రేమ నటిస్తున్నారు. రూ. 500 కోట్ల ఆస్తులున్న వారికి సైతం రైతు బంధు ఇచ్చి..రెక్కల కష్టం తప్ప ఎలాంటి ఆస్తి పాస్తులు లేని కూలీలను పట్టించుకోలేదు. ఇప్పుడు కూలీలకు ఆర్థిక చేయూతనందిస్తుంటే చూసి ఓర్వలేక అక్కసు వెళ్లగక్కుతున్నారు' అని మంత్రి సీతక్క తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. అన్ని ప్రభుత్వ సంక్షేమ పథకాలు కుటుంబం యూనిట్‌గా అమలవుతున్న నేపథ్యంలో ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకానికి సైతం అదే నిబంధన వర్తిస్తోందని తెలిపారు. ఎమ్‌జీనరేగా పోర్టల్ అధికారిక లెక్కల ప్రకారం తెలంగాణలో 48,13,966 జాబ్ కార్డులు కలిగిన కుటుంబాలున్నాయనీ, అందులో 22.64 లక్షల కుటుంబాలు కనీసం ఒక్క రోజు కూడా ఉపాధి పనుల్లో పాల్గొనలేదని తెలిపారు. కేవలం జాబ్ కార్డు కలిగి ఉన్నంత మాత్రాన ఉపాధి కూలీగా పరిగణించలేమని స్పష్టం చేశారు. ఉపాధి హామీ చట్టం ద్వారా జీవనోపాధి పొందితేనే ఉపాధి కూలీగా పరిగణిస్తామని తెలిపారు. సుమారు 17.26 లక్షల వరకు కుటుంబాలే 20 రోజుల పనిని పూర్తి చేసుకున్నాయనీ, అందులో 11 లక్షల కు పైగా కుటుంబాలకు సొంత భూమి ఉండటంతో రైతు భరోసా లబ్ధిదారులుగా ఉన్నారని వివరించారు. ఎలాంటి భూమి లేని 6 లక్షలకు పైగా ఉపాధి కూలీ కుటుంబాలుంటాయన్న అంచనాతో ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కల్పించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. రాజకీయ పక్షపాతంతో వ్యవహరించకుండా గ్రామ సభల్లోనే, ప్రజల సమక్షంలోనే ఇందిరమ్మ ఆత్మీయ భరోసా లబ్ధిదారులను ఎంపిక చేస్తామని పేర్కొన్నారు.

అప్పులబాధతో ఆటో డ్రైవర్ ఆత్మహత్య

- ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యే కోరం, హరిప్రియ నివాళి





నవతెలంగాణ-ఇల్లందు

అప్పులబాధతో ఆటో డ్రైవర్ ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లందు మండలంలో ఆదివారం జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని ఒకటో వార్డుకు చెందిన రెడ్డబోయిన సుమంత్ (36) ఆటో డ్రైవర్‌గా జీవనం సాగిస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. కాగా, 8 నెలల కిందట కొత్త ఆటో కొనుగోలు చేశాడు. ఆటో కిరాయిలు లేక నెలవారీ కిస్తీలు చెల్లించలేకపోయాడు. దాంతో రూ.5లక్షల వరకు అప్పు చేయాల్సి వచ్చింది. ఆటో గిరాకులు లేక, అప్పులు తీర్చలేక, ఇల్లు గడవడం కష్టంగా మారడంతో మనస్తాపం చెంది ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతునికి భార్య నాగలక్ష్మి, ఇద్దరు కుమార్తెలున్నారు.

కుటుంబాన్ని ఆదుకుంటాం : ఎమ్మెల్యే కోరం

విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కోరం కనకయ్య, వార్డు కౌన్సిలర్ వారా రవితో కలిసి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. సుమంత్ భౌతికకాయాన్ని సందర్శించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. సమస్యలు అడిగి తెలుసుకున్నారు. తక్షణ సహాయంగా రూ.5000 అందించారు. ప్రభుత్వం తరపున కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. మాజీ ఎమ్మెల్యే హరిప్రియ కూడా సుమంత్ భౌతికకాయాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. రూ.5000 ఆర్థిక సహాయం అందించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ పాలన ఏవిధంగా ఉందనేది ఆత్మహత్యలు చేసుకుంటున్న రైతన్నలు, ఆటో డ్రైవర్లను చూస్తే అవగతమవుతుందన్నారు.

కుంభమేళాలో అగ్ని ప్రమాదం

- సెక్టార్ 19లో పేలిన రెండు సిలిండర్లు



ప్రయాగ్‌రాజ్ : ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో నిర్వహిస్తున్న కుంభమేళాలో ఆదివారం అగ్ని ప్రమాదం జరిగింది. కుంభమేళాలోని సెక్టార్ 19లో రెండు సిలిండర్లు పేలడంతో ప్రమాదం జరిగిందని పోలీసులు తెలిపారు. తాత్కాలిక టెంట్లకు మంటలు అంటుకున్నాయని, మరింత వ్యాపించే అవకాశం ఉందని అన్నారు. ప్రాణనష్టానికి సంబంధించిన వివరాలు తెలియాల్సి వుందని అన్నారు. అగ్నిమాపక యంత్రాలు ఘటనా స్థలికి చేరుకున్నాయని, మంటలను అదుపు తెచ్చేందుకు యత్నిస్తున్నాయని అన్నారు. ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించినట్టు తెలిపారు.

నా కుమారుడికి ఉరిశిక్ష విధించినా అభ్యంతరం లేదు



- సంజయ్ రాయ్ తల్లి

కోల్‌కతా : తన కుమారుడికి ఉరిశిక్ష విధించాలని కోర్టు నిర్ణయిస్తే అభ్యంతరం లేదని నిందితుడు సంజయ్ రాయ్ తల్లి ఆదివారం తెలిపారు. కోల్‌కతా అభయ కేసులో సివిక్ పోలీస్ వాలంటరీ సంజయ్ రాయ్‌ని దోషిగా నిర్ధారిస్తూ సిల్దా కోర్టు శనివారం తీర్పునిచ్చిన సంగతి తెలిసిందే. శిక్ష వివరాలను సోమవారం వెల్లడించనుంది. ఈ తీర్పుపై సంజయ్ రాయ్ తల్లి మాలతీరాయ్ (70) స్పందించారు. ముందు మీడియాతో మాట్లాడేందుకు కొద్దిగా సంకోచించారు. ఒక మహిళగా, ముగ్గురు కుమార్తెల తల్లిగా బాధితురాలి తల్లి ఆవేదన, బాధ తనకు తెలుసునని అన్నారు. హత్యాచారానికి గురైన ట్రైనీ వైద్యురాలు కూడా తన కుమార్తెలాంటిదేనని అన్నారు.అతని నేరం రుజువైనందున కోర్టు అతనిని ఉరితీయాలని నిర్ణయించినా ఎటువంటి అభ్యంతరం లేదని అన్నారు. తల్లిగా ఒంటరిగా ఏడుస్తానని, కానీ, తలరాతను అంగీకరించాల్సిందేనని ఆవేదన వ్యక్తం చేశారు. కోర్టు విచారణ సమయంలో కాని, లాకప్‌లో కాని సంజయ్ రాయ్‌ని కలిశారా అని మీడియా ప్రశ్నించ లేదని, ఎందుకు కలవాలని సమాధానమిచ్చారు.

ముగిసిన సింగపూర్ పర్యటన

(మొదటిపేజీ తరువాయి)

పాటు మంత్రి శ్రీధర్‌బాబు, అధికారులు దావోస్‌కు బయల్దేరి సోమవారం చేరుకున్నారు. సోమవారం నుంచి నాలుగు రోజుల పాటు జరిగే వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్ వార్షిక సదస్సులో పాల్గొంటారు. రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను సీఎం ఈ వేదికపై వివరించనున్నారు. గతంలో రూ.40 వేల కోట్ల పెట్టుబడులు తీసుకొచ్చిన నేపథ్యంలో, ఈసారి మరిన్ని ఎక్కువ పెట్టుబడులు తీసుకురావాలనే యోచనలో ఉన్నారు. హైదరాబాద్‌ను ఫ్యూచర్ సిటీగా ఫోకస్ చేయడంతో పాటు కొత్తగా తెచ్చిన క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ పాలసీని సదస్సులో వివరించనున్నారు. సింగపూర్ పర్యటన విజయవంతం కావటంతో సీఎం బృందం దావోస్ సదస్సుపై భారీ అంచనాలు పెట్టుకుంది.

విజయవంతమైన సింగపూర్ పర్యటన

ఈ నెల 17 నుంచి 19 వరకు సింగపూర్లో మూడు రోజుల పాటు రాష్ట్ర ప్రతినిధి బృందం బిజీ బిజీగా గడిపింది. వివిధ రంగాల్లో పేరొందిన ప్రపంచ స్థాయి సంస్థల ప్రతినిధులు, పారిశ్రామికవేత్తలతో కీలక చర్చలు జరిపింది. ఆశించిన పెట్టుబడుల ఒప్పందాలతో పాటు సింగపూర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్(ఐటీఈ)తో తెలంగాణ యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ పరస్పర అవగాహన కుదుర్చుకోవటం కీలక పరిణామం. ఫ్యూచర్ సిటీలో అత్యాధునిక ఏఐ ఆధారిత డేటా సెంటర్ ఏర్పాటుకు ఎస్టీ టెలీ మీడియా గ్లోబల్ డేటా సెంటర్ ముందుకు వచ్చింది. రూ. 3,500 కోట్ల పెట్టుబడులకు ఒప్పందం కుదుర్చుకుంది. హైదరాబాద్ లో భారీ ఐటీ పార్క్ ఏర్పాటుకు క్యాపిటల్ ల్యాండ్ కంపెనీ నిర్ణయం తీసుకుంది.రాష్ట్రంలో సెమీ కండక్టర్ల తయారీ పరిశ్రమలు, పెట్టుబడుల అవకాశాలపై సింగపూర్ సెమీ కండక్టర్ ఇండస్ట్రీ అసోసియేషన్ తో జరిపిన చర్చలు ఫలవంతమయ్యాయి.

సింగపూర్ నదిలో సీఎం పడవ ప్రయాణం

సింగపూర్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పడవలో ప్రయాణించారు. ఫెర్రీలో ప్రయాణిస్తూ నది పునరుజ్జీవం, నీటి నిర్వహణపై సింగపూర్ అనుసరించిన విధానాలను పరిశీలించారు. నూతన భవనాలు నిర్మించేటప్పుడు చారిత్రక భవనాలను పరిరక్షించిన తీరును అక్కడి అధికారులను అడిగి తెలుసుకున్నారు.

రాజ్యాంగాన్ని అవమానిస్తారా ?

భగవత్‌పై రాహుల్ మండిపాటు



పాట్నా : అయోధ్యలో రామమందిర ప్రతిష్ఠతోనే దేశానికి నిజమైన స్వాతంత్ర్యం లభించిందంటూ ఆర్ఎస్ఎస్ అధినేత మోహన్ భగవత్ చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మండిపడ్డారు. భగవత్ వ్యాఖ్యలు రాజ్యాంగాన్ని అవమానిస్తున్నాయని ఆయన విమర్శించారు. బీహార్ రాజధాని పాట్నాలో ఓ స్వచ్ఛంద సంస్థ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాహుల్ ప్రసంగిస్తూ కులగణనపై కాంగ్రెస్ ఇచ్చిన హామీని పునరుద్ఘాటించారు. యాభై శాతం రిజర్వేషన్ పరిమితిని తొలగించి బీసీలు, దళితులు, ఎస్టీలకు అన్ని రంగాలలో సముచిత ప్రాతినిధ్యం కల్పిస్తామని తెలిపారు.

'గంగానది గంగోత్రిలో పుట్టలేదని మోహన్ భగవత్ చెబుతారు. మన దేశానికి 1947 ఆగస్టు 15న స్వాతంత్ర్యం రాలేదని, ఆ తర్వాత వచ్చిందని అంటారు. ఆయన ఇలా చెప్పడం రాజ్యాంగాన్ని కించపరచడమే అవుతుంది' అని రాహుల్ ధ్వజమెత్తారు. 'రాజ్యాంగంలోని భావనలు అవసరం లేదని భగవత్ బాహాటంగానే చెబుతున్నారు. రాజ్యాంగం స్వాతంత్ర్య ఫలం కాదని అంటారు. ఆయన రాజ్యాంగ భావనలను దేశం నుంచి, ప్రజల నుంచి, సంస్థల నుండి దూరం చేస్తున్నారు' అని చెప్పారు. రాజ్యాంగం కేవలం ఓ పుస్తకం కాదని, అది వేలాది సంవత్సరాల దేశ ఆలోచనలను ప్రతిబింబిస్తోందని అన్నారు. అందులో కోట్లాది దళితులు, బీసీలు, గిరిజనులకు జరుగుతున్న అన్యాయానికి సంబంధించిన బాధలు ఉన్నాయని తెలిపారు. ఆ బాధలను అది పూర్తిగా తొలగించలేకపోయినప్పటికీ కొంత తగ్గిస్తుందని చెప్పారు. రాజ్యాంగం గంగ వంటిదని, అది దేశంలోని ప్రతి మూలకూ ప్రవహించాలని కోరుకుంటున్నామని రాహుల్ అన్నారు.

రాహుల్ గాంధీపై మరో ఎఫ్ఐఆర్

కాంగ్రెస్ నేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీపై ఎఫ్ఐఆర్ నమోదైంది. మోన్‌జిత్ చాటియా అనే వ్యక్తి ఫిర్యాదు మేరకు అస్సాం రాజధాని గువహటిలోని పాన్‌బజార్ పోలీస్‌స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ నమోదైంది. బిఎన్ఎస్ సెక్షన్ 152, 197 (1)డి ప్రకారం.. దేశ సార్వభౌమత్వం, ఐక్యత , సమగ్రతకు హాని కలిగించే చర్యల కింద నాన్‌బెయిలబుల్ కేసు నమోదైంది.

దేశంతోనూ కాంగ్రెస్ పోరాడుతోందని ఇటీవల రాహుల్ గాంధీ వ్యాఖ్యానించిన సంగతి తెలిసిందే. ఢిల్లీలో ఈనెల 15న కాంగ్రెస్ నూతన కార్యాలయ భవనాన్ని ప్రారంభించిన సమయంలో ఆయన ఈవ్యాఖ్యలు చేశారు. ప్రతిపక్ష నేతగా, ప్రజాస్వామ్య సంస్థలపై ప్రజలకు విశ్వాసం కల్పించాల్సిన బాధ్యత రాహుల్ గాంధీకి ఉందని, దానికి బదులుగా ఆయన అబద్ధాలు వ్యాప్తి చేసి దేశ ఐక్యతను, సార్వభౌమత్వాన్ని ప్రమాదంలో పడేస్తున్నారని చాటియా ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్నారు. ఆయన వ్యాఖ్యలు వాక్ స్వాతంత్ర్య పరిమితులను దాటాయని, అవి జాతీయ భద్రతకు తీవ్రమైన ముప్పు కలిగిస్తాయని పేర్కొన్నారు. ఆయన వ్యాఖ్యలు అశాంతితో పాటు, వేర్పాటువాద భావాలు కలిగిన వారిని రెచ్చగొట్టే ప్రమాదం ఉందన్నారు.

షరతులు లేకుండా రైతు భరోసా

- గ్రామసభల్లోనే లబ్ధిదారుల ఎంపిక
- ఎలాంటి అపోహలకు తావులేదు : డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క



నవతెలంగాణ-ఎర్రుపాలెం

వ్యవసాయ యోగ్యమైన రైతుల భూములకు ఎలాంటి షరతులు లేకుండా రైతు భరోసా పథకం కింద ప్రతి ఎకరానికి 12 వేల రూపాయలు రాష్ట్ర ప్రభుత్వం అందించబోతుందని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం మండల పరిధిలోని బనిగండ్లపాడు గ్రామంలో రూ.1.56 కోట్లతో నూతనంగా నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈనెల 26 నుంచి రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్త రేషన్ కార్డుల మంజూరి చేయనున్నట్టు తెలిపారు. రాష్ట్రంలో భూమిలేని నిరుపేద వ్యవసాయ కూలీల కుటుంబాలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం ద్వారా ఏడాదికి రూ.12 వేలు అందిస్తామని చెప్పారు. రాష్ట్రంలో అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి రేషన్ కార్డులు మంజూరు చేస్తామని, లబ్ధిదారులను గ్రామ సభల్లో నిష్పక్షపాతంగా, పారదర్శకంగా ఎంపిక చేస్తారని, ఎలాంటి అపోహలు, అనుమానాలు చెందాల్సిన అవసరం లేదని స్పష్టంచేశారు. ప్రజా పాలనలో ప్రజలందరి సమక్షంలోనే నిర్ణయాలు తీసుకుంటారని, గ్రామ సభలు నిర్వహించి సంక్షేమ పథకాల లబ్ధిదారులను ఎంపిక చేసి జాబితాను తయారు చేస్తారన్నారు. లిస్ట్‌లో పేర్లు రానివారికి అక్కడే సమస్య పరిష్కరిస్తారని క్లారిటీ ఇచ్చారు. ఎర్రుపాలెం మండల కేంద్రంలో 50 పడకల ప్రభుత్వ ఆస్పత్రి ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. మండలంలో ఉన్న చెరువులు అడవులను రక్షించుకుంటూ ఎకో టూరిజాన్ని అభివృద్ధి పరిచేందుకు చర్యలు చేపట్టామన్నారు. మండలంలో టూరిజం అభివృద్ధితో స్థానిక ప్రజల ఆదాయ వనరులు, జీవన ప్రమాణాలు పెంచడానికి ప్రజా ప్రభుత్వం ప్రణాళిక బద్ధంగా ముందుకు వెళుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

రష్యా-ఇరాన్ భద్రతా ఒప్పందం 'చరిత్రాత్మకం'

- మధ్యప్రాచ్య నిపుణుడు ఫర్హాద్ ఇబ్రహిమోవ్



మాస్కో : రష్యా, ఇరాన్ లు "చరిత్రాత్మక ఒప్పంద"తో తమ సహకారాన్ని వ్యూహాత్మక భాగస్వామ్యం స్థాయికి తీసుకువెళ్లాయని మాస్కోకు చెందిన వాల్డాయ్ డిస్కషన్ క్లబ్‌లో మధ్యప్రాచ్య నిపుణుడు ఫర్హాద్ ఇబ్రహిమోవ్ అన్నారు. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్, ఇరాన్ అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియన్ శుక్రవారం మాస్కోలో ఒక ప్రధాన ద్వైపాక్షిక భద్రతా ఒప్పందంపై సంతకం చేశారు. రాబోయే 20 సంవత్సరాల పాటు ఈ ద్వైపాక్షిక ఒప్పందంతో ఏర్పడిన వ్యూహాత్మక భాగస్వామ్యం ఆధారంగా రష్యా, ఇరాన్ లు సమగ్ర భద్రత, నావికా, ఆర్థిక, మానవతా సహకారాన్ని పెంచుకుంటాయి.

"ఈ ఒప్పందం నిజంగా చారిత్రాత్మకం. రష్యా ఇరాన్ లు పరస్పర సహకారంలో కొత్త స్థాయికి చేరుకున్నాయి"అని ఇబ్రహిమోవ్ అన్నారు. రెండు బ్రిక్స్ దేశాలు సారూప్య ప్రపంచ దృక్పథాలను కలిగివున్నాయని, ఇవి కీలక వ్యూహాత్మక భాగస్వాములుగా ఉంటాయని ఆయన అన్నారు. మధ్య ప్రాచ్యంలో తమ సంబంధాలను అభివృద్ధి చేసుకోవాలనుకునే రష్యా ఇరాన్‌ను అత్యంత విలువైన భాగస్వామిగా చూస్తుంది. "వాస్తవానికి, ఇరాన్ చాలా కాలంగా రష్యాను దాని అత్యంత ముఖ్యమైన వ్యూహాత్మక భాగస్వాములలో ఒకటిగా భావిస్తోంది. కొన్నిసార్లు మాస్కోను మిత్రదేశంగా కూడా అభివర్ణిస్తోంది" అని ఇబ్రహిమోవ్ పేర్కొన్నారు.

"అంతర్జాతీయ సంబంధాల వ్యవస్థలో కొత్త ప్రపంచ క్రమాన్ని ఏర్పరచడంలో సహాయపడే శక్తిగావుండే సామర్థ్యం ఇరాన్ కు ఉందని రష్యా భావిస్తోంది" అని ఆయన అన్నారు. ప్రపంచంలోఅమెరికాను సవాలు చేయగల దేశాలలో రష్యా ఒకటి అని, టెహ్రాన్ అమెరికాను "మొత్తం ప్రపంచం, ముఖ్యంగా మధ్యప్రాచ్యం భద్రతకు అతిపెద్ద ముప్పు"గా చూస్తుందని ఆయన అన్నారు. దశాబ్దాలుగా పాశ్చాత్య ఆంక్షల కింద నివసిస్తున్నందున, ఒప్పందంలోని ఆర్థిక సహకార నిబంధనలు ఇరాన్‌కు చాలా ముఖ్యమైనవి అని ఇబ్రహిమోవ్ అన్నారు. అయినప్పటికీ, ఒప్పందంలోని భద్రతా అంశాలు ప్రత్యేకంగా ఏ దేశానికి వ్యతిరేకంగా లేవని ఆయన నొక్కి చెప్పారు.

శుక్రవారం క్రెమ్లిన్ వెబ్‌సైట్‌లో ప్రచురించబడిన ఒప్పందం ప్రకారం, రెండు దేశాలపై దాడి జరిగితే రష్యా ఇరాన్ లు దురాక్రమణదారునికి - సైనికంగా లేదా ఇతరత్రా - ఎలాంటి సహాయం అందించవు. "ఈ కుదిరిన ఒప్పందాలు రష్యా-ఇరాన్ సంబంధాలు మరింత బలోపేతం చేయడానికి దోహద పడతాయి"అని పుతిన్ శుక్రవారం పెజెష్కియన్‌తో కలిసి విలేకరుల సమావేశంలో అన్నారు.

నాపై సోషల్‌మీడియాలో తప్పుడు ప్రచారం

- బీజేపీ రాష్ట్ర అధ్యక్ష పదవిపై నో కామెంట్
- పేదల ఇండ్లను కూలిస్తే ఊరుకోబోం..

కొట్లాటకు సిద్ధం : ఎంపీ ఈటల



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

తమ పార్టీ ఎదుగుదలను అడ్డుకోవాలని చూస్తున్నవారే తనపై సోషల్‌మీడియాలో తప్పుడు ప్రచారం చేస్తున్నారని బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్ష పదవి అంశంపై తాను ఎలాంటి కామెంట్ చేయబోనని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో పేదల ఇండ్లను కూలుస్తుంటే చూస్తూ ఊరుకోబోమనీ, కొట్లాటకు తాము కూడా సిద్ధమేనని ప్రకటించారు. అత్యంత అవినీతి, అసమర్థ, మంత్రుల మధ్య సమన్వయం లేని ప్రభుత్వం రేవంత్‌రెడ్డి సర్కారేనని విమర్శించారు. ప్రతి బిల్లు చెల్లింపులోనూ 7 నుంచి 10 శాతం వసూలు చేస్తున్నారని ఆరోపించారు. ఆదివారం హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి కొన్ని రోజులు హైడ్రా పేరిట, మరికొన్ని రోజులు మూసీ పేరిట పేదల ఇండ్లను కూల్చిందని విమర్శించారు. దేశంలోనే అతిపెద్ద, అతిపురాతనమైన స్లమ్ బాలాజీనగర్, జవహర్‌నగర్ ప్రాంతమనీ, ఆ ప్రాంతంలో రాష్ట్ర ప్రజలతో పాటు దేశవ్యాప్తంగా వలస వచ్చిన ఎంతోమంది కూలీలు, పేదలు నివసిస్తున్నారని తెలిపారు.

ప్రజలు కబ్జా చేసుకుని ఇండ్లు కట్టుకోలేదనీ, డబ్బులు పెట్టి కొని కట్టుకున్నారని చెప్పారు. బ్రిటీష్ కాలంలో ఈ భూమిని సైనికులకు కేటాయించారన్నారు. ఆ భూమిపై రాష్ట్ర ప్రభుత్వానికి ఎలాంటి హక్కు లేదనీ, కేర్ టేకింగ్ మాత్రమే చేపట్టాలని 1951లోనే స్పష్టంచేశారని తెలిపారు. సైనికులు కొందరు ఆ భూమిని అమ్ముకుంటే వారి నుంచి పేదలు కొనుక్కున్నారని చెప్పారు. గతంలోనూ కాంగ్రెస్ మంత్రి కమతం రాంరెడ్డి ఆ ప్రాంతంలో ఇండ్లను కూల్చాలని మిషన్లను పంపారనీ, ఇప్పుడు రేవంత్‌రెడ్డి కూల్చివేతలు చేయిస్తున్నారని విమర్శించారు. బాలాజీ నగర్‌లో పేదల ఇండ్లను కబ్జా చేసేవాళ్లు,అమ్మకాలు, కొనుగోలు చేసే బ్రోకర్లు ఎక్కువైపోయారనీ, రెవెన్యూ అధికారుల ఆగడాలు శృతిమించిపోతున్నాయని ఆరోపించారు. రూ.50 వేల నుంచి రూ.2 లక్షల వరకు చెల్లిస్తే తప్ప రేకుల షెడ్లు వేసుకునేందుకు అవకాశం ఇవ్వడం లేదని విమర్శించారు. డబ్బులివ్వకపోతే ఇండ్లను కూల్చివేయిస్తున్నారని ఆరోపించారు. మల్కాజిగిరి ఎంపీగా పనిచేసిన సీఎం రేవంత్ కు ఈ ప్రాంత ప్రజల బాధలు తెలియవా? అని ప్రశ్నించారు. కాళేశ్వరం విచారణకు సహకరిస్తారా? అన్న అంశంపై ఈటల స్పందిస్తూ..మిడిమిడి జ్ఞానంతో ఉన్నవాళ్లు, అవగాహన లేనివాళ్లు, ప్రభుత్వ పనివిధానం తెలియనివాళ్లు ఏదేదో మాట్లాడుతున్నారనీ, అన్ని డిపార్ట్ మెంట్లు బిల్లులు చేసి పంపిస్తే డబ్బులు రిలీజ్ చేసేది ఆర్థికశాఖ అని తెలిపారు. బిల్లులు రిలీజ్ అవ్వాలంటే 7 నుంచి 10 శాతం కమీషన్ లేనిదే రిలీజ్ చేయడం లేదని విమర్శించారు.



మహనీయుల స్ఫూర్తితో కేవీపీఎస్ క్యాలెండర్

- టీ స్కైలాబ్ బాబు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

మార్క్స్, పూలే అంబేద్కర్ వంటి మహనీయుల స్ఫూర్తిని పంచేలా కేవీపీఎస్ క్యాలెండర్ ఉందని ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి స్కైలాబ్ బాబు తెలిపారు. ఆదివారం హైదరాబాద్‌లోని బాగ్ లింగంపల్లి సుందరయ్య పార్కులో ఆ పార్కు ప్రెసిడెంట్ పీవీ నిరంజన్ రెడ్డితో కలిసి ఆయన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. అనంతరం స్కైలాబ్ బాబు మాట్లాడుతూ మహనీయుల చిత్రపటాలు వారి విలువైన నినాదాలతో నేటి తరం స్ఫూర్తి పొందే విధంగా క్యాలెండర్‌ను ముద్రించినట్టు తెలిపారు. కేవీపీఎస్ అట్టడుగు వర్గాల ఐక్యత కోసం కృషి చేస్తుందని పేర్కొన్నారు సామాజిక న్యాయం కోసం పోరాడుతుందని తెలిపారు. మనుస్మృతి ఆధిపత్య బావజాలంపై ప్రతిఘటన ఉద్యమాలు జరిపేందుకు కృషి చేస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్కు ప్రెసిడెంట్ కార్యదర్శి సైకం మనోహర్ రెడ్డి, ఉపాధ్యక్షులు వడిత్య కళ్యాణ్ నాయక్, డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు కోట రమేష్, కేవీపీఎస్ నగర అధ్యక్షులు ఎం దశరథ్, ఎస్ రమేష్ రెడి, అంబటి శ్రీనివాస్ రెడ్డి, రాజేశ్వర్ రావు వాకర్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

సీపీఆర్ నేర్చుకోండి ప్రాణాలను కాపాడండి

- డాక్టర్ మహేశ్వర్ రెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

సీపీఆర్ (ఛాతి మర్ధన) నేర్చుకుని ఆపదలో ఉన్న వారిని కాపాడాలని గాంధీ మెడికల్ కాలేజీ అలుమ్ని ప్రతినిధి, సీపీఆర్ కార్యక్రమం కో ఆర్డినేటర్ డాక్టర్ మహేశ్వర్ రెడ్డి పిలుపునిచ్చారు. గాంధీ మెడికల్ కాలేజీ అలుమ్ని, జనహిత సేవా ట్రస్ట్ సంయుక్తాధ్వర్యంలో ఆదివారం కార్డియో పల్మనరీ రెసిటేషన్ (సీపీఆర్ - ఛాతి మర్ధన)లో హైదరాబాద్‌లోని గాంధీ అలుమ్ని ఎడ్యుకేషన్ సెంటర్‌లో ఉచిత శిక్షణనిచ్చారు. మూడు రోజుల పాటు ఒక గంటపాటు ఇవ్వనున్న ఈ శిక్షణ మొదటి రోజు మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు కొనసాగింది. హాజరైన ప్రతి ఒక్కరికి ఒక గంటపాటు సీపీఆర్‌లో డాక్టర్లు శిక్షణనిచ్చి సర్టిఫికెట్లను అందజేశారు. మొదటి రోజు 600 మంది వరకు హాజరయ్యారు. సోమవారం, మంగళవారం రెండు రోజుల పాటు ప్రతి రోజు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఈ ఉచిత శిక్షణ కార్యక్రమం కొనసాగనున్నది.

మొదటి రోజు శిక్షణ కార్యక్రమం విజయవంతంగా పూర్తయిన సందర్భంగా డాక్టర్ మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ మనిషి స్పృహ కోల్పోయినప్పుడు గుండె ఆగిపోవడం లేదా ఎక్కువగా కొట్టుకోవడం జరుగుతుందని తెలిపారు. అలా జరిగినప్పుడు మెదడుకు రక్త సరఫరా ఆగిపోతుందని చెప్పారు. ఈ సరఫరా 5 నుంచి 10 నిమిషాలపాటు ఆగిపోతే మనిషి అక్కడే మరణిస్తారని చెప్పారు. ఈ దశలో ఆయన సమీపంలో ఉన్నవారికి సీపీఆర్ తెలిసి ఉంటే ప్రాణాలను కాపాడేందుకు అవకాశముంటుందని తెలిపారు.

గుండెపోటు కేసుల్లో సీపీఆర్ అందినవారు బతికిన ఘటనలు ఎన్నో ఉన్నాయని తెలిపారు. జనహిత సేవా ట్రస్ట్ ప్రతినిధి నర్సింహామూర్తి మాట్లాడుతూ రోగుల సహాయం కోసం అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించినట్టు తెలిపారు. అలుమ్నితో కలిసి సీపీఆర్ శిక్షణ చేపట్టడం బాగుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అలుమ్ని ఆఫీస్ మేనేజర్ పవన్ కుమార్, శివరుద్ర, నాగరాజు తదితరులు నిర్వహణ బాధ్యతలు చేపట్టారు.

ఒక్కో సమస్యను పరిష్కరిస్తున్నాం

- మంత్రి దామోదర రాజనర్సింహ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఆరోగ్యశ్రీకి సంబంధించి ఒక్కో సమస్యను పరిష్కరిస్తున్నామని వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన ట్వీట్ చేశారు. పదేండ్లు ఆరోగ్యశ్రీని నీరుగార్చి, ఇప్పుడు అదే పథకం గురించి ప్రస్తుత ప్రభుత్వాన్ని విమర్శిస్తున్న వారి తీరు.. దొంగే, దొంగ దొంగ అని అరిచినట్టుగా ఉందని విమర్శించారు. వారి హయాంలో హాస్పిటళ్లకు డబ్బులు చెల్లించలేదని తెలిపారు. ప్యాకేజీల ధరలు రివైజ్ చేయలేదని పేర్కొన్నారు. సుమారు 730 కోట్లు బాకీ పెట్టి పోయారని పేర్కొన్నారు. తాము అధికారంలోకి వచ్చాక పాత బకాయిలతో సహా రూ.1130 కోట్లు ఏడాదిలో చెల్లించినట్టు తెలిపారు. ప్రతి నెలా నిధులు విడుదల చేస్తున్నట్టు స్పష్టం చేశారు. ప్యాకేజీల రేట్లు రివైజ్ చేసి, 22 శాతం మేర చార్జీలు పెంచినట్టు చెప్పారు. హాస్పిటళ్ల యాజమాన్యాలు లేవనెత్తిన ఇతర సమస్యలను పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటున్నట్టు వెల్లడించారు.

రాష్ట్రంలో ప్రజావ్యతిరేక పాలన

- అవినీతి, అక్రమాలు, దోపిడీకి బీఆర్ఎస్, కాంగ్రెస్‌లే కారణం :కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో ప్రజావ్యతిరేక, అవినీతి పాలన నడుస్తున్నదని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు జి.కిషన్‌రెడ్డి ఆరోపించారు. అవినీతి రహిత పాలన అందాలంటే డబుల్ ఇంజిన్ సర్కార్ రావాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న అవినీతి అక్రమాలకు, దోపిడీకి బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలే కారణమని ఆరోపించారు. పదేండ్ల అధికారంలో మోడీ క్యాబినెట్‌లోని కేంద్ర మంత్రులపైనా, ప్రభుత్వంపైనా రూపాయి అవినీతి చేసినట్టు కూడా ఆరోపణలు రాలేదని చెప్పారు. ఆదివారం హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఖైరతాబాద్ నియోజకవర్గ పరిధిలో పలు పార్టీల నేతలు, కార్యకర్తలు ఆయన సమక్షంలో ఆ పార్టీలో చేరారు. వారికి కిషన్‌రెడ్డి కండువా కప్పి బీజేపీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో తెలంగాణ ప్రజల ఆకాంక్షలకు భిన్నంగా కాంగ్రెస్ పాలన కొనసాగుతున్నదని విమర్శించారు. రాష్ట్ర ప్రజానీకం బీజేపీని ప్రత్యామ్నాయంగా ఎంచుకుంటున్నారని తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి ఎనిమిది పార్లమెంట్ స్థానాలు ఇచ్చారని గుర్తు చేశారు.

పెట్టుబడుల పేరుతో మరోసారీ రేవంత్ మోసం

- ఆయన మాటలకు చేతలకు సంబంధం లేదు : బీఆర్ఎస్ ఎమ్మెల్యే కెపి.వివేకానంద

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

పెట్టుబడుల పేరుతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మరోసారీ మోసానికి తెరలేపారని బీఆర్ఎస్ ఎమ్మెల్యే కెపి.వివేకానంద విమర్శించారు. ఆదివారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ గతంలో అమెరికా, దావోస్ పర్యటనలతో భారీగా పెట్టుబడులు తెచ్చామని అసత్య ప్రచారం చేశారని గుర్తు చేశారు. తాజాగా అదే తరహా జిమ్మిక్కులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ముఖ్యమంత్రిగా తనను గుర్తించడం కోసమే రేవంత్ రెడ్డి విదేశీ పర్యటనలు చేస్తున్నారని ఎద్దేవా చేశారు. కొత్త పెట్టుబడులు పక్కన పెడితే ఉన్న కంపెనీలు బిచాణా ఎత్తేస్తున్నాయని ఆరోపించారు. రాష్ట్రంలో పాలనను గాడిలో పెట్టలేక విదేశీ పర్యటన పేరుతో ప్రజా ధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారని వ్యాఖ్యానించారు. తాజాగా చేపట్టిన సింగపూర్, దావోస్ పర్యటనలో వస్తున్న పెట్టుబడులన్ని ఫేకేనని విమర్శించారు.

ముస్తాబవుతున్న సంగారెడ్డి





- రాష్ట్ర మహాసభలకు విస్తృత ఏర్పాట్లు
- బహుముఖ కార్యక్రమాలు, వైద్య శిబిరాలు,క్రికెట్ పోటీలు
- భారీ ఫ్లెక్సీలు, గోడరాతలు, పోస్టర్ ప్రచారం
- ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా జీపుజాత ప్రచారం
- వివిధ కళారూపాల శిక్షణ, పాటల చిత్రీకరణ

నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

సీపీఐ(ఎం) రాష్ట్ర 4వ మహాసభలకు సంగారెడ్డి ముస్తాబవుతోంది. మహాసభల నిర్వహణ కోసం ఆహ్వాన సంఘం విస్తృత ఏర్పాట్లు చేస్తోంది. ఎర్రజెండా సిద్ధాంత, పోరాటాల ప్రాధాన్యతను తెలియజేస్తూ బహుముఖ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. వైద్య శిబిరాలు, క్రికెట్ ఇతర ఆటల పోటీలు నిర్వహిస్తూ యువతను భాగస్వామ్యం చేస్తున్నారు. భారీ ఫ్లెక్సీలు, గోడరాతలు, పోస్టర్ల ద్వారా ప్రచారం చేస్తున్నారు. ఇంటింటికీ సీపీఐ(ఎం) పేరిట లక్ష ఇండ్లను తిరిగి ప్రజల నుంచి విరాళాలు సేకరించే మాస్ క్యాంపెయిన్ జయప్రదంగా సాగుతోంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పార్టీ జెండా ఆవిష్కరణలు, జీపుజాత ప్రచార కార్యక్రమాలతో మహాసభల ప్రచారం మరింత ఊపందుకుంది. పోరాటాల సారధి ప్రజా ఉద్యమ కేంద్రం కేవల్ కిషన్ భవన్ ఎర్రతోరణలు, లైట్ల వెలుగులతో ముస్తాబైంది. 25న జరిగే భారీ బహిరంగ సభకు వేదిక, బ్యానర్స్, ప్రతినిధుల సభలు జరిగే గోకుల్ గార్డెన్ అలంకరణ వంటి కార్యక్రమాలు శరవేగంగా సాగుతున్నాయి.

ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా జీపుజాత, జెండావిష్కరణలు



ఈ నెల 17న ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా పార్టీ శాఖల ఆధ్వర్యంలో జెండావిష్కరణ కార్యక్రమం చేపట్టారు. పార్టీ శాఖలున్న ప్రాంతాలు, గ్రామాలు, మండల, జిల్లా కేంద్రాల్లో పార్టీ జెండా ఆవిష్కరణ కార్యక్రమంలో పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. అదే విధంగా రాష్ట్ర మహాసభల ప్రాధాన్యతను వివరిస్తూ ప్రచారం నిర్వహించేందుకు ఆదివారం జీపుజాత సిద్దిపేట జిల్లా కేంద్రంలో ప్రారంభమైంది. నాలుగు రోజుల పాటు సిద్దిపేట, మెదక్, సంగారెడ్డి జిల్లాలోని ముఖ్యమైన పట్టణాల్లో జీపుజాత పర్యటించనుంది.

బహుముఖ కార్యక్రమాలు

ఈ నెల 25-28 తేదీల్లో జరిగే సీపీఐ(ఎం) రాష్ట్ర మహాసభల్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు ఏర్పడిన ఆహ్వాన సంఘం బహుముఖ కార్యక్రమాలు నిర్వహిస్తూ అన్ని వర్గాల ప్రజల్ని భాగస్వామ్యం చేస్తోంది. జిల్లా వ్యాప్తంగా 10 కేంద్రాల్లో వైద్య, రక్తదాన శిబిరాలు నిర్వహించింది. ఉచిత నాణ్యమైన వైద్యం అందించాలని పోరాడే సీపీఐ(ఎం) తన రాష్ట్ర మహాసభల సందర్భంగా ప్రజలకు ఉచిత వైద్యం అందించేందుకు దోహదపడే వైద్య శిబిరాలు పెట్టి పార్టీ విశిష్టతను తెలియజేసే ప్రయత్నం చేశారు. యువతను సైతం ఎర్రజెండా మహాసభల ప్రచారంలో భాగస్వామ్యం చేసేందుకు క్రికెట్ పోటీలు నిర్వహించగా వందలాది మంది యువకులు క్రీడల్లో పాల్గొన్నారు. వీరికి బహుమతుల్ని అందజేశారు. ఇప్పటికే కవులు, రచయితలతో జనకవనం, మేధావుల చేత సెమినార్లు, సదస్సులు నిర్వహించింది. మతోన్మాదం, సరళీకరణ విధానాలు, రాజ్యాంగం, రిజర్వేషన్ల పరిరక్షణ ముఖ్య అంశాలపై జరిపిన సెమినార్స్‌లో కార్మికులు, మధ్యతరగతి ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

కళాకారులకు ప్రత్యేక శిక్షణా కార్యక్రమాలు

రాష్ట్ర మహాసభల సందర్భంగా వివిధ కళలకు సంబంధించి పీఎన్ఎం ఆధ్వర్యంలో కళాకారులకు శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇప్పటికే పాటల శిక్షణ పూర్తయ్యింది. జిల్లా వ్యాప్తంగా మహిళలకు కోలాట శిక్షణ ఇస్తున్నారు. మహాసభల విశిష్టత, ఎర్రజెండా గొప్పదనం, సీపీఐ(ఎం) ప్రజా పోరాటాలకు సంబంధించి ప్రత్యేకంగా పాటల్ని రచించారు. ఆనందాచారి, సుద్దాల అశోక్‌తేజ వంటి ప్రముఖ రచయితలు రాసిన పాటల్ని చిత్రీకరిస్తున్నారు. అద్భుతమైన గానం, మ్యూజిక్‌తో కూడిన పాటలు ప్రజల ముందుకు తీసుకొచ్చేందుకు పీఎన్ఎం ప్రయత్నిస్తున్నది.

గోడరాతలు, ఫ్లెక్సీలు



ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా రాష్ట్ర మహాసభల సందర్భంగా విస్తృతంగా గోడరాతలు రాశారు. సీపీఐ(ఎం) మహాసభల్ని జయప్రదం చేయాలని, పార్టీ సిద్ధాంత నినాదాలను తెలియజేస్తూ ఎర్రజెండా, సుత్తికొడవలి గుర్తుతో కూడి గోడరాతల్ని విస్తృతంగా రాశారు. హైదరాబాద్- సంగారెడ్డి -ముంబయి జాతీయ రహదారి వెంట రాసిన గోడ రాతలు ప్రజల్ని పెద్ద ఎత్తున ఆకర్షిస్తున్నాయి. పట్టణంలో ఇప్పటికే భారీ ఫ్లెక్సీలు పెడుతున్నారు. అదే విధంగా సంగారెడ్డి పట్టణంలోని ప్రధాన కూడళ్లలో భారీ బెలూన్స్‌ను సైతం ఏర్పాటు చేస్తున్నారు. మహాసభల సందర్భంగా 25న స్థానిక పీఎస్ఆర్ గ్రౌండ్‌లో నిర్వహించే బహిరంగ సభకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను మూడు జిల్లాల్లోనూ ఆవిష్కరించి విస్తృతంగా అంటించారు. తెలుగు, ఊర్దూలో ముద్రించిన కరపత్రాలు, బ్రోచర్స్, స్టిక్కర్స్ ద్వారా ప్రచారం చేశారు.

సోషల్ మీడియాలో విస్తృత ప్రచారం

పోరాటాల గడ్డ సంగారెడ్డిలో జరుగుతున్న మహాసభలు రాష్ట్ర రాజకీయాల్లో పెను మార్పులు తీసుకొచ్చేందుకు దోహదపడే చర్చలు, నిర్ణయాలు చేయబడతాయని ఆ పార్టీ నాయకులు ఇప్పటికే ప్రకటించారు. పార్టీ సిద్ధాంతంలోని ప్రధాన అంశాలు, ప్రజా పోరాటాలు, రాజకీయ, ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక రంగాల్లో సీపీఐ(ఎం) వైఖరిని తెలియజేస్తూ సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. సోషల్ మీటియా ప్రత్యేక టీమ్స్ సంగారెడ్డిలోని కేవల్ కిషన్ భవన్‌లో ఆ దిశగా కృషి చేస్తోంది. సీపీఐ(ఎం) మహాసభల సందర్భంగా చేస్తున్న ప్రతి పనికి సంబందించిన ఫొటోలు, వీడియోల్ని అందమైన పోస్టర్స్‌గా మార్చి వాట్సప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగామ్, ఎక్స్ వంటి వేదికల ద్వారా ప్రచారం చేస్తున్నారు.

ఎర్రజెండా పట్ల ప్రజల్లో అపూర్వ ఆదరణ



నిత్యం ప్రజా పోరాటాలు నిర్వహించే సీపీఐ(ఎం) రాష్ట్ర మహాసభల సందర్భంగా లక్ష కుటుంబాల్ని కలిసి మహాసభల గురించి తెలియజేయాలని పిలుపునిచ్చాం. ఆ దిశగా సంగారెడ్డి జిల్లా కమిటీ పటాన్‌చెరు, సంగారెడ్డి, జహీరాబాద్, ఆందోల్, నారాయణఖేడ్, సదాశివపేట, కొండాపూర్, కంది, పుల్కల్, చౌటకూర్ కేంద్రాలతో పాటు మెదక్, సిద్దిపేట జిల్లాలోని అనేక ప్రాంతాల్లో దశాలుగా ఏర్పడి మాస్ ఫండ్ క్యాంపెయిన్ నిర్వహిస్తున్నాం. పారిశ్రామిక కార్మికులు షిప్టుల వారిగా డ్యూటీలు చేస్తూనే ఖాళీ సమయాల్లో ఫండ్స్ సేకరణ కోసం ఇంటింటికీ తిరిగే కార్యక్రమంలో పెద్ద ఎత్తున పాల్గొంటున్నారు. సీపీఐ(ఎం) కరపత్రం పంచుతూ మహాసభల నిర్వహణ, ప్రాధాన్యత, పార్టీ నిర్వహించే పోరాటాలు, సిద్ధాంత నిబద్ధత గురించి ప్రజలకు వివరిస్తూ విరాళాలు అడుగుతున్నాం. ఎర్రజెండా పార్టీ అనగానే అన్ని వర్గాల ప్రజల్లో అపూర్వ ఆదరణ లభిస్తుంది. పోరాడే పార్టీలుండాలని పేదలు, మధ్య తరగతి ప్రజలు, కార్మికులు, ఉద్యోగులు, చిరు వ్యాపారులు కోరుకోవడమే కాకుండా లేదనకుండా తోచిన ఆర్థిక సహాయం అందజేయడం సంతోషంగా ఉంది.

చుక్క రాములు, ఆహ్వాన సంఘం చైర్మెన్

పసుపునకు రూ.15 వేల మద్దతు ధర ప్రకటిస్తేనే.. పసుపు బోర్డుకు సార్థకత



- పసుపు బోర్డును స్వాగతిస్తున్నాం : ఎమ్మెల్సీ కవిత
- త్రిముఖ వ్యూహంతో అలుపెరగని పోరాటం చేసినట్టు వెల్లడి

దిగుమతులపై కేంద్రం నియంత్రణ విధించాలి

నవతెలంగాణ-కంఠేశ్వర్

పసుపు బోర్డు ఏర్పాటును స్వాగతిస్తున్నట్టు బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తెలిపారు. అయితే, క్వింటాలు పసుపునకు రూ. 15 వేల కనీస మద్దతు ధర ప్రకటించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పసుపు దిగుమతులపై నియంత్రణ విధించాలని సూచించారు. ఈ రెండు చేసినప్పుడే పసుపు బోర్డుకు సార్థకత ఏర్పడుతుందని, అప్పుడే పసుపు రైతులకు సంపూర్ణ న్యాయం లభిస్తుందని స్పష్టం చేశారు. తూతూమంత్రంగా పసుపు బోర్డును ఏర్పాటు చేయడం కాదని, అందుకు తగిన సౌకర్యాలు, పరిశోధన సామర్థ్యాన్ని కేంద్ర ప్రభుత్వం సమకూర్చాలని సూచించారు. తాము పసుపు బోర్డుపై డిమాండ్ చేసినప్పుడు బీజేపీ ఎంపీ అరవింద్ రాజకీయాల్లో కూడా లేరని విమర్శించారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. పసుపు బోర్డు ఏర్పాటు ప్రకటించిన విధానంపై అభ్యంతరాలున్నాయని, పసుపు బోర్డు ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని బీజేపీ కార్యక్రమంలా చేశారని ఆక్షేపించారు. రాష్ట్ర ప్రభుత్వంతో పాటు స్థానిక ప్రజాప్రతినిధులను ఆహ్వానించలేదని, కేవలం బీజేపీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీ కూర్చొని ప్రారంభించుకున్నారని, ప్రొటోకాల్‌ను పాటించలే దని, ఇది ప్రభుత్వ నియమ నిబంధనలకు విరుద్ధమని అన్నారు. పసుపు బోర్డును ఏర్పాటు చేయాలంటూ 2014లో తాను ఎంపీగా ఎన్నికైన నెల రోజుల్లోనే అప్పటి వాణిజ్య శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌కు లేఖ రాశానని గుర్తు చేశారు. పలువురు ముఖ్యమంత్రులను కలిసి మద్దతుగా లేఖలు సేకరించానని, ప్రధాని మోడీని రెండు సార్లు కలిసి విజ్ఞప్తి చేసినట్టు చెప్పారు. దీనిపై పార్లమెంటులో అనేక సార్లు మాట్లాడటమే కాకుండా ప్రయివేటు మెంబర్ బిల్లును కూడా ప్రవేశపెట్టినట్టు తెలిపారు. అంతేకాకుండా, పసుపుకు కనీస మద్దతు ధరను ప్రకటించాలని, దిగుమతులపై నియంత్రణ విధించాలని కూడా కేంద్రానికి అనేక సార్లు వినతులు అందించానని అన్నారు. ఇలా తాను గతంలో త్రిముఖ వ్యూహంతో అలుపెరగని పోరాటం చేశానని వెల్లడించారు. 2014లో 8 లక్షల క్వింటాళ్ల దిగుమతి అయితే ఇప్పుడు రెట్టింపయ్యిందని, అయినా బీజేపీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు.రకరకాల మాటలతో రైతులను, ప్రజలను మభ్యపెట్టిన బీజేపీ ఎంపీ అరవింద్‌పై విరుచుకుపడ్డారు. గాలి మాటలు మాట్లాడటం మానేసి పసుపునకు మద్దతు ధర సాధించాలని హితవు పలికారు. స్పైసెస్ బోర్డు బెంజ్ కారులాంటిదని, పసుపు బోర్డు అంబాసిడర్ కారులాంటిదని గతంలో అరవింద్ అన్నారని, పసుపును అవహేళన చేసిన అరవింద్‌కు ఇప్పుడు మాట్లాడే నైతిక హక్కు లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. తాము కేంద్రంపై పదేపదే ఒత్తిడి చేయడం వల్లే గతంలో స్పైసెస్ బోర్డు కార్యాలయం ఏర్పాటైందని, అది కూడా ఆయన గొప్పతనమని మాట్లాడటం హాస్యాస్పదమని అన్నారు. స్పైసెస్ పార్కు ఏర్పాటుకు వేల్పూర్ వద్ద గతంలో కేసీఆర్ 42 ఎకరాలు కేటాయించారని, ఆ పార్కులో పసుపు ఆధారిత పరిశ్రమల ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయాలని డిమాండ్ చేశారు. జాక్రాన్‌పల్లిలో విమానాశ్రయానికి కేసీఆర్ ప్రభుత్వం 800 ఎకరాలు సేకరించిందని, దాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్, జెడ్పీ మాజీ చైర్మెన్ దాదన్నగారి విఠల్ రావు, బాజిరెడ్డి జగన్, నిజామాబాద్ మేయర్ నీతు కిరణ్, మాజీ చైర్మెన్ అలీమ్ నాయకులు పాల్గొన్నారు.

మావోయిస్టు అగ్రనేత బడా చొక్కారావు మృతిపై సందేహాలు!

- చనిపోయాడంటూ ఛత్తీస్‌గఢ్ మావోయిస్టు పార్టీ లేఖ విడుదల
- మృతి అనుమానమే అంటున్న రాష్ట్ర ఇంటెలిజెన్స్

నవతెలంగాణ-ప్రత్యేక ప్రతినిధి

ఇటీవల ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లాలోని దట్టమైన అటవీప్రాంతంలో జరిగిన భారీ ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు పార్టీ అగ్రనేత బడా చొక్కారావు అలియాస్ సుధాకర్ చనిపోయారంటూ వచ్చిన వార్తలపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. మావోయిస్టు పార్టీలో కీలక నేతగా, స్పెషల్ మిలిటరీ కమిషన్ కార్యదర్శిగా చొక్కారావు ఉన్నారు. తెలంగాణ రాష్ట్ర ఇన్‌చార్జిగా కూడా ఆయన పనిచేస్తున్నారు. కాగా, 16న జరిగిన ఎన్‌కౌంటర్‌లో దాదాపు 17 మంది మావోయిస్టులు మరణించినట్టు ఆ పార్టీ చెబుతుండగా..పోలీసులు మాత్రం 12 మంది మాత్రమే చనిపోయారని కొందరి పేర్లను ప్రకటించారు. అయితే, మావోయిస్టు పార్టీ పేరుమీద ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో విడుదలైన లేఖలో సైతం కొన్ని పేర్లను ఇచ్చారు. అందులో సుధాకర్‌బాబు పేరు ఉన్నట్టుగా పేర్కొన్నారు. అయితే, వీరిపై అంతర్గతంగా విచారించిన యాంటీ నక్సలైట్ విభాగం అధికారులు మాత్రం చొక్కారావు మృతి వార్తను ధ్రువీకరించడం లేదు. నవతెలంగాణతో ఒక సీనియర్ ఇంటెలిజెన్స్ అధికారి మాట్లాడుతూ..'చొక్కారావు చనిపోయారని వారు చెబుతున్నారు. కానీ, మాకు ఇప్పటివరకూ సమాచారం ధ్రువీకరణ కాలేదు. ఒకవేళ చొక్కారావు ఈ ఎన్‌కౌంటర్‌లో మరణిస్తే మావోయిస్టు పార్టీకి తెలంగాణలో తీరని దెబ్బే' అని చెప్పారు. గతేడాది నుంచి ప్రస్తుతం వరకు జరిగిన ఎన్‌కౌంటర్ వరకు మావోయిస్టు పార్టీకి కోలుకోలేని దెబ్బలు తగిలాయని పోలీసు ఉన్నతాధికారులు అంచనా వేస్తున్నారు. పీపుల్స్‌వార్ నుంచి మావోయిస్టులుగా రూపాంతరం చెందిన తర్వాత ఆ పార్టీకి తెలంగాణకు చెందిన నాయకత్వమే వెన్నుదన్నుగా నిలిచిందని ఒక అధికారి చెప్పారు. ప్రస్తుత కేంద్ర కమిటీలో మొత్తం 19 మంది సభ్యులుండగా అందులో 13 మంది అగ్రశ్రేణి నాయకులు తెలంగాణకు చెందిన వారే ఉన్నారని చెప్పారు. వృద్ధాప్యంలోకి నాయకత్వం చేరుకున్నప్పటికీ కొత్తగా చేరుతున్న క్యాడర్‌కు వారి మేధోశక్తి ప్రేరణగా సాగుతున్నదని ఆయన అభిప్రాయపడ్డారు. 2026 నాటికి దేశంలో మావోయిస్టులు అనేవారు లేకుండా, ఆ పదం వినపడకుండా చేయాలనే లక్ష్యాన్ని ఒకవైపు కేంద్ర ప్రభుత్వం, మరోవైపు మావోయిస్టు ప్రభావిత రాష్ట్రాలు నిర్దేశించుకోగా.. ప్రస్తుతమున్న కేంద్ర కమిటీ నిర్వీర్యమయ్యేంత వరకు ఆ లక్ష్యాన్ని చేరుకోలేమని మరో సీనియర్ ఐపీఎస్ అధికారి వ్యాఖ్యానించారు.

సంజయ్ రాయ్‌కు శిక్ష పాక్షిక పరిష్కారమే : టీ జూడా

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఆర్జీకర్ మెడికల్ కాలేజీ ఘటనలో సంజయ్ రాయ్‌కు శిక్ష విధించడం పాక్షిక పరిష్కారమేనని తెలంగాణ జూనియర్ డాక్టర్స్ అసోసియేషన్ (టీజూడా) అభిప్రాయాన్ని వ్యక్తం చేసింది. ఈ మేరకు ఆదివారం అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ కొమ్ము రాహుల్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ జె.ఐజాక్ న్యూటన్, చైర్‌పర్సన్ డాక్టర్ డి.శ్రీనాథ్ ఒక ప్రకటన విడుదల చేశారు. కేసుల శిక్ష విధిస్తూ కోర్టు తీర్పు రావడం న్యాయం పొందడంలో ఒక ముందడుగా భావిస్తున్నట్టు తెలిపారు.

ఘటన జరిగే నేరాన్ని ప్రోత్సహిస్తూ, అందులో జోక్యం ఉన్న ప్రతి ఒక్కరిని విచారించాలని డిమాండ్ చేశారు. బాధితురాలి కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉండాలనీ, తగిన ఉపశమనం కలిగించాలని కోరారు.

అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు కలిగిన పార్టీ సీపీఐ

- కూడు, గూడు, భూమి కోసం పోరాటాలతో పేదల పక్షాన నిలిచింది
- మనమెందుకు అధికారంలోకి రాలేకపోతున్నామో ఆలోచన చేయాలి :సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి
- సిద్దిపేటలో ఘనంగా సీపీఐ శతజయంతి వేడుకలు



నవతెలంగాణ-సిద్దిపేట అర్బన్

భారత కమ్యూనిస్టు పార్టీ అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన పార్టీ అని ఆ పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్ రెడ్డి తెలిపారు. కూడు, గూడు భూమి, కోసం అనేక పోరాటాలు చేసి పేదల పక్షాన నిలిచిన ఘనత సీపీఐదేనని అన్నారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలోని శివానుభవ మండపం హాల్‌లో ఆదివారం నిర్వహించిన సీపీఐ శతజయంతి వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ముందుగా పట్టణంలోని విక్టరీ టాకీస్ నుంచి శివమ్స్ ఫంక్షన్ హాల్ వరకు భారీగా ర్యాలీ నిర్వహించారు. అనంతరం నిర్వహించిన సభలో చాడ వెంకట్ రెడ్డి మాట్లాడుతూ.. శతజయంతి సభలు జరుపుకున్నాం కానీ.. మనం అధికారంలోకి ఎందుకు రాలేకపోతున్నామో ఒకసారి ఆలోచన చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. ప్రపంచంలోని చైనా, వియత్నాం, ఫిలిప్పీన్స్, క్యూబా వంటి దేశాల్లో పేదలకు విద్యా వైద్యం అందించడంతో పాటు వారి జీవన ప్రమాణాలు మెరుగుపడేందుకు అక్కడి కమ్యూనిస్టు పార్టీ ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయని తెలిపారు.

భారతదేశంలో ఆర్ఎస్ఎస్ భావజాలం కలిగిన బీజేపీ ప్రభుత్వం పేదల సంక్షేమాన్ని విస్మరించిందని విమర్శించారు. కార్మికుల హక్కులు హరించే విధంగా ఎన్డీయే ప్రభుత్వం చట్టాలను తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తున్నదని, వాటిపై ఏఐటీయూసీ, ఇతర కార్మిక, ప్రజా సంఘాలతో కలిసి పోరాటాలు చేయడంతో వెనక్కి తగ్గిందని తెలిపారు. దున్నేవానికే భూమి కావాలని పోరాటాలు చేసి అనేకమంది అసువులు బాసారని గుర్తుచేశారు. రాబోయే రోజుల్లో ప్రజల్లో ఉండి పేదల హక్కులకోసం మరోసారి పోరాటాలకు సిద్ధం కావాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ సభ్యులు ఎడ్ల వెంకట రామిరెడ్డి, జిల్లా కార్యదర్శి మంద పవన్, జిల్లా కార్యవర్గ సభ్యులు గడిపే మల్లేష్, బట్టు దయానంద రెడ్డి, అందే అశోక్, ఎడల వనేష్, పోతిరెడ్డి వెంకటరెడ్డి, కిష్టపురం లక్ష్మణ్, జాగిరి సత్యనారాయణ గౌడ్, కనుకుంట్ల శంకర్, స్వాతంత్ర్య సమరయోధులు గంబీరపు రామయ్య, పట్టణ కార్యదర్శి జి. బన్సీలాల్, మహిళా సమాఖ్య అధ్యక్షులు గూడ పద్మ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులను విడుదల చేయాలి : టీపీటీఎఫ్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని తెలంగాణ ప్రోగ్రెస్ టీచర్స్ ఫెడరేషన్ (టీపీటీఎఫ్) రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చకినాల అనిల్‌కుమార్, నన్నెబోయిన తిరుపతి ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. హైదరాబాద్‌లోని ఆ సంఘం రాష్ట్ర కార్యాలయంలో రాష్ట్ర కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఉపాధ్యాయ ఉద్యోగ సమస్యలను పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం మంత్రుల కమిటీని వేసినప్పటికీ జాప్యం జరుగుతున్నదని తెలిపారు. ఉపాధ్యాయ సంఘాలతో కనీసం చర్చించటం లేదని పేర్కొన్నారు. ఉపాధ్యాయులు తమ ఆర్థిక అవసరాల కోసంపెట్టుకున్న జీపీఎఫ్‌లోన్లు, జీఐఎస్‌లోన్లు సరెండర్‌లీవు, సప్లమెంటరీ బిల్లులు ఏడాదిగా విడుదల చేయలేదని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న వివిధ రకాల బిల్లులు, డీఏలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సంఘం రాష్ట్ర అధ్యక్షులు చకినాల అనిల్‌కుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నన్నెబోయిన తిరుపతి, ఉపాధ్యాయ దర్శిని ప్రధాన సంపాదకులు ఎం.ప్రకాష్ రావు, ఉపాధ్యక్షులు పాతూరి మహేందర్ రెడ్డి, పి.నారాయణమ్మ, డి. శ్రీనివాస్, ఎం.లక్ష్మయ్య యాదవ్, బి.రాజు రాష్ట్ర కార్యదర్శులు ఎస్.విజయ్, బోగ రమేష్, దామెర రాజయ్య, సిద్ధోజు కవితలు పాల్గొన్నారు.

బీహార్ బయలుదేరిన స్పీకర్ బృందం

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

బీహార్ రాష్ట్ర రాజధాని పాట్నాలో ఈ నెల 20, 21 తేదీల్లో జరిగే 85వ ఆల్ ఇండియా ప్రిసైడింగ్ ఆఫీసర్స్ కాన్ఫరెన్స్ (ఏఐపీవోసీ) పాల్గొనేందుకు ఆదివారం శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి బయలు దేరిన తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, శాసనమండలి చైర్మెన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, డిప్యూటీ చైర్మెన్ బండా ప్రకాష్ ముదిరాజ్, అసెంబ్లీ కార్యదర్శి డాక్టర్ వి. నరసింహాచార్యులు, అధికారులు ఉన్నారు. అదే విధంగా ఈ సదస్సుకు ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు, డిప్యూటీ స్పీకర్ రఘురామకష్ణ రాజు ఉన్నారు.

నేడు భువనేశ్వర్‌కు డిప్యూటీ సీఎం భట్టి

డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క సోమవారం ఒడిశా రాజధాని భువనేశ్వర్‌కు వెళ్లనున్నారు. అక్కడ జరిగే మైనింగ్ మంత్రుల జాతీయ సదస్సులో పాల్గొననున్నారు. మైనింగ్ పాలసీలపై జరిగే కీలకమైన చర్చల్లో భాగస్వామ్యం కానున్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఎల్బీనగర్ -మహేశ్వరం
సోమవారం | జనవరి 20, 2025 | www.navatelangana.com

వ్యక్తి అదృశ్యం



నవతెలంగాణ-హయత్‌నగర్

ఓ వ్యక్తి అదృశ్యమైన ఘటన హయత్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలోని తొర్రూరు గ్రామం, బాలాజీ నగర్ ఫేజ్ 2లో నివాసం ఉంటున్న బత్తుల మహేష్ ప్రైవేట్ ఉద్యోగి. ఈ నెల 18న ఇంటి నుండి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. ఈ క్రమంలో అతనికి సాయంత్రం ఫోన్ చేయగా వస్తా అని చెప్పాడు. కానీ తిరిగి రాలేదు. ఆ తర్వాత మళ్లీ అతనికి ఫోన్ చేయగా స్విచాఫ్ వచ్చింది. అనుమానం వచ్చి చుట్టుపక్కల బంధువుల దగ్గర వెతకగా ఎటువంటి ఆచూకీ లభించలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు కేస్ నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

శ్రీ బాలాజీ హాస్పిటల్ ఆధ్వర్యంలో హెల్త్ క్యాంప్

కార్పొరేటర్ శారదా మనోధర్ రెడ్డి



నవతెలంగాణ - జవహర్‌నగర్

ప్రజలు ఉచిత హెల్త్ క్యాంప్ సేవలను వినియోగించుకోవాలని జవహర్ నగర్ కార్పొరేటర్ శారదా మనోధర్ రెడ్డి కోరారు. ఆదివారం జవహర్ నగర్ మున్సిపల్ పరిధిలోని 9వ డివిజన్ లో శ్రీ బాలాజీ హాస్పిటల్ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా హెల్త్ క్యాంప్‌ను కార్పొరేటర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ పేద ప్రజలు ఎక్కువగా నివసించే జవహర్ నగర్ లో హెల్త్ క్యాంప్ నిర్వహించడం సంతోషకరమని, పేదలకు మెరుగైన వైద్య సేవలను అందించాలని ఆస్పత్రి సిబ్బందిని కోరారు.

25 నుండి సీపీఐ(ఎం) 4వ మహాసభలు



- కాంగ్రెస్ రాష్ట్ర సర్కారు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేయాలి
- సీపీఐ(ఎం) పార్టీ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య



నవతెలంగాణ - హస్తినాపురం

హస్తినాపురం డివిజన్ పరిధిలోని నందనవనంలో ఇంద్ర చెన్నారెడ్డి కమిటీ హాల్లో సీపీఐ(ఎం) ఎల్బీనగర్ సర్కిల్ కమిటీ ఆధ్వర్యంలో పార్టీ సభ్యులతో జనరల్ బాడీ సమావేశాన్ని కమిటీ సభ్యులు ఎం.డి కమర్ అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) పార్టీ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య మాట్లాడుతూ భారత కమ్యూనిస్టు పార్టీ మార్క్సిస్టు (సీపీఐ(ఎం)) 4వ మహాసభలను సంగారెడ్డి పట్టణంలో ఈ నెల 25 నుంచి 28 వరకు 4 రోజుల పాటు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ మహాసభలలో గత మూడు సంవత్సరాలలో ప్రజా సమస్యలపై సీపీఐ(ఎం) పార్టీ చేసిన పోరాటాలను, సాధించిన విజయాలను చర్చించి.. రాష్ట్ర సమగ్ర అభివృద్ధి కోసం చేయవలసిన పోరాటాలకు రూపకల్పన చేస్తామన్నారు. ప్రజల మధ్య విద్వేషాలు సృష్టించే మతోన్మాత భావజాలానికి వ్యతిరేకంగా ప్రజలను ఐక్యంగా చేసి, సంఘటితం చేసేందుకు భవిష్యత్ కార్యాచరణను రూపొందించనున్నట్లు తెలిపారు. ఈ మహాసభలకు రాష్ట్ర నలుమూలల నుండి ప్రజలు అధిక సంఖ్యలో హాజరుఅవుతారని పేర్కొన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలను పూర్తి స్థాయిలో అమలు చేయలేదని విమర్శించారు. హామీల అమలు విస్మరించి, ప్రజాస్వామిక హక్కులపై నిర్బంధాలు కొనసాగిస్తే గత బీఆర్ఎస్ పార్టీకి పట్టిన గతే కాంగ్రెస్‌కు పడుతుందని హెచ్చరించారు.

మహాసభలలో రైతులు, మహిళలు, కార్మికులు, విద్యార్థి, యువజనులు సామాజిక తరగతులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి.. వాటి పరిష్కార మార్గాలను, ప్రత్యామ్నాయ విధానాలను ప్రజల ముందు ఉంచుతామని వెల్లడించారు. సొంత ఇల్లు, రేషన్ కార్డు లేని ప్రజలందరి కోసం భూ పోరాటం చేయడానికి ప్రజలందరూ ఈ ప్రాంతంలో సిద్ధంగా ఉండాలని కోరారు. రాష్ట్ర సమగ్రాభివృద్ధి కోసం జరిగే ఈ మహాసభలకు సీపీఐ(ఎం) పొలిట్ బ్యూరో సభ్యులు బృందాకరత్, బీవీ రాఘవులు, విజయరాఘవన్‌తో పాటు పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం తదితరులు 25న జరిగే బహిరంగ సభలో ప్రసంగిస్తారని వివరించారు. రంగారెడ్డి జిల్లా నుండి కూడా ప్రజలు అధిక సంఖ్యలో హాజరై మహాసభను జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో ఎల్బీనగర్ సర్కిల్ కార్యదర్శి ఆలేటి ఎల్లయ్య, సర్కిల్ కమిటీ సభ్యులు మంథని యాదయ్య, గడ్డం రవీందర్, దుర్గారావు, కాశయ్య, పి.రామస్వామి, పంది లక్ష్మయ్య, రాధమ్మ, లింగమ్మ, సాలమ్మ, అంజమ్మ, ప్రేమలత, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

ముదిరాజులు రాజకీయంగా బలపడాలి

- ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి
- సాయన్న విగ్రహ ఆవిష్కరణ మహోత్సవంలో ఎంపీ, ఎమ్మెల్యేలు





నవతెలంగాణ-మీర్‌పేట్

ముదిరాజులు రాజకీయంగా బలపడినప్పుడే ఆర్థికంగా ఎదుగుదల ఉంటుందని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి అన్నారు. మహేశ్వరం నియోజకవర్గం మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ జిల్లెలగూడ చందన చెరువు కట్టపై ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన పండుగ సాయన్న విగ్రహాన్ని ఆదివారం ఆవిష్కరించారు. ఈ మహోత్సవానికి ముఖ్య అతిథులుగా మాజీ మంత్రి, మహేశ్వరం నియోజకవర్గం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి, చేవెళ్ల పార్లమెంట్ సభ్యులు, బీజేపీ పార్లమెంట్ విప్ కొండ విశ్వేశ్వర్ రెడ్డి, మక్తల్ నియోజకవర్గం ఎమ్మెల్యే శ్రీహరి ముదిరాజ్, తెలంగాణ రాష్ట్ర ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మెన్ జ్ఞానేశ్వర్ ముదిరాజ్ హాజరై పండుగ సాయన్న విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ ప్రజా వీరుడు పండుగ సాయన్న నిత్యం పేద ప్రజల కోసం ఆలోచించేవారని, రజాకార్ల అన్యాయాలను ఎదిరించి నిలిచి ప్రతి ఒక్కరికీ అండగా నిలిచారని గుర్తుచేశారు. పేద ప్రజల కడుపు నింపిన మహనీయుడు పండుగ సాయన్న అని కొనియాడారు. ఆకలితో అల్లాడుతున్న గ్రామాలలో పండుగ సాయన్న అడుగుపెడితే వారి కడుపు నింపి పండుగ వాతావరణాన్ని తీసుకొచ్చిన ఘనత వల్లే సాయన్నకు పండుగ సాయన్న పేరు వచ్చిందని గుర్తుచేశారు. పండుగ సాయన్న ఆనాటి నిరంకుశ నిజాం అధికారులను ప్రశ్నించి, వారిని ఎదిరించి తన సొంత సైన్యాన్ని స్థాపించుకొని పోరాడిన పోరాట యోధుడని అలాంటి మహావీరుడి స్ఫూర్తితో భవిష్యత్ తరాలు పోరాటాన్ని అలవర్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మెదక్ కంటెస్టెంట్ ఎమ్మెల్యే నీలం మధు, మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ ముదిరాజ్ సంఘం అధ్యక్షులు శివ శంకర్ ముదిరాజ్, మీర్‌పేట్ మేయర్ దుర్గా దీప్ లాల్ చౌహాన్, బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ చిగిరింత పారిజాత, సభ అధ్యక్షులు దయానంద్ ముదిరాజ్, కార్పొరేటర్లు కీసర గోవర్ధన్ రెడ్డి, భీమ్‌రాజ్, గౌరీ శంకర్, ఎడ్ల మల్లేష్ ముదిరాజ్, తుమ్మల రమేష్, తుమ్మల రాఘవేంద్ర, నాయకులు, ముదిరాజ్ కుటుంబ సభ్యులు పెద్ద సంఖ్యలు పాల్గొన్నారు.

క్రీడల్లోనూ యువత రాణించాలి



- డ్రగ్స్, సైబర్ నేరాలకు దూరంగా ఉండాలి
- చదువు, సామజిక సేవలో ముందుండాలి
- చిలుక మధుసూదన్ రెడ్డి

నవతెలంగాణ అబ్దుల్లాపూర్‌మెట్

క్రీడల్లోనూ యువత రాణిస్తూ.. చదువు, సామాజిక సేవల్లో ముందుండాలని గడ్డి అన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మెన్ చిలుక మధుసూదన్ రెడి అన్నారు. అబ్దుల్లాపూర్‌మెట్ మండలం, అనాజ్ పూర్ గ్రామంలో సంక్రాంతి పర్వ దినాన్ని పురస్కరించుకొని అనాజీ పూర్ క్రికెట్ ప్రీమియర్ లీగ్ (ఏపీఎల్ - 10) నిర్వహించారు. టోర్నిలో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచిన విజేతలకు ఏఎంసీ చైర్మెన్ చిలుక మధుసూదన్ రెడ్డి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత క్రీడలపై మక్కువ పెంచుకుని రాణించాలన్నారు. ఆటల ద్వారా మంచి గుర్తింపుతో పాటు శారీరక, మానసిక సంతోషం, ఆరోగ్యం లభిస్తుందన్నారు. అనాజ్ పూర్ ప్రీమియం లీగ్‌లు ప్రథమ విజేత టీఎన్జీ, ద్వితీయ విజేత ఓంసాయిరాం టీంలకు నగదు బహుమతి అందజేసినట్టు తెలిపారు. ఇక ముందు కూడా యువతను ప్రోత్సాహిస్తూ క్రీడలపై అవగాహన కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ద్వితీయ బహుమతి స్పాన్సర్స్ తాటిపల్లి విష్ణు గౌడ్, ఎర్కలి బాలకృష్ణ, బ్యాక్ గ్రౌండ్ సపోర్ట్ కండేగాని మహేందర్, కండేగాని చంద్రబాబు, గ్రౌండ్ క్లీనింగ్ స్పాన్సర్ యెర్పుల భాను, స్పాన్సర్స్ గుర్జని మురళీ గౌడ్, ఏర్పుల సామయ్య, కె వెంకట్ రెడ్డి ఉప్పుల సురేష్, టీమ్ స్పాన్సర్స్ ఇ మహేందర్, యం. కరుణాకర్ రెడ్డి, కె. వంశీ, టి నవీన్ గౌడ్, ఎస్ శంకర్, ఆర్ వినోద్, అనాజ్ పూర్ ప్రీమియర్ లీగ్-10 నిర్వాహకులు మహేష్, హరికృష్ణ, సురేష్, సోను, సన్నీ, నరేష్, ఇతర క్రీడాకారులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



కాలనీ పార్కులను వినియోగించుకోవాలి

కార్పొరేటర్ చింతల అరుణా సురేంద్రనాథ్ యాదవ్

నవతెలంగాణ- నాగోల్

ఉదయం వేళలో చేసే నడకకు రోడ్లపైకి వెళ్లి ప్రమాదాలకు గురికాకుండా తమ తమ కాలనీల్లో ఏర్పాటు చేసిన పార్కులను వినియోగించుకోవాలి నాగోలు డివిజన్ కార్పొరేటర్ చింతల అరుణా సురేందర్ నాథ్ యాదవ్ సూచించారు. నాగోల్ డివిజన్ పరిధిలోని మమత నగర్‌లో ఏర్పాటు చేసిన నూతన పార్కును CI సూర్య నాయక్‌తో కలిసి ఆదివారం కార్పొరేటర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ కాలనీ వాసులు ఉదయం వాకింగ్‌కి రోడ్ల పైకి వెళ్లకుండా కాలనీలలోని పార్కులను వినియోగించుకోవాలని కోరారు. కాలనీల్లోని సమస్యలను దశల వారీగా పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కాలనీలో ఎలాంటి సమస్యలున్నా తమ దృష్టికి తీసుకొని వస్తే వాటిని వీలైనంత త్వరగా సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కరిస్తానని భరోసా ఇచ్చారు. అనంతరం కాలనీవాసులతో కలిసి మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు శ్రీధర్, ప్రభావతి, సురేఖ, శ్రీనివాస్, రామ్మోహన్, శ్రీలత, మహేష్ శెట్టి, శ్రీనివాస్, బసవరాజు, సత్యం గౌడ్, బీజేపీ నాయకులు, నాగోల్ డివిజన్ అధ్యక్షులు పంగా శ్రీకాంత్, యశ్వంత్, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.



అభివృద్ధి పనులను పరిశీలించిన మేయర్



నవతెలంగాణ-బడంగ్‌పేట్

బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో కోట్లాది రూపాయల నిధులతో అనేక అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నామని మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి అన్నారు. మహేశ్వరం నియోజకవర్గ పరిధిలోని బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని 19వ డివిజన్ సాయి నగర్ కాలనీలో జరుగుతున్న అనేక రకాల అభివృద్ధి పనులను ఆదివారం టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, మేయర్ చిగిరింత పారిజాత నర్సింహా రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ప్రజలకు మౌలిక సదుపాయాల కల్పనకు ఎంతో కృషి చేస్తుందన్నారు. ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమం చేపట్టిన అభివృద్ధి సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ పర్యటనలో కాంగ్రెస్ పార్టీ నాయకులు గిరి ముదిరాజ్, కాలనీ అధ్యక్షులు ప్రేమ్ కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ శివ కుమార్, కిరణ్, శివ కుమార్ రెడ్డి, శ్రీనివాస్, విజయ్ యాదవ్, అనిల్, గ్యార శ్రీనివాస్, శ్రీనివాస్ రెడ్డి కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

ఆక్యుపంచర్, న్యాచురోపతి మేలైన చికిత్స

మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి



నవతెలంగాణ - మీర్‌పేట్

ఆక్యుపంచర్ మరియు న్యాచురోపతి చికిత్స ఆరోగ్యానికి ఎంతో మేలైనదని మాజీ మంత్రి, మహేశ్వరం నియోజకవర్గం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి అన్నారు. మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని చందన చెరువు కట్ట పైన "సృష్టి ఆక్యుపంచర్, న్యాచురోపతి" చికిత్స అనే పేరుతో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని ఆదివారం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తాను కూడా ఈ చికిత్స తీసుకున్నానని, ఈ చికిత్స ఎంతో మేలైనదని అన్నారు. ఎటువంటి మందులు లేకుండా రోగాన్ని తగ్గించుకోవడం ఎంతో సుఖమని, ఇది ప్రజలకు ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. ఉచిత ఆరోగ్య శిబిరంలో దాదాపు 15 మంది హీలర్లు హాజరై ఎంతో మంది రోగులకు చికిత్స అందజేసినట్టు పేర్కొన్నారు. అనంతరం క్యాంప్‌ను నిర్వహిస్తున్న హీలర్లను అభినందించారు. ఈ కార్యక్రమంలో వేముల విజయలక్ష్మి, మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ ఫ్లోర్ లీడర్ అర్కల భూపాల్ రెడ్డి, కార్పొరేటర్లు సిద్ధాల లావణ్య బీరప్ప, సిద్దాల పద్మ అంజయ్య, ఏనుగుల అనిల్ కుమార్ యాదవ్, మీర్‌పేట్ మహిళా అధ్యక్షురాలు సునీత బాలరాజు, నాయకులు దీప్ లాల్ చౌహాన్, పోరెడ్డి ప్రభాకర్ రెడ్డి, వంటేరు నరసింహారెడ్డి, విజయలక్ష్మి, నగరపాలక సంస్థ కమిషనర్ ఆర్.జ్ఞానేశ్వర్, నిర్వాహకులు వేముల శ్రీధర్, జ్యోతి, సియాన్ అధినేత సుధాకర్, ఉపాధ్యాయురాలు జ్యోతి తదితరులు పాల్గొన్నారు.



భారీగా గంజాయి పట్టివేత

దాని విలువ రూ.15,50,000లు





నవతెలంగాణ - మలక్‌పేట్ / చంపాపేట

నల్గొండ క్రాస్ రోడ్స్ పోస్ట్ ఆఫీస్ లేన్ వద్ద పోలీసులు భారీగా గంజాయిని పట్టుకున్నారు. ఈ మేరకు ఆదివారం చాదర్‌ఘాట్ పోలీస్ స్టేషన్‌లో సౌత్ ఈస్ట్ జోన్ డిప్యూటీ కమిషనర్ పాటిల్ కాంతిలాల్ సుభాష్ విలేకర్ల సమవేశంలో వివరాలను వెల్లడించారు. కొంతకాలంగా నగరంలో గంజాయి విచ్చలవిడిగా అమ్మకాలు జరుగుతున్నాయి. ఈ గుట్టును టాస్క్‌ఫోర్స్ పోలీసులు బట్టబయలు చేశారు. అంతర్రాష్ట్ర గంజాయి రవాణాదారుడు ఏ.రాజురా గంజాయి విక్రయిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. ఇతని స్వస్థలం నైయింగ్‌పూర్ రోడ్, సిరౌంజా, సాగర్, మధ్యప్రదేశ్. దీంతో అతనిపై ప్రత్యేక బృందంతో నిఘా ఉంచారు. అతను ఒడిస్సా రాష్ట్రంలోని చిత్రకొండలోని సుభాష్ నుండి గంజాయిని కొనుగోలు చేస్తాడు. దానిని మహారాష్ట్రలోని చంద్రపూర్‌లో తెలిసిన కస్టమర్ పురుషోత్తం రాజురాకి సరఫరా చేస్తాడు. కొన్ని రోజుల క్రితం పురుషోత్తం తన దగ్గర 62 కిలోల గంజాయి ఆర్డర్ చేశాడు. అతను చిత్రకొండ, ఒడిస్సా, మల్కాజ్‌గిరికి వెళ్లి, సుభాష్ నుండి 62 కిలోల గంజాయిని కొనుగోలు చేసి, అదే రోజు రామగుండం వచ్చాడు. అక్కడి నుండి నగరంలోని నల్గొండ క్రాస్ రోడ్లు పోస్ట్ ఆఫీస్ లేన్ వద్ద నిషేధ ఎండు గంజాయితో రాజురా వచ్చాడు. పోలీసుల సమాచారం మేరకు అతన్ని అక్కడ పట్టుకున్నారు. వెంటనే అతన్ని అదుపులోకి తీసుకొని తన వద్ద ఒక సేల్ ఫోన్, 62 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. దాని విలువ రూ. 15,50,000లు ఉంటుందని తెలిపారు. రాజు ద్వారా సుభాష్, పురుషోత్తంలు గంజాయి విక్రయిస్తున్నారు. వారిద్దరిని కూడా త్వరలో పట్టుకొని కోర్టులో హాజరు పరుస్తామని తెలిపారు. ఈ సమావేశంలో పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



రాజ్‌సుఖ్ నగర్, అన్నపూర్ణ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీ ఎన్నిక



నవతెలంగాణ-కీసర

నాగారం మున్సిపాలిటీ రాజ్‌సుఖ్ నగర్, అన్నపూర్ణ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. జే.దాసు 110 ఓట్ల అధిక్యతతో అధ్యక్షులుగా విజయం సాధించారు. దాసు ప్యానల్ సభ్యులు కమిటీ కీలక పదవులకు ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారులుగా వ్యవహరించిన వేంకటేశ్వర్లు, వేదవతి అధ్యక్షులుగా ఎన్నికైన దాసుకు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో నాగారం మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ముప్పు శ్రీనివాస్ రెడ్డి, కౌన్సిలర్‌లు అన్నంరాజు సుమిత్ర సురేష్, మాదిరెడ్డి వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారం కోసం పోరాడే నాయకుడు ఈటల

ఓరుగంటి వెంకటేశ్వర్లు యాదవ్



నవతెలంగాణ- మేడ్చల్

పేద ప్రజల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడే నాయకుడు ఎంపీ ఈటల రాజేందర్ అని బీజేపీ నాయకుడు డాక్టర్ ఓరుగంటి వెంకటేశ్వర్లు అన్నారు. ఎంపీ ఈటలను ఆదివారం ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువ కప్పి సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎంపీ ఈటల రాజేందర్ మల్కాజ్‌గిరి పార్లమెంట్ పరిధిలో విస్తృతంగా పర్యటిస్తూ.. హైడ్రా బాధితులకు అండగా నిలుస్తూ వారికి ధైర్యాన్ని ఇస్తున్నారని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో ముఖ్య పాత్ర పోషించారని, ఆర్థిక శాఖ, ఆరోగ్యశాఖ మంత్రిగా పనిచేసి ప్రజల మన్ననలు పొందారని తెలియజేశారు. కరోనా కష్టకాలంలో ఆరోగ్య మంత్రిగా పనిచేస్తూ విశేషంగా సేవలు అందించారని కొనియాడారు. ప్రజల సంక్షేమం కోసం 24గంటలు పనిచేస్తూ శ్రమిస్తున్నారని అభిప్రాయం వ్యక్తం చేశారు. వ్యక్తిగత ప్రయోజనాలను పక్కన పెట్టి ప్రజా సమస్యలే ప్రధాన ఏజెండాగా ముందుకు సాగుతున్నారని అన్నారు.

రేషన్ కార్డుల సర్వే షురూ..



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

రేషన్ కార్డుల సర్వే నిర్వహించి ప్రజలకు తెల్ల రేషన్ కార్డులను ప్రభుత్వం అందిస్తుందని గన్ ఫౌండ్రి డివిజన్ అధ్యక్షులు పి.చంద్రమోహన్ యాదవ్ అన్నారు. బొగ్గుల కుంట, హనుమాన్ టెక్డి, కందస్వామి లేన్‌లో రేషన్ కార్డుల సర్వే నిర్వహించిన రెవెన్యూ సిబ్బందితో కలిసి బస్తీల్లో పర్యటించి సర్వే నిర్వహించారు. ఈ నెల 26 నుంచి అర్హులైన పేదలకు తెల్ల రేషన్ కార్డులు పంపిణీ చేయాలని సీఎం రేవంత్ రెడ్డి నిర్ణయించిన నేపథ్యంలో రెవెన్యూ సిబ్బంది సర్వే చేపట్టి, అర్హులైన ప్రతి పేద కుటుంబానికి తెల్ల రేషన్ కార్డు మంజూరు అయ్యేలా చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్వే సిబ్బంది ఆర్‌పి రాజేశ్వరి, కాంగ్రెస్ నాయకులు సంతోష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

ఢిల్లీ ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ నాగలోయ్ అసెంబ్లీ అభ్యర్థి రోహిత్ చౌదరితో కలిసి పాల్గొన్న తెలంగాణ ఫిషరీస్ చైర్మెన్ మెట్టు సాయికుమార్ తదితరులు

కాంగ్రెస్ ప్రభుత్వంలో బలహీన వర్గాలకు సముచిత స్థానం



- ఉమ్మడి రాష్ట్ర మాజీ ప్రధాన సమాచార కమిషనర్ డాక్టర్ మర్రి వెంకటేశ్వర్లు

నవతెలంగాణ-ముషీరాబాద్

కాంగ్రెస్ ప్రభుత్వం బలహీన వర్గాలకు సముచిత స్థానం కల్పిస్తూ పదవులు ఇవ్వడం అభినందనీయమని ఉమ్మడి రాష్ట్ర మాజీ ప్రధాన సమాచార కమిషనర్ డాక్టర్ మర్రి వెంకటేశ్వర్లు అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి సీఎం రేవంత్ రెడ్డి బలహీన వర్గాలకు అధిక ప్రాధాన్యత ఇచ్చారని సీఎం అసెంబ్లీ ఎన్నికల్లో నాలుగు ఎమ్మెల్యే, ఒక పార్లమెంట్ నియోజకవర్గం పోటీ చేసినందుకు అవకాశం కల్పించారన్నారు. యాదవులకు కేటాయించిన స్థానాల్లో గెలువక పోయినప్పటికీ ఒక రాజ్యసభ మేయర్ బీసీ పదవులతో పాటు ఇతర అవకాశాలు కల్పించడం అభినందనీయమని తెలిపారు. ఆదివారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో యాదవ మేధావుల ఫోరం ఆధ్వర్యంలో పాలమూరు యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ జీఎస్ శ్రీనివాస్ యాదవ్ ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న డాక్టర్ మర్రే వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పారదర్శకత కలిగిన నాయకులను వివిధ హోదాలో నియమిస్తూ వారికి సముచిత స్థానం కల్పించడంలో సీఎం రేవంత్ రెడ్డి విజయవంతం అయ్యారన్నారు. ఇప్పటివరకు రాష్ట్రంలో యాదవులకు ఏ ముఖ్యమంత్రి ఇవ్వని పదవులు రేవంత్ రెడ్డి ఇచ్చారని రాబోయే రోజుల్లో యాదవులకు మరిన్ని పదవులు ఇచ్చేందుకు ఆలోచిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. యాదవ మేధావుల ఫోరం అధ్యక్షులు చలకాని వెంకట్ యాదవ్ మాట్లాడుతూ.. యాదవులు జనాభా దామాషా పద్ధతిలో అన్ని రంగాలలో వాటాల పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం కులగణనను వెంటనే పూర్తి చేసి స్థానిక సంస్థల ఎన్నికల్లో జనాభా ప్రకారం రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కూడా మాజీ చైర్మెన్ సంఘం, సుందర్రాజు యాదవ్, డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఫ్యాక్టరీస్ ముక్కామల వెంకన్నయాదవ్, అఖిల భారత యాదవ మహాసభ రాష్ట్ర అధ్యక్షులు చింతల రవీంద్రనాథ్ యాదవ్, డి.మన్మోహన్‌యాదవ్, ఆర్.ఎన్ గౌతం, కాంగ్రెస్ అధికార ప్రతినిధి సీహెచ్ బద్రినాథ్ యాదవ్, యాదవ మేధావుల ఫోరం ఉపాధ్యక్షుడు శ్రీనాగ సీతారాములు తదితరులున్నారు.

హజ్ యాత్రికులు ఆరోగ్యంపై వైద్యుల సలహాలు తీసుకోవాలి



నవతెలంగాణ-ధూల్‌పేట్

అనారోగ్యంతో ఉన్న హజ్ యాత్రికులు హజ్ సమయంలో ప్రతి రోజు డాక్టర్, కుటుంబ సభ్యుల సలహాలు తీసుకోవాలని తెలంగాణ హజ్ కమిటీ చైర్మెన్ ఖుస్రో పాషా, హజ్ కమిటీ డైరెక్టర్ మొహమ్మద్ లాయక్‌లు అన్నారు. ఆదివారం అలంఘీర్ మస్జీద్ లో హజ్ యాత్రికుల కోసం ఏర్పాటు చేసిన హజ్ అవగాహనలో వారు ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడుతూ..

హజ్ యాత్రకు వెళుతున్న వారు ప్రతి రోజు తమ ఆరోగ్య సమస్యలపై డాక్టర్, కుటుంబ సభ్యుల సలహాలు తీసుకోవాలన్నారు. సమయానికి మందులు వాడాలని సూచించారు. హజ్ యాత్రలో ఎక్కువగా నడవాలని, సమయం దొరికినప్పుడు ఖురాన్ పఠనం చేయాలన్నారు. దేశం అభివృద్ధి చెందాలని దేశ ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని ప్రార్థించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మౌలానా జాఫర్ పాషా, ముజీబ్, హజ్ కమిటీ సీఇఒ, సూపరింటెండెంట్, హజ్ యాత్రికులు తదితరులు పాల్గొన్నారు.

సంగీతం సర్వ మానసిక రోగ నివారిణి



నవతెలంగాణ కల్చరల్

సంగీతం సర్వ మానసిక రోగ నివారిణి అని వంశీ సంస్థల అధినేత వంశీ రామరాజు అన్నారు. శ్రీ త్యాగరాయ గానసభ ప్రధాన వేదిక పై రస రాగ వాహిని నిర్వహణలో హిందీ తెలుగు సినిమా పాటల గాన విభావరి జరిగింది. సుమారు ముప్పై మంది గాయనీ, గాయకులు పలు పాటలను మధుర సుధా రస భరితంగా గానం చేశారు. యుగంధర్, శ్రీనివాస్ మూర్తి, చిదంబర శాస్త్రి, దక్షిణా మూర్తి, రామ మూర్తి, కామేశ్వరి కనక దుర్గ భార్గవి, లక్ష్మి తదితరులు గాన విభావరిలో పాలు పంచుకున్నారు. అనంతరం జరిగిన సభా కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న వంశీ రామ రాజు మాట్లాడుతూ టీవీలో సీరియల్స్ వల్ల ఉపయోగం ఉండదని మంచి పాటలు ఉత్సాహం ఉల్లాసం కలిగిస్తాయని చెప్పారు. వయోధికులు సైతం ఆసక్తితో పాటలు పాడి ఆకట్టుకున్నారని అభినందించారు. సంస్థ వ్యవస్థాపకుడు పొన్నపల్లి రవి శంకర్ స్వాగతం పలుకుతూ రెండు తెలుగు రాష్ట్రాలు చెందిన గాయనీ గాయకులతో పాటు అమెరికా నుంచి కూడా కార్యక్రమంలో పాలు పంచుకున్నారని తెలిపారు. పొన్నపల్లి కామేశ్వరి కార్యక్రమ పర్యవేక్షణ చేశారు.

తెలుగుభాషా సాహిత్య ఉన్నతికి కృషి



- రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ పూర్వ చైర్మెన్ ఉప్పల శ్రీనివాస్

నవతెలంగాణ-కల్చరల్

తెలుగు భాషా సాహిత్య ఉన్నతి కి విశేష కృషి చేసిన కొమర్రాజు వెంకట లక్ష్మణరావు నేడు చరిత్ర పుటల్లో మెరుగున పడటం విచారకరమని రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ పూర్వ చైర్మెన్ ఉప్పల శ్రీనివాస్ అన్నారు. శ్రీ త్యాగరాయ గానసభలోని లలిత కళా వేదికపై గాన సభ నిర్వహణలో జరుగుతున్న ఎందరో మహానుభావులు కార్యక్రమ పరంపరలో భాగంగా కొమర్రాజు వెంకట లక్ష్మణరావు యాది లో పేరిట సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఉప్పల శ్రీనివాస్ మాట్లాడుతూ తెలంగాణ ప్రాంతంలోని గ్రామం నుంచి ఎదిగిన లక్ష్మణ రావు ఉర్దూ భాష రాజ్య మేలుతున్న తరుణంలో తెలుగు భాషా సాహిత్య వికాసానికి ఆయన రచనలు దోహదం చేశాయని తెలిపారు. ఆయన రాసిన విజ్ఞాన చంద్రిక పరిశోధకుల విద్యార్థులకు కర దీపిక అని వివరించారు. గాన సభ అధ్యక్షుడు కళా జనార్ధన మూర్తి అధ్యక్షత వహించిన సభలో సాహితీ వేత్త ఆచార్య జయ రాములు కీలక ప్రసంగం చేశారు కె.వెంకట రావు తదితరులు పాల్గొన్నారు.

కేంద్రం కార్మిక, రైతాంగ వ్యతిరేక విధానాలను విడనాడాలి

సీఐటీయూ సదస్సులో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు జంగారెడ్డి



నవతెలంగాణ-ధూల్‌పేట్

కేంద్ర ప్రభుత్వ కార్మిక రైతాంగ వ్యతిరేక విధానాలను విడనాడాలని సీఐటీయూ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు జంగారెడ్డి అన్నారు. కార్మిక కర్షక ఐక్యత దినోత్సవం సందర్భంగా హైదరాబాద్ సౌత్ జిల్లా ఆధ్వర్యంలో నిర్వహించిన సీఐటీయు సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం రైతులకు వ్యతిరేకంగా మూడు నెలల చట్టాలతో రైతులను ఇబ్బందులకు గురిచేసే కుట్రలు చేసిందన్నారు. దీంతో దేశవ్యాప్తంగా రైతులంతా ఏకమై పెద్ద ఎత్తున 13 నెలలు వీరోచిత పోరాటం చేశారన్నారు. ఆ పోరాటంలో 700 మంది మరణించారన్నారు. రైతుల మరణ పోరాటంతో వెంటనే కేంద్ర ప్రభుత్వం దిగివచ్చి నల్ల చట్టాలని వెనక్కి తీసుకోవడం జరిగిందని గుర్తు చేశారు. రైల్వే, బొగ్గు వంటి అనేక రంగాలను ప్రభుత్వం ప్రయివేట్ పరం చేయాలని పెద్ద ఎత్తున కంకణం కట్టుకుందన్నారు. మేడే స్ఫూర్తిని గుర్తు చేసుకోవడం చాలా అవసరం అని తెలియజేశారు. అనేక మంది పోరాటాలు, త్యాగాలు చేసి సాధించిన చట్టాలను ఇప్పుడు మోడీ బీజేపీ ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చి చట్టాలన్నింటిని తుంగలో తొక్కిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ చట్టాలను కాకుండా నాలుగు కోడ్లుగా మార్చడంపై మండిపడ్డారు.కార్మికుల 8 గంటల పని విధానాన్ని రద్దు చేసి 12 గంటల పని విధానాన్ని తీసుకురావడం కోసం పెద్ద ఎత్తున ప్రయత్నాలు చేస్తుందన్నారు. ఎంఎస్ఎఫ్ చట్టం చేయాలని కేంద్రం కుట్ర పూరిత ముమ్మర ప్రయత్నాలు చేస్తుందన్నారు. ప్రజా సమస్యలను పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాల్సిన ప్రభుత్వం ఇలా వ్యతిరేక విధానాలను అవలంభిస్తున్న కేంద్ర ప్రభుత్వం తగిన గుణపాఠం చెప్పాలన్నారు. కార్మికులు కర్షకులు ఐక్యమై భవిష్యత్తులో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపట్టాల్సిన అవసరం ఎంతో ఉందన్నారు. ఈ సదస్సులో సీఐటీయూ సౌత్ జిల్లా అధ్యక్షురాలు ఎం.మీనా, ఉపాధ్యక్షులు కే జంగయ్య, తుపాకీ ఆంజ నేయులు, వెంకటేశ, భాగ్యమ్మ, తిరుపతయ్య తదితరులున్నారు.

నేడు సినిమాలలో నాణ్యత తగ్గింది



నవతెలంగాణ-కల్చరల్

నాటి తరంలో ఎన్‌టీఆర్, ఎన్ఆర్ తదుపరి కృష్ణ శోభన్ బాబు తరం వారు సామాజిక కుటుంబ పర కథా చిత్రాలలో నటించే వారనీ నేడు అలాంటి నాణ్యత గల సినిమాలు రావటం లేదని రాష్ట్ర శాసన మండలి ప్రతిపక్ష నాయకుడు సిరికొండ మధుసూదనాచారి అన్నారు . శోభన్ బాబు వారసత్వంగా కుటుంబం నుంచి సినిమాలోకి ఎవరూ రాకున్నా దశాబ్దాల క్రితమే చిత్ర రంగం నుంచి దూరం జరిగిన ఆయన పేరిట ఇప్పటికీ జయంతి ఉత్సవాలు జరపటం విశేషమని చెప్పారు. రవీంద్ర భారతి ప్రధాన వేదికపై శోభన్ బాబు సేవా సమితి, సీల్ వెల్ కార్పొరేషన్, శ్రుతి లయ ఆర్ట్స్ అకాడమీ నిర్వహణలో భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో శోభన్ బాబు జయంతి పురస్కరించుకొని ఆయన పేరిట రజిత కిరీట ధారణ ప్రముఖ నటుడు నరేష్‌కు చేశారు. ముఖ్య అతిథిగా మధుసూదనా చారి పాల్గొని నరేష్‌ను సత్కరించి మాట్లాడారు. శోభన్ బాబు అవార్డుకు నరేష్‌ను ఎంపిక చేసుకోవటం ఔచిత్యంగా వుందని అభినందించారు. నటి జయసుధ మాట్లాడుతూ నరేష్ నేటికీ నటునిగా విలక్షణ పాత్రలు ధరిస్తూ పేరు ప్రఖ్యాతులు సంపాదించుకొంటున్నారని అభినందించారు. శోభన్ బాబు అందాల నటుడు మాత్రమే కాక ఉత్తమ వ్యక్తి అని వివరించారు. సన్మాన గ్రహీత నరేష్ మాట్లాడుతూ ఎన్ని పురస్కారాలు అందుకున్నా శ్రుతి లయ బహు బహుకరించిన శోభన్ బాబు అవార్డ్ అత్యున్నతమైనదని అయన స్థాయి కి తాను లేకున్నా అయన బాటలో నడుస్తున్నానన్నారు. బహుబలి లాంటి సినిమాలు రావొచ్చు కానీ శోభన్ బాబు లాంటి నటుడు మళ్ళీ రాడని చెప్పారు . శ్రుతి లయ గతంలో తనకు బిరుదు ప్రదానం చేసిన విషయాన్ని గుర్తు చేసుకున్నారు. వేదికపై అఖిల భారత శోభన్ బాబు సేవా సంఘం అధ్యక్షుడు దివాకర్ బాబు శోభన్ బాబు సేవా సమితి అధ్యక్షుడు రామకృష్ణ సభ్యులు లాల్ బహదూర్ శాస్త్రి, పద్మా రావు, సాయి కామ రాజు, రాష్ట్ర పోలీసు హౌసింగ్ కార్పొరేషన్ పూర్వ చైర్మెన్ కోలేటీ దామోదర్, జర్నలిస్ట్ జితేందర్ రావు, రఫీ, శ్రుతి, లయ ఆర్ట్స్ అధ్యక్షుడు బొక్కా భీమ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. తొలుత ప్రముఖ గాయని ఆమని గాయకుడు చంద్ర తేజ, ఇతర గాయనీ గాయకులు సుభాష్, రాజన్ ఆనంది, శ్రీదేవి, శ్రీ లక్ష్మీఅనుష, అరుణ శేఖర్, కృష్ణ, ప్రసాద్ తదితరులు శోభన్ బాబు సినిమాలలో పాటలు మధురం గా ఆలపించారు.

మూడు తరాలు మారిన న్యాయం జరగలే..

- రాజగోపాల్ నగర్ లేఅవుట్ ప్లాట్ బాధితులు విజ్ఞప్తి చేస్తూ ఇందిరాపార్క్ ధర్నాచౌక్ లో ధర్నా



నవతెలంగాణ-ముషీరాబాద్

రాజకీయ నాయకుల పెద్దల అండదండలతో యధేచ్ఛంగా కబ్జాదారులు తమ ప్లాట్లను నోటరీలతో అమ్ముకొని మోసం చేస్తున్నారని ఐలాపూర్ రాజగోపాల్ నగర్ ప్లాట్ల యాజమానుల అసోసియేషన్ ఆరోపించింది. దశాబ్దాలుగా న్యాయపోరాటం చేస్తున్న హైకోర్టు తీర్పులు తమకు అనుకూలంగా వచ్చినా కూడా అధికారులు న్యాయం చేయడం లేదని వాపోయింది. 30 ఏండ్ల కింద కొన్నప్లాట్లు 40 లో మూడు తరాలు మారిన ఎదురు చూపే మిగిలిందని ఆందోళన వ్యక్తం చేసింది. సంగారెడ్డి అమీన్పూర్ మండలం ఐలాపూర్ పరిధిలోని రాజగోపాల్ నగర్ లేఔట్‌లోని ప్లాట్ల కొనుగోలు బాధితులు న్యాయం చేయాలని కోరుతూ ఆదివారం ఇందిరా పార్క్ ధర్నాచౌక్ లో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షులు లక్ష్మీనారాయణ, వైస్ ప్రెసిడెంట్ శ్రీనివాస్, సెక్రటరీ సందీప్ మాట్లాడుతూ ఐలాపూర్ పరిధిలోని రాజగోపాల్ నగర్ లేఔట్ లోని సర్వేనెంబర్ 119 నుంచి 220 వరకు మొత్తం 408 ఎకరాల్లో 40 ఏండ్ల క్రితం సేల్ డీడ్ ద్వారా 3వేల మంది ప్లాట్లు భూములు కొనుగోలు చేశామని తెలిపారు. లోకల్ నాయకులు కొందరి అధికారుల ప్రోద్బలంతో తప్పుడు పత్రాలు సృష్టించి భూమిని కబ్జా చేసి అమాయక ప్రజలకు నోటరీ ద్వారా కట్టబెడుతున్నారని తెలిపారు. భూమి దగ్గరికి వెళ్తే కబ్జా చేసిన వారు చంపేస్తామని బెదిరిస్తున్నారని, ఇప్పటికే ప్రశ్నించిన ఇద్దరిని హత్య చేశారని ఆరోపించారు. 40 ఏండ్ల కింద ఉద్యోగం చేస్తున్న సమయంలో ప్లాట్లను కొనుగోలు చేశామని నేడు వృద్ధాప్యంలో ఆరోగ్య సమస్యలతో సతమతమవుతూ ఇంటి కల నెరవేర్చుకోవడానికి పోరాటం చేయాల్సిన దుస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. మా వయసుకు వచ్చేసరికి మూడు తరాలు మారిన భూమి దక్కడం లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం సీఎం రేవంత్ రెడ్డి స్పందించి తమకు న్యాయం చేయాలని ముక్తకంఠంతో బాధితులు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ట్రెజరర్ రమేష్, రామ్మూర్తి, ఉషారాణి, మాధవి తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గిరిజనుల హామీలు అమలు చేయాలి



- లంబాడ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు మూడవత్ రాంబాల్ నాయక్
- ఎల్‌హెచ్‌పీఎస్ క్యాలెండర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-ముషీరాబాద్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గిరిజనులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని లంబాడ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు మూడవత్ రాంబాల్ నాయక్ డిమాండ్ చేశారు. ఆదివారం బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సక్రు నాయక్ అధ్యక్షతన రాష్ట్ర కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎల్‌హెచ్‌పీఎస్ నూతన సంవత్సర క్యాలెండర్‌ను తెలంగాణ రాష్ట్ర గిరిజన సహకార ఆర్థిక అభివృద్ధి సంస్థ చైర్మెన్ డాక్టర్ బెల్లయ్య నాయక్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు రాంబాల్ నాయక్ హాజరై మాట్లాడుతూ భారతదేశంలో హిందీ తర్వాత ఎక్కువ మంది మాట్లాడే భాష గోర్ భోళి భాషా అన్నారు. ఈ భాషను భారత రాజ్యాంగంలో చేర్చాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి సిఫార్సు చేయాలన్నారు. ఈగోర్ భోళి భాషను రాజ్యాంగంలో ఎనిమిదవ భాషగా చేరుస్తామని అన్ని రాజకీయ పార్టీలు కాంగ్రెస్‌తో సహా తమ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించారన్నారు. ఫిబ్రవరి 15న గిరి జనుల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి అధికా రికంగా సెలవుదినంగా ప్రకటించి జయంతి ఉత్సవాలకు జిల్లాకు కోటి రూపాయలు మంజూరు చేయాలన్నారు. ప్రభుత్వాలు ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన ప్రతి ఒక్క హామీని అమలు చేయుటకు భవిష్య త్తు కార్యాచరణకు త్వరలో సమావేశం నిర్వహించి నిర్ణయం తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో జాతీయ ప్రధాన కార్యదర్శి భూక్య కోటియ నాయక్, జాతీయ ఉపాధ్యక్షులు చిన్ని కృష్ణ నాయక్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రమావత్ సక్రు నాయక్, ప్రధాన కార్య దర్శి చందర్ నాయక్, స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు అశోక్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రమేష్ నాయక్, బిక్షం నాయక్ చందు నాయక్ వెంకట్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

రాజు యాదవ్ సేవలు మరువలేనివి

- మాజీమంత్రి సి.కృష్ణ యాదవ్



నవతెలంగాణ-అంబర్‌పేట

నగరానికి చెందిన సీనియర్ నాయకులు రాజు యాదవ్ సేవలు మరువలేవని మాజీమంత్రి సి.యాదవ్ అన్నారు. ఆదివారం నగరం చెందిన సీనియర్ నాయకులు రాజు యాదవ్ దశదినకర్మ వేడుకల్లో ముఖ్యఅతిథిగా పాల్గొన్న మాజీ మంత్రి సి.కృష్ణ యాదవ్ హాజరై ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా నగర అభివృద్ధికి ఎంతో కృషి చేశారని రాజు యాదవ్ ఆయన సేవలు కొనియాడారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు దినేష్ అంబారి తదితరులు పాల్గొన్నారు.

అఖిలభారత పద్మశాలి యువజన విభాగం అధ్యక్షుడిగా శ్రీనివాస్

నవతెలంగాణ-ముషీరాబాద్



అఖిలభారత పద్మశాలి యువజన విభాగం అధ్యక్షుడిగా నియమితులైన శ్రీనివాస్‌కు ఆదివారం నారాయణగూడలో సన్మానం జరిగింది. తెలంగాణ ప్రాంత పద్మశాలి ఆర్గనైజింగ్ సెక్రటరీ బాలు దుర్గం ఆధ్వర్యంలో శ్రీనివాస్‌కు సన్మానం జరిగింది. ఈ కార్యక్రమంలో అఖిలభారత పద్మశాలి సంఘం నాయకుడు సితా సాయిరాం, బాలరాజ్, ఉపేందర్, రాబిన్ సి.సిద్ధార్థ తదితరులు పాల్గొన్నారు.

21న ప్రముఖ రచయిత వుప్పల నరసింహం సంతాప సభ

నవతెలంగాణ-సుల్తాన్ బజార్

ఈనెల 21న ప్రముఖ రచయిత ఉప్పల నరసింహ సంతాప సభ నిర్వహిస్తున్నట్లు కాంతి, తేజ ఓ ప్రకటన లో తెలిపారు. ఆదివారం వారు మాట్లాడుతూ.. మంగళవారం బషీర్ బాగ్‌లోని ప్రెస్ క్లబ్ సురవరం ప్రతాపరెడ్డి ఆడిటోరియం ప్రముఖ రచయిత వుప్పుల నరసింహ సంతాప సభ నిర్వహిస్తున్నామని ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ప్రముఖ కవి, రచయిత జయధీర్ తిరుమలరావు, బీసీ కమిషన్ మాజీ చైర్మెన్ బి.ఎస్.రాములు, రిటైర్డ్ తహసీల్దార్ ఉప్పుల బాలరాజు, ఆడెపు లక్ష్మీపతి, కవి యాకూబ్, సంగిశెట్టి శ్రీనివాస్, ఎస్.యం.ప్రాణ్‌రావు, తుమ్మలపల్లి రఘు రాములు, శంకర నారాయణ, కోడెపాక కుమార స్వామి, నారు, అనిల్ అట్లూరి, వనపట్ల సుబ్బయ్య, కెపి. అశోక్ కుమార్, జంపాల ప్రవీణ్ పాల్గొంటారని తెలిపారు.

వృద్ధుడు అదృశ్యం..

నవతెలంగాణ-ధూల్‌పేట్

వృద్ధుడు అదృశ్యమైన సంఘటన మంగళ్ హాట్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సబ్ ఇన్‌స్పెక్టర్ అస్లం షేక్ తెలిపిన వివరాల ప్రకారం.. మంగళ్ హాట్, ప్రకాష్ టాకీస్ ప్రాంతానికి చెందిన గజానంద్ చౌదరి(6) మార్వాడి ఇంట్లోనే ఉండేవాడు. 15న సాయంత్రం నుండి ఇంట్లో కనిపించడం లేదు. దీంతో కుటుంబీకులు స్థానికంగా, బంధుమిత్రుల, రక్త సంబధీకులతో వాకాబు చేశారు. ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

నవతెలంగాణ-ధూల్‌పేట్



బీజేపీ రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్యను ఆదివారం అయన నివాసంలో కలసి శాలువా కప్పి పూల బొకే ఇచ్చిన బీజేపీ ఓబీసీ మోర్చా అధికార ప్రతినిధి అనుగంటి రాజు, బీజేపీ మైనారిటీ మోర్చా మాజీ అధికార ప్రతినిధి మీర్ ఫిరసత్ అలీ బాక్రీ, బీజేపీ సీనియర్ నాయకుడు సయ్యద్ నజాఫ్ అలీ షౌకత్ తదితరులు..

మొబైల్‌ను ప్రయాణీకుడికి అందజేసిన ఆర్టీసీ సిబ్బంది



నవతెలంగాణ- కూకట్‌పల్లి

టీజీఎస్ ఆర్టీసీ కూకట్‌పల్లి డిపో బస్సులో ప్రయాణికుడు మొబైల్‌ను మర్చిపోయాడు. మొబైల్‌ను ఆర్టీసీ సిబ్బంది ప్రయణీకుడికి అందజేశారు. కూకట్‌పల్లి డిపోకు చెందిన బస్ 180 మెహదీపట్నం కేపీహెచ్‌బీ రూట్ డ్రైవర్ రాజ్ కుమార్, కండక్టర్ సరితలు విధి నిర్వహణలో ఉండగా.. ఓ ప్రయాణికుడు మెహదీపట్నంలో బస్సు ఎక్కి మాసాబ్ ట్యాంక్‌లో దిగిపోయాడు. తన మొబైల్ మర్చిపోవడంతో.. కూకట్‌పల్లి డిపో ఎస్సై మల్లేశంకు అందజేసి.. అతన్ని పిలిపించి మొబైల్ అందజేశారు. అందుకు ఆ ప్రయాణికుడు ఆర్టీసీ సిబ్బంది నిజాయితీకి సంతోషిస్తూ.. వారిని అభినందించి కృతజ్ఞతలు తెలిపాడు.

నూతన కమిటీ ఆధ్వర్యంలో కాలనీ అభివృద్ధి చేయాలి..



నవతెలంగాణ-కూకట్‌పల్లి

నూతన కమిటీ ఆధ్వర్యంలో కాలనీ అభివృద్ధి చేయాలని ఎమ్మెల్యే మాధ వరం కృష్ణారావు అన్నారు. కూకట్‌పల్లి మూసాపేట్ డివిజన్ శక్తి నగర్ సంక్షేమ సంఘం, నూతన కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మూసాపేట్ మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్ కుమార్ ఆధ్వర్యంలో.. కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావుని కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాజీ కార్పొరేటర్‌ని శాలువాతో సత్కరించారు. నూతన కమిటీ కాలనీని మరింత అభివృద్ధి చేయాలని ఆకాంక్షించారు. దానికి అవసరమైన సహకారాలు అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు అంబటి శ్రీని వాస్, కాలనీ నూతన అధ్యక్షుడు చిరంజీవి, సాయి కృష్ణ, పాండురంగ రెడ్డి, అప్పారావు, శ్రీరామ్, రమేష్, రాజశేఖరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిఘా నేత్రాల ఏర్పాటుతో నేరాల నియంత్రణ



- ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

నిఘా నేత్రాల ఏర్పాటుతో భద్రతతోపాటు నేరాలు నియంత్రించవచ్చునని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. ఆదివారం రంగారెడ్డి నగర్ డివిజన్ పరిధి గురుమూర్తినగర్ ప్రాంతంలో నూతనంగా ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను బాలనగర్ సీఐ.నరసింహ రాజుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రోజురోజుకు పెరుగుతున్న సైబర్ నేరాలను పసి గట్టడంలో సీసీ కెమెరాల పాత్ర ఎంతో కీలకమని తెలిపారు. సీసీ కెమెరాలు ఏర్పాటు ఎంత ముఖ్యమో వాటి నిర్వహణ కూడా అంతే ముఖ్యమని నిర్వాహకులకు సూచించారు. సీఐ.నరసింహారాజు మాట్లాడుతూ ఒక కెమెరా వేయి కళ్ళతో సమానమని క్రిమినల్స్‌ను పట్టుకోవడంలో సీసీ కెమెరాలు దోహదపడతాయన్నారు. ఫ్రెండ్లీ పోలీసులో భాగంగా నేరాల నియంత్రణకు ప్రతి ఒక్కరు తమకు సహకరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సై.రామ్ నారాయణ, డివిజన్ అధ్యక్షులు ఎర్వ.శంకరయ్యసీనియర్ మహిళా నాయకురాలు తారక రాణి, స్థానిక నాయకులు ఓంకార్, మర్కంటి నర్సింగ్ రావు, మురుగేష్, కరణ్, బాలకృష్ణ, సీతారాం తదితరులు పాల్గొన్నారు.

బాలాజీ మేఘరాజ్ స్టేషనరీ ప్రారంభం..

చింతల్ డివిజన్, చంద్రానగర్ ప్రధాన రహదారిలో రాజేష్ కచ్వా ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన బాలాజీ మేఘరాజ్ స్టేషనరీ షాపును ఆదివారం ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ప్రారంభించారు. కస్టమర్లకు మెరుగైన సేవలు అందించాలని నిర్వాహకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు మహమ్మద్ రఫీ, రంగారెడ్డినగర్ డివిజన్ అధ్యక్షులు ఎర్వ. శంకరయ్య రుద్ర అశోక్, పుప్పాల భాస్కర్, పోలె శ్రీకాంత్, మైనార్టీ నాయకులు మక్సూద్ అలీ, సీనియర్ నాయకులు కృష్ణమూర్తి, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.



పరిశుధ్య కార్మికుల పనులు పరిశీలన



- కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్

నవతెలంగాణ-కూకట్‌పల్లి

జీహెచ్‌ఎంసీ పారిశుధ్య కార్మికుల, రోజువారీ హాజరు పట్టిని వారు నిర్వహిస్తున్న విధులను ఎస్ఎఫ్ఏ మల్లేష్‌తో కలిసి కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్, పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ డివిజన్‌లో మొత్తం 30 మంది పారిశుధ్య కార్మికులు ఉన్నారన్నారు. వారిలో ఐదు మంది వారంతారపు సెలవు, ఏడూ మంది గైహాజరు, మరో ఇద్దరు లాంగ్ లీవ్‌లో ఉన్నారని తెలిపారు. మిగిలిన పదహారు మంది ఈరోజు విధులు నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. పారిశుధ్య కార్మికులు తమ విధులను బాధ్యతగా నిర్వహించి, డివిజన్‌ను పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. ప్రజలు కూడా తమవంతు బాధ్యత వహించి, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. వారానికి ఒకసారైనా తనిఖీ చేసుకుని మీ ఇంటి పరిసరాలలో ఉన్న నీటి నిల్వలను తొలగించాలని సూచించారు. చెత్తను వీధుల్లోనూ కాలువలోను చెరువుల్లోనూ వేయకుండా, తడి చెత్త పొడి చెత్త వేరు చేసి, చెత్త సేకరించే ఆటోలలో మాత్రమే వేయాలని సూచించారు.

పేదలకు ప్రభుత్వ పథకాలు అందించడమే లక్ష్యం

- టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం



నవతెలంగాణ-బాలానగర్

పేదలకు ప్రభుత్వ పథకాలు అందించడమే కాంగ్రెస్ లక్ష్యం అని టీపీసీసీ అధికార ప్రతినిధి డా.సత్యం శ్రీరంగం అన్నారు. తెలంగాణ రాష్ట్ర మాజీ మంత్రి హరీష్ రావు వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. గాంధీ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో సత్యం శ్రీరంగం మాట్లాడుతూ రైతులు, రేషన్ కార్డుల గురించి మాట్లాడే నైతిక హక్కు హరీష్ రావుకు ఎక్కడదని అన్నారు? గత పది సంవత్సరల పరిపాలనలో ఒక్క రేషన్ కార్డు ఇచ్చారా? అని హరీష్ రావు ప్రశ్నించారు. ఇందిరమ్మ ప్రభుత్వం అర్హుడైన ప్రతి కుటుంబానికి రేషన్ కార్డు ఇస్తామన్నారు. ప్రజా ప్రభుత్వంలో ఇందిరమ్మ ఇండ్లు, రైతులు, ఉద్యోగాల భర్తీ విషయంలో హరీష్ రావు, కేటీఆర్‌లు బీఆర్ఎస్ పార్టీకి మాట్లాడే నైతిక హక్కు లేదని, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఇందిరమ్మ ఇండ్లు, ప్రవేశపెట్టనుంది అన్నారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతు భరోసా, రేషన్ కార్డుల పంపిణీ వంటి పథకాల్లో ప్రజా ప్రభుత్వంలో చేస్తున్న ప్రజా పాలన అభివృద్ధి పనులను ప్రజల సంక్షేమ పథకాలను గడప గడప కు తీసుకెళ్లుతున్నామన్నారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ నిరంకుశ పాలన నుంచి కాంగ్రెస్ ప్రజాస్వామ్య పాలన కొనసాగు తుందని తెలిపారు. కాంగ్రెస్ ప్రజాపాలనలో పేద బడుగు, బలహీన వర్గాలన్నింటికీ రేవంత్ రెడ్డి సర్కార్ అండగా నిలుస్తుందని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారెంటీ పథకాలకు కట్టుబడి ఉందని, దశల వారీగా వాటి అమలు ప్రక్రియను చేపడు తోందని తెలిపారు. ఇప్పటికే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 500కు వంట గ్యాస్ సిలిండర్, 200 యూని ట్ల ఉచిత విద్యుత్ వంటి అనేక కార్యక్రమాలను అమలు చేస్తుందన్నారు. ఓవైపు గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన రూ.7లక్షల కోట్ల అప్పులకు వడ్డీలు కడుతూనే కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో అభివృద్ధి సంక్షేమ పథకాలను కొనసాగిస్తుం దని తెలిపారు. దేశంలో ఎక్కడా లేని విధంగా 22 లక్షల మంది రైతులకు రూ.18 వేల కోట్ల రైతు రుణమాఫీ చేసిన ఘనత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికే దక్కుతుందన్నారు.

ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తాం



- కాంగ్రెస్ ఇన్‌చార్జి బండి రమేష్

నవతెలంగాణ-బాలానగర్

ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తామని కాంగ్రెస్ ఇన్‌చార్జి బండి రమేష్ అన్నారు. కూకట్‌పల్లి నియోజకవర్గం మూసాపేట సర్కిల్ ఫతేనగర్ డివిజన్ 118 లో పార్థివాడ బస్తీకి కూకట్ పల్లి నియోజకవర్గం కాంగ్రెస్‌బండి రమేష్ నేతృత్వంతో పార్థివాడ బస్తీకి రూ.3 లక్ష నిధులు మంజూరు చేయించి నట్టు తెలిపారు. మంజూరైన నిధులతో పార్థివాడ బస్తీ కమ్యూనిటీ హాల్ అభివృద్ధి కోసం వినియోగించుకుంటామని బస్తి వాసులు తెలిపారు. ఈ నేపథ్యంలో ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో నియోజకవర్గంలోని బస్తీలను అన్ని విధాలుగా అభివృద్ధి చేసిఈ మేరకు పార్థివాడ బస్తీ అభివృద్ధి కొరకు కృషి చేసిన బండి రమేష్‌కు, కాంగ్రెస్ ప్రభుత్వ అధికారులకు బస్తీ వాసులు కృతజ్ఞతలు తెలిపారు. డివిజన్ అధ్యక్షులు కె.రమేష్, టీపీసీసీ ప్రోటోకాల్ కమిటీ కార్యదర్శి సూరజ్ కుమార్ తివారి, కాంటస్టెండ్ కార్పొరేటర్ కె.రాజు ముదిరాజ్, డివిజన్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.రాము, వైస్ ప్రెసిడెంట్ ఎల్. నర్సింగ్ రావు, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా యువజన కాంగ్రెస్ కార్యదర్శి చిట కోరు కృష్ణ, బస్తీ వాసులు ఇఎస్.రాజు, లైకన్ శక్తి శివ, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

- పీఎఫ్ అమలుకు ఇబ్బందులు పడుతున్న వైనం
- కనీస పెన్షన్ రూ.9వేలు చెల్లించాలి
- హయ్యర్ పెన్షన్ చెల్లింపును సత్వరమే పూర్తి చేయాలి
- రేపు పీఎఫ్ కార్యాలయం వద్ద ధర్నాను జయప్రదం చేయండి
- సీఐటీయూ మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కార్యదర్శి జె.చంద్రశేఖర్



నవతెలంగాణ-సిటీబ్యూరో

పీఎఫ్ అమలులో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 21వ తేదీన హైదరాబాద్ బర్కత్‌పుర పీఎఫ్ కార్యాలయం ఎదుట ధర్నాకు పిలుపునిచ్చినట్టు సీఐటీయూ మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కార్యదర్శి జె.చంద్రశేఖర్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. పారిశ్రామిక కార్మికులు, మున్సిపల్, ఆర్టీసీ తదితర పీఎఫ్, ఈపీఎస్ స్కీమ్ అమలయ్యే అన్ని రంగాల కార్మికులు, రిటైరైన ఈపీఎస్ పెన్షనర్లు అందరూ పాల్గొని ఈ ధర్నాను జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. అనేక పోరాటాలతో సాధించుకున్నదే పీఎఫ్ యాక్ట్-1952 అని తెలిపారు. ఉద్యోగంలోకి వచ్చే ప్రతి కార్మికుడూ ఇందులో సభ్యులవుతారనీ, సభ్యులైన ప్రతి కార్మికుని జీతం నుంచి 10 నుంచి 12 శాతం రికవరీ చేసి, దానికి అంతే మొత్తం మ్యాచింగ్ గ్రాంట్‌గా యాజమాన్యం చెల్లిస్తుందని తెలిపారు. ఈ రెండు మొత్తాలు కూడా కార్మికుని ఖాతాల్లో ఉంటాయని తెలిపారు. ఈ స్కీమ్ పరిధిలోనే ఎంప్లాయీ పెన్షన్ స్కీమ్ (ఈపీఎస్), ఎంప్లాయీస్ డిపాజిటెడ్ లింక్డ్ ఇన్సూరెన్స్ స్కీమ్ (ఈడీఎల్ఎస్) నిర్వహిస్తున్నారని తెలిపారు. ఈ భవిష్యనిధి స్కీమ్ అమలులో అనేక సమస్యలు వస్తున్నాయని పేర్కొన్నారు. కార్మికుని వాటాతోపాటు యజమాని వాటాని కూడా కార్మికుని జీతం నుంచి రికవరీ చేస్తున్న ఘటనలు అనేకం ఉన్నాయని తెలిపారు. కార్మికుని నుంచి రికవరీ చేసిన మొత్తాలను పీఎఫ్ కార్యాలయంలో జమ చేయకుండా కార్మికులకు తీరని అన్యాయం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికుల భవిష్యనిధి సంస్థ అధికారులను కలిసి తమ సమస్యలను చెప్పుకునే అవకాశమే లేదనీ, ఏ సమస్య ఉన్నా కేవలం సంబంధిత క్లర్క్‌కు వినతి పత్రం ఇవ్వడం తప్ప, పై అధికారుల వద్దకు వెళ్ళే అవకాశం లేకుండా చేస్తున్నారని తెలిపారు. ఒకే ఉద్యోగి వివిధ కంపెనీల్లో పని చేసినా ఒకే అకౌంట్ ఉండేలా 2010లో "యూఏఎన్"ను అమల్లోకి తీసుకొచ్చారనీ, ఈ క్రమంలో కూడా అనేక మందికి యూఏఎన్ నెంబర్స్ రాలేదని తెలిపారు. వచ్చినవారు కూడా ఫోన్ నెంబర్, బ్యాంక్ అకౌంట్, ఆధార్ అనుసంధానం చేసుకోవడంలో అనేక సమస్యలు వస్తున్నాయన తెలిపారు. ఆ ఉద్యోగి పేరులోను, ఆధార్‌లోనూ చిన్న తేడా ఉన్నా అది కేవైసీ అవ్వడం లేదనీ, ఈ కారణంతో వేలాదిమంది ఈపీఎస్ అకౌంట్లను ఫ్రీజ్ చేసినందున వారి ఈపీఎస్ ఖాతాకు తమ రికవరీ చేరడం లేదని తెలిపారు. పొరపాటున ఆ కార్మికుడు చనిపోతే, ఆ కుటుంబం పరిస్థితి ఏమిటి..? అని ప్రశ్నించారు. పీఎఫ్ నిధులను షేర్ మార్కెట్‌లో పెట్టి పెట్టుబడిదారులకు రూ.లక్షల కోట్లు అందుబాటులో ఉంచాలని కేంద్ర ప్రభుత్వం భావించిందనీ, ఇందుకు అనుగుణంగా పీఎఫ్, పెన్షన్ స్కీంలలో అనేక సవరణలను ముందుకు తీసుకొస్తున్నట్టు తెలిపారు. టెక్నాలజీ పెరిగితే, కార్మికుల సమస్యలు త్వరగా పరిష్కారం కావాలి, కానీ అలా కావడం లేదన్నారు. ఒక ఉద్యోగి తన జీవితకాలమంతా పనిచేశాక ఉద్యోగ విరమణ అనంతరం గౌరవంగా బతకడానికి అవసరమైన పెన్షన్ కావాలని కోరుకుంటుంటే కేంద్ర ప్రభుత్వం ఎంప్లాయీ పెన్షన్ స్కీమ్ కింద చెల్లిస్తున్న కనీస పెన్షన్ రూ.1,000 మాత్రమే అని తెలిపారు. కేంద్ర 7వ పే-కమిషన్ నిర్ణయించిన కనీస వేతనం రూ.18వేలలో సగం రూ.9వేలను కనీస పెన్షన్‌గా ఇవ్వాలనీ, కరువు భత్యం, వేతన ఒప్పందాలతో అనుసంధానం చేయాలని కార్మిక లోకం డిమాండ్ చేస్తున్నదని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం మాత్రం ఏ విధంగానూ స్పందించకపోగా, పెన్షన్ స్కీంలో అనేక కార్మిక వ్యతిరేక సవరణలు చేస్తున్నదని తెలిపారు. పీఎఫ్ స్కీం అమలులో కార్మికుడి నుంచి రికవరీ చేసిన డబ్బులను, యాజమాన్య మ్యాచింగ్ గ్రాంట్‌గా ఇచ్చే డబ్బులకు పీఎఫ్ ఖాతాలో జమచేయకపోతే, ఇంతకు ముందున్న 5శాతం నుంచి 24శాతం పెనాల్టీని 1 శాతానికి నికి తగ్గిస్తూ కేంద్రం ఇటీవల ఉత్తర్వులు ఇచ్చిందని తెలిపారు. అలాగే సెల్ఫ్ డిక్లరేషన్ ఇస్తే చాలు, ఎలాంటి ఇన్‌స్పెక్షన్స్ జరగకుండా ఉండేలా నిబంధనలు మార్చేసి పెట్టుబడిదారులకు ఊడిగం చేస్తున్నారని తెలిపారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి ఎలాంటి చొరవ చూపడం లేదన్నారు.

కూచిపూడి నృత్య కళాకారిణికి ఐద్వా, డివైఎఫ్ఐల ఆధ్వర్యంలో

ఘనంగా ఆత్మీయ సన్మానం



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

ప్రముఖ కూచిపూడి నృత్య కళాకారిణి యునెస్కో అంతర్జాతీయ నృత్యం మండలి సభ్యురాలు కుమారి మౌలిక బొల్లినాడికి అఖిలభారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా), భారత ప్రజాతంత్ర యువజన సమైక్య (డివైఎఫ్ఐ) ల ఆధ్వర్యంలో.. ఆదివారం షాపూర్ నగర్ సీఐటీయూ కార్యాలయంలో ఘనంగా ఆత్మీయ సన్మాన కార్యక్రమం నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో ఐద్వా కుత్బుల్లాపూర్ మండల అధ్యక్షురాలు రావుల స్వాతి, సీఐటీయూ కుత్బుల్లాపూర్ మండల అధ్యక్షుడు కీలుకాని లక్ష్మణ్ పాల్గొన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ.. సన్మాన గ్రహీత మౌలిక బొల్లినాడి హైదరాబాదులో సామాన్య కుటుంబంలో పుట్టి, పెరిగి కలలను ప్రోత్సహించే తెలుగు కుటుంబం నుంచి వచ్చిన ఆమె శాస్త్రీయ సంగీతం వింటూ పెరిగారన్నారు. శ్రీ పసుమర్తి వెంకటేశ్వర శర్మ , చంద్రశేఖర్ రాపర్లల విద్యార్థి అయిన ఈ యువ నర్తకి భారత దేశంలో , యూఎస్ఏ అంతట వివిధ వేదికలపై ప్రదర్శనలు ఇస్తూ ఆమె ప్రపంచ వ్యాప్తంగా ఉన్న అన్ని నృత్య రూపాలకు అధికారిక గొడుగు అయినా యునెస్కో అంతర్జాతీయ నృత్య మండలిలో సభ్యురాలిగా ఎదిగినందుకు మనమెంతో గర్వపడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సన్మాన గ్రహీత కూచిపూడి నృత్య కళాకారుని మౌలిక బొల్లినాడి మాట్లాడుతూ.. నాకు మూడు సంవత్సరాల వయస్సు ఉన్నప్పుడు మా అమ్మ నాలోని నృత్య నైపుణ్యాలను గుర్తించి, మన దేశ సంస్కృతి సాంప్రదాయాల పట్ల అపారమైన గౌరవంతో నన్ను కూచిపూడి నృత్య సాధన చేసేలా ప్రోత్సహించడం జరిగింది. నేను చాలా చిన్న వయసులోనే ప్రదర్శనలు ఇవ్వడం ప్రారంభించాను. నేను చదువుతోపాటు కూచిపూడి నృత్యం పై మక్కువ కొనసాగించాను. చదువుతోపాటు కలలు కూడా అభ్యసించమని మా అమ్మ నన్ను ఎంతగానో ప్రోత్సహించేది. కలలు నేర్చుకోవడం జీవితంలో గౌరవం సంస్కృతి, స్వచ్ఛతను నేర్పుతుందని ఆమె నమ్మింది, నా గురువు శ్రీ పసుమర్తి వెంకటేశ్వర శర్మ, చంద్రశేఖర్ రాపర్ల నాకు మార్గదర్శకత్వం చేశారు. కూచిపూడిలో 8 సంవత్సరాలకు పైగా శిక్షణ పొందిన తర్వాత నేను ఇంజనీరింగ్ చదివేటప్పుడు పిల్లలకు నృత్య తరగతులు నేర్పడం ప్రారంభించాను. నా బోధనలోనే నేను కళా రూపం యొక్క లోతును అర్థం చేసుకున్నాను. శిక్షణలో నా భంగిమలను సరి చేసుకోవడానికి నా డాన్స్ క్లాస్మేట్స్ నాకు సహాయం చేశారు. ఐఐటి హైదరాబాదు యొక్క క్లాసికల్ సోలో నృత్యాంజలి పోటీలు 2017లో పాల్గొనడం జరిగిందన్నారు. గీతా గణేషన్ మేడం అందించిన రన్నర్ ఆఫ్ అవార్డును గెలుచుకోవడం. భారత దేశంలో నా చెప్పుకోదగ్గ విజయం. నేను గ్రాడియేషన్ పూర్తిచేసిన తరువాత మాస్టర్ డిగ్రీని అభ్యసించడానికి యూఎస్ఏ కి వెళ్లాను. డాన్స్ వైపు నా అంతర్జాతీయ ప్రయాణం అప్పుడే ప్రారంభమైంది. నా ప్రయాణాన్ని కొనసాగిస్తూ...నాకు డాన్స్ కొనసాగించడం అంత తేలికైన మార్గం కాదు, ప్రత్యేకించి మనం వేరే దేశం వెళ్లినప్పుడు యూఎస్ఏ లో మనల్ని మనం గుర్తింపు పొందుతూ ప్రదర్శనలు చేయడానికి అపారమైన కృషి, పట్టుదల చేయవలసిన అవసరం కావాలి. ఆ కృషికి తోడ్పాటుగా నా గురువు సహకారంతో నేను డెన్వర్లోని లయ డాన్స్ అకాడమీలో చేరి కూచిపూడిని కొనసాగించాను. నేను డెన్వినర్, వివిధ ఫ్లాట్ ఫామ్ లలో అకాడమీ ద్వారా ప్రదర్శనలు ఇవ్వడం ప్రారంభించాను. నేను భవిష్యత్తులో నా సొంత డ్యాన్స్ అకాడమీ ని ప్రారంభించి పేద మధ్యతరగతి పిల్లలకు కూచిపూడిని నేర్పించడం ద్వారా ఈ కళారూపం యొక్క వారసత్వాన్ని కొనసాగించాలనుకుంటున్నాను అన్నారు. మన సంస్కృతి సాంప్రదాయాలపై అవగాహన తీసుకురావాలనుకునే పిల్లల కోసం ఒక వేదిక ఏర్పాటు చేయాలనుకుంటున్నాను. నేను ఐడీసీలో భాగం కావడానికి ఆమోదం పొందుతానని అనుకోలేదు. కౌన్సిల్లో పాల్గొనడానికి మీరు ప్రసిద్ధి చెందిన వారి నుండి రికమండేషన్ కలిగి ఉండాలనీ చాలామంది చెప్పారు. అయినా నేను సొంతంగా చేయగలనా అని అనుకున్నాను. అయినా నేను నా డాన్స్ ప్రోగ్రాములు ప్రదర్శించడం ద్వారా ఐడీసీకి దరఖాస్తు చేశాను. సమీక్ష ప్రక్రియ తర్వాత వారు నాకు ఆమోదం అందించారు. నా 27వ పుట్టినరోజున ఐడీసీ సభ్యత్వాన్ని పొందాను. ఇది నా జీవితంలో నాకు ఉత్తమ పుట్టినరోజు బహుమతిగా నేను చాలా సంతోషపడ్డాను. ఇది ప్రపంచ స్థాయిలో మనల్ని మన నృత్యాన్ని నిరూపించుకోవడానికి ఉపయోగపడింది అని అన్నారు. ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన సీఐటీయూ, డివైఎఫ్ఐ మహిళా సంఘం వాళ్లందరికీ కూడా పేరుపేరునా కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ కుత్బుల్లాపూర్ మండల కార్యదర్శి ఈ దేవదానం, డివైఎఫ్ఐ మండల అధ్యక్ష కార్యదర్శులు ఆది నాగరాజు, భాష శ్రీనివాస్, సైదులు తిమ్మప్ప, స్నేహసింగ్ తదితరులు పాల్గొన్నారు.

జేఎన్‌టీయూహెచ్‌లో ఇంటరాక్షన్ మీటింగ్



నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

విశ్వవిద్యాలయాలు భూమిక పర్యవేక్షణ మాత్రమే కాకుండా, విద్యా సంస్థలకు మద్దతు, మార్గనిర్దేశం చేయడం అవసరమని జేఎన్‌టీయూహెచ్ రెక్టర్ డాక్టర్ కె. విజయకుమార్ రెడ్డి అన్నారు. జవహర్ లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్శిటీ హైదరాబాద్ (జేఎన్‌టీయూ హెచ్) అనుబంధ ఇంజినీరింగ్, ఫార్మసీ, స్టాండలోన్ ఎంబీఏ కళాశాలల (ఆటోనమస్, నాన్-ఆటోనమస్) ఛైర్మన్, సెక్రటరీలు, ప్రిన్సిపాల్స్‌తో ఇంటరాక్షన్ మీటింగ్ ఆదివారం యూనివర్శిటీ క్యాంపస్‌లోని జేఎన్ ఆడిటోరి యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని నాన్-ఆటోనమస్ డైరెక్టర్ డాక్టర్ ఎస్.తారా కళ్యాణి, ఆటోనమస్ డైరెక్టర్ డాక్టర్ బి.రవీంద్ర రెడ్డిల ఆధ్వర్యం లో నిర్వహించిన సమావేశానికి జేఎన్‌టీయూహెచ్ ఉపకులపతి (ఇన్‌చార్జి), తెలంగాణ హయ్యర్ ఎడ్యుకేష న్ కౌన్సిల్ ఛైర్మన్ ప్రొఫెసర్ వి.బాలకిష్ట రెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో రెక్టర్ డాక్టర్ కె. విజయ కుమార్ రెడ్డి, రిజిస్ట్రార్ డాక్టర్ కే.వెంకటేశ్వర రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జేఎన్‌టీయూహెచ్ రెక్టర్ డాక్టర్ కె.విజయకుమార్ రెడ్డి మాట్లాడుతూ విద్యా ప్రమాణాలు, ఆర్థిక వాస్తవాల మధ్య సమతుల్యతను కాపాడడంలో ఛైర్మెన్, ఉపాధ్యాయులు కీలక పాత్ర పోషించాలన్నారు. జేఎన్‌టీయూహెచ్ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ వి. బాలకిష్ట రెడ్డి మాట్లాడుతూ ఉన్నత విద్యా వ్యవస్థ ఎదుర్కొంటున్న సమస్యలు, ముఖ్యంగా పాతబడి ఉన్న అండర్‌గ్రాడ్యుయేట్ సిలబస్, నియంత్రణ మండళ్ల ఆదేశాల కఠినత గురించి చర్చించారు. ఇంజినీరింగ్ కోర్సుల సిలబస్ ఏఐసీటీఈ మార్గదర్శకాల ప్రకారం తరచూ నవీకరిస్తున్నా, ఇతర కోర్సులలో ఏటా మార్పులు చేయాలని ఆయన సూచించారు. ప్రభుత్వం విద్యా సంస్థలలో ఉపాధ్యాయుల కొరతను తీర్చేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు ఛైర్మెన్ తెలిపారు. అలాగే, ఆర్థిక సమస్యలు మరియు ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాలకు సంబంధించి వివిధ సవాళ్లను ఎదుర్కొంటున్నామని, మార్చి 8 నాటికి నిధులు విడుదల చేయబడతాయని తెలిపారు. డైరెక్టర్ డాక్టర్ ఎస్. తారా కళ్యాణి చర్చించిన అంశాలకు సంబంధించిన అమలుచేయదగిన నిర్ణయాలు, పరిష్కారాలను వివరించే సమగ్ర పత్రం సిద్ధం చేస్తున్నట్టు ప్రకటించారు. కొత్త విద్యా సంవత్సరానికి సంబంధించిన అఫిలియేషన్ ప్రక్రియలను వివరించి, కృతజ్ఞతలు తెలుపుతూ కార్యక్రమాన్ని ముగించారు. ఈ సమావేశంలో జేఎన్‌టీయూహెచ్ రిజిస్ట్రార్ డాక్టర్ కే. వెంకటేశ్వర రావు స్వాగత ఉత్సవంలో మాట్లాడుతూ వివిధ ఆటోనమస్, నాన్-ఆటోనమస్ కళాశాలల ఛైర్మెన్, సెక్రటరీలు, ప్రిన్సిపాల్స్ ఈ మీటింగ్‌లో పాల్గొనడం ఆనందంగా ఉందని, ఈ సమావేశం మంచి ఇంటరాక్షన్ అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

నేడు విద్యుత్ అంతరాయం

నవతెలంగాణ-దుండిగల్

నేడు బహదూర్‌పల్లి సబ్‌స్టేషన్ ఫీడర్ నిర్వహణ పనుల కారణంగా బహదూర్‌పల్లి ఫీడర్ పరిధిల ఉదయం 10:00 గం॥ ల నుంచి మధ్యాహ్నం 1:00 గం॥ ల వరకు సాయినాథ్ సొసైటీ, బహదుర్‌పల్లి ఎక్స్‌రోడ్, మొదలైన ప్రాంతాలలో..అలాగే ప్రణీత్ ఫ్లోరా ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 1:30 గం॥ నుంచి సా4:30గం॥ వరకు,వెంకట ప్రణీత్ ఫ్లోర, మొదలైన,ప్రాంతాలలో విద్యుత్ అంతరాయం ఉంటుందని ఈ అంతరాయానికి ప్రజలు సహకరించాలని బౌరంపేట విద్యుత్ శాఖ ఏఈ బి.సాయికిరణ్ తెలిపారు.

రెడ్డి కాలనీలో పర్యటించిన ఎమ్మెల్యే



నవతెలంగాణ-కంటోన్మెంట్

కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్ నియోజకవర్గంలో సమస్యలు తెలుసుకునేందుకు ఆదివారము ఆరో వార్డులోని రెడ్డి కాలనీ పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికుల కాలనీలో నీటి కొరత ఉందని, స్ట్రీట్ లైట్స్ ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యేను కోరారు. అలాగే కాలనీలో ఇండ్లు లేని నిరుపేద కుటుంబాలు చాలా ఉన్నాయన్నారు. అద్దె ఇండ్లలో ఉంటూ కిరాయి కూడా కట్టుకునే ఆర్థిక స్తోమత ఆ కుటుంబాలకు లేదన్నారు. అలాంటివారికి ఇందిరమ్మ ఇండ్లు, డబల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇప్పించాలని ఎమ్మెల్యేను కోరారు. ఎమ్మెల్యే స్థానికులతో మాట్లాడి సమస్యలను వెంటనే పరిష్కరిస్తామని హామి ఇచ్చారు.

సర్వే తనిఖీ చేసిన డిప్యూటీ కమిషనర్



నవతెలంగాణ-ఓయూ

సికింద్రాబాద్ సర్కిల్ 29 పరిధిలోని బౌద్ధ నగర్, సీతాఫల్ మండిలో జరుగుతున్న రేషన్ కార్డ్స్ సర్వేను ఆదివారం సికింద్రాబాద్ డిప్యూటీ కమిషనర్ డి.సుభాష్ రావు తనిఖీ చేశారు. 3,493 సివిల్ సప్లై కార్యాలయం వారు ఇచ్చిన లిస్ట్ ఆధారంగా గత మూడు రోజుల నుండి వేరిఫీకేషన్ చేస్తున్నారు. నేటితో వేరిఫీకేషన్ ముగుస్తుందని ఆయన చెప్పారు. జీహెచ్ఎంసీ, రెవిన్యూ, సివిల్ సప్లై ఉద్యోగులు ఈ సర్వేలో పాల్గొంటున్నారు. ఈ కార్యక్రమంలో వార్డ్ ఆఫీసర్స్ ఉమర్, సంధ్య, వేరిఫీకేషన్ స్టాఫ్ పాల్గొన్నారు.

అధికారంలో ఉన్నా లేకున్నా ప్రజల మధ్యనే ఉంటా..

- ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్
- 2014కు ముందు సరైన రోడ్లు, డయినేజీ వ్యవస్థ లేదు
- హరీష్ తండ్రిని పరామర్శించిన ఎమ్మెల్యే



నవతెలంగాణ-బేగంపేట్/జూబ్లీహిల్స్

అధికారంలో ఉన్నా లేకున్నా నిత్యం ప్రజల మధ్యనే ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని మాజీమంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. ఆదివారం ఆయన సనత్‌నగర్ లోని డీఎస్ఎం కాలనీలో వివిధ శాఖల అధికారులతో కలిసి పర్యటించి స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రధానంగా తమ కాలనీలోని రోడ్లపై తెల్లవారుజామున 2,3 గంటల వరకు ఆకతాయిలు తిష్ట వేస్తున్నారని, బయటకు వెళ్ళాలంటే భయపడాల్సిన పరిస్థితి ఉందని స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. రాత్రివేళల్లో తప్పనిసరిగా పెట్రోలింగ్ నిర్వహించాలని సనత్‌నగర్ సీఐ శ్రీనివాసులును ఆదేశించారు. అంతేకాకుండా ప్రమదాకరంగా ఉన్న కాలనీలో నుండి వెళుతున్న హై టెన్షన్ లైన్ తొలగించాలని, విద్యుత్ స్తంభాలపై వేలాడుతున్న వైర్లను తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని, సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని కోరారు. మసీదు వరకు రోడ్డు నిర్మాణం చేపట్టాలని కోరగా, ప్రతిపాదనలను సిద్ధం చేయాలని సంబంధిత ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వచ్చిన తర్వాతనే సనత్‌నగర్ నియోజకవర్గ పరిధిలో నిజమైన అభివృద్ధి జరిగిందని చెప్పారు. 2014కు ముందు సరైన రోడ్లు, డ్రయినేజీ వ్యవస్థ లేక ప్రజలు అనేక ఇబ్బందులు పడ్డ విషయాన్ని గుర్తుచేశారు. తన కంటే ముందు ఇక్కడి నుండి గెలుపొందిన వారు ఎవరు చేయని, నియోజకవర్గ ప్రజలు ఊహించని విధంగా కోట్లాది రూపాయల వ్యయంతో ఎంతో అనేక అభివృద్ధి పనులు చేశామని అవి కండ్ల ముందు కనిపిస్తున్నాయని చెప్పారు. ప్రస్తుతం ఉన్న ప్రభుత్వం నూతనంగా అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయకపోగా, బీఆర్ఎస్ ప్రభుత్వం మంజూరు చేసిన నిధులను కూడా నిలిపివేసిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. ఫతే నగర్ ఫ్లై ఓవర్ విస్తరణ, సనత్‌నగర్ ఇండస్ట్రీయల్ ప్రాంతం నుండి బాలానగర్ వరకు అండర్ పాస్ నిర్మాణం కోసం నిధులు మంజూరు చేసి శంఖుస్థాపనలు కూడా చేశామని, నేటి వరకు ఆ పనులకు సంబంధించి నిధులు విడుదల చేయలేదన్నారు. ప్రజల సమస్యల పరిష్కారానికే ప్రాధ్యాన్యతనిచ్చి ఎన్ని కోట్ల నిదులైన వెనుకాడకుండా తమ ప్రభుత్వం ఖర్చు చేసిందని చెప్పారు. ప్రభుత్వాలు వస్తుంటాయి.....పోతుంటాయి..కానీ తాను మాత్రం ఎప్పుడు ప్రజల మధ్యనే ఉంటాననే విషయం ప్రతి ఒక్కరికి తెలుసునని చెప్పారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ కొలన్ లక్ష్మి, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు కొలన్ బాల్ రెడ్డి, వాటర్ వర్క్స్ జీఎం హరి శంకర్, జీహెచ్ఎంసీ డీఈ వాసు దేవరెడ్డి, టౌన్ ప్లానింగ్ ఎసీపీ సయ్యద్, ఎలెక్ట్రికల్ ఎఈ శేఖర్, స్ట్రీట్ లైట్ ఎఈ నారాయణ, ఎఎంఓహెచ్ చంద్రశేఖర్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు ఖలీల్, సురేష్ గౌడ్, రాజేష్ ముదిరాజ్, శేఖర్, ఫాజిల్, కరీముల్లా, జమీర్, సమి ఉల్లా, డీఎస్ఎం కాలనీ వాసులు నోమాన్, షంషేర్, ఇలియాస్, రషీద్ ఖాన్, ఆసిఫ్, ఇబ్రహీం తదితరులు పాల్గొన్నారు.

హరీష్ తండ్రిని పరామర్శించిన ఎమ్మెల్యే

తన వ్యక్తిగత సహాయకుడు వెల్లంకి హరీష్ తండ్రి సుదర్శన్ రావును ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ పరామర్శించారు. హరీష్ తండ్రి ఇటీవలనే చికిత్స పొంది ఇంటికి చేరుకున్న విషయం తెలుసుకున్న ఆయన ఆదివారం బీకేగూడలోని వారి నివాసానికి వెళ్ళి పరామర్శించారు. ప్రస్తుత ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఎలాంటి ఆందోళన చెందవద్దని, ధైర్యంగా ఉండాలని చెప్పారు. ఆయన వెంట సనత్‌నగర్, రాంగోపాల్ పేట బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షులు కొలన్ బాల్ రెడ్డి, అత్తిలి శ్రీనివాస్ గౌడ్, నాయకులు అశోక్ యాదవ్, శ్రీహరి, కూతురు నర్సింహ, రాజేష్ ముదిరాజ్, శేఖర్, ఆరీఫ్ తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన బీఆర్ఎస్ నాయకులు



నవతెలంగాణ-కాప్రా

ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డిని సైనిక్‌పురిలోని ఆయన నివాసంలో ఉప్పల్ బీఆర్ఎస్ సీనియర్ నాయకులు జెట్ట కిషోర్, భాష పల్లి నిరంజన్ చారి, కడిగే శేఖర్ మర్యాద పూర్వకంగా కలిసి సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం టీటీడీ క్యాలెండర్, డైరీని ఎమ్మెల్యేకు బహూకరించారు.

'సమగ్ర సర్వేను బహిర్గతపర్చాలి'

నవతెలంగాణ-సిటీబ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సమగ్ర సర్వే వివరాలను తక్షణమే బహిర్గతపర్చాలని బీసీ జన చైతన్య వేదిక జాతీయ అధ్యక్షుడు డాక్టర్ దాసరి అజయ్ కుమార్ యాదవ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమగ్ర సర్వే వివరాలను నెల రోజుల్లోపు ప్రకటిస్తామని చెప్పిన ప్రభుత్వం, సర్వే పూర్తయి రెండు నెలలు గడుస్తున్నా ఇంకా వివరాలను ప్రకటించకుండా ప్రభుత్వం జాప్యం చేస్తుందన్నారు. కాంగ్రెస్ ఎన్నికల సమయంలో ఇచ్చిన కామారెడ్డి డిక్లరేషన్ హామీని అమలు చేయాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇచ్చిన తర్వాతనే స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ముగ్గురు పిల్లలు ఉన్న వారికి అవకాశం కల్పించాలని కోరారు.

కొత్త రేషన్ కార్డు అర్జీల పరిశీలన



నవతెలంగాణ-జూబ్లీహిల్స్

జూబ్లీహిల్స్ నియోజకవర్గం రహమత్‌నగర్ డివిజన్ హెచ్ఎఫ్ నగర్ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం కార్పొరేటర్ సీఎన్ రెడ్డి, ఆధ్వర్యంలో కొత్త రేషన్ కార్డుల పరిశీలన, అవగాహన సమావేశ కార్యక్రమం అయింది. ఈ సందర్భంగా కార్పొరేటర్ రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఆరు గ్యారంటీల పథకాలతో పాటు, కొత్త రేషన్ కార్డుల ప్రక్రియ కార్యక్రమం కూడా అర్హులైన ప్రతి పేదవాడికి అందించాలన్నదే ఈ ప్రభుత్వం ముఖ్య ఉద్దేశమని సీఎన్ రెడ్డి అన్నారు. అనంతరం ఇంటింటికి వెళ్లి రేషన్ కార్డ్ సర్వేను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సర్కిల్ 19 అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ బాలరాజ్, రేషన్ కార్డు లబ్ధిదారులలు, డివిజన్ నాయకులు పాల్గొన్నారు.

కేటీఆర్ ట్వీట్‌పై స్పందించిన కోటా నీలిమ



నవతెలంగాణ-బేగంపేట్

తెలంగాణ రైతుల ఆత్మహత్యల విషయంలో కేటీఆర్‌కు మాట్లాడే హక్కు లేదని సనత్‌నగర్ కాంగ్రెస్ ఇన్‌చార్జి కోట నీలిమ పేర్కొన్నారు. కేటీఆర్ చేసిన ట్వీట్‌కు ఆమె స్పందించారు. ఇది బీఆర్ఎస్ పార్టీ వైఫల్యపు పాలన అందించిన మానవీయ విషాదం. ఆత్మహత్యల గణాంకాలను బీఆర్ఎస్ ప్రభుత్వం దాచిపెట్టడం ద్వారా తమ తప్పులను కప్పిపుచ్చుకునే ప్రయత్నం, రైతుల కష్టాలు బీఆర్ఎస్ నాయకత్వం తీసుకున్న దృష్టిలేని, ఏకపక్ష నిర్ణయాలతో పెరిగిపోయాయి. విపరీశీలనతో నడిచే కాంగ్రెస్ ప్రభుత్వం ఈ విషయంలో పూర్తి భిన్నంగా వ్యవహరించింది. కేవలం ఒక ఏడాదిలోనే తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం 1)రైతుల పంట రుణాల మాఫీ కోసం రూ. 21,000 కోట్లు ఖర్చు చేసింది. 2)రైతుల సంక్షేమం కోసం రూ. 54,000 కోట్లు కేటాయించింది. అదనంగా, రైతుల కోసం చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలు 3) రైతులకు ఎకరానికి రూ. 12,000 నేరుగా, ఏ విధమైన షరతులు లేకుండా అందజేయడం. 4)భూమి లేని రైతులు, వ్యవసాయ కూలీలకు ఏడాదికి రూ. 12,000. 5)రూ. 2 లక్షల వరకు రుణమాఫీ. 6)మెరుగైన బియ్యానికి ఎంఎస్‌పీతో పాటు క్వింటాల్‌కు రూ.500 బోనస్. బీఆర్ఎస్ రైతుల పట్ల వారి బాధ్యతారాహిత్యం తేటతెల్లమైంది. కానీ కాంగ్రెస్ పార్టీ హయాంలో రైతుల జీవితాలను మెరుగుపరచడం, నిస్వార్థ సేవ చేయడం మాత్రమే మా లక్ష్యం. ఇది రైతులకు మంచి రోజులు తీసుకువచ్చే కాంగ్రెస్ పార్టీ పాలనకు నిదర్శనం అని డాక్టర్ కోట నీలిమ అన్నారు.

వసతిగృహంలో మౌలిక సౌకర్యాలు కల్పించాలి



- నిజాం కళాశాల పీజీ విద్యార్థులు
- దశల వారి సమస్యలు పరిష్కరిస్తా: ప్రిన్సిపాల్

నవతెలంగాణ-ఓయూ

తార్నాకలోని ఫారెన్ స్టూడెంట్స్ హాస్టల్ నిజాం కళాశాల పీజీ విద్యార్థులు వసతిగృహంలో కనీస మౌలిక సౌకర్యాలు కల్పించాలని కోరుతూ ఆదివారం ఆందోళన వ్యక్తం చేశారు. శనివారం మధ్యాహ్నం నుంచి మెస్ బంద్ చేసిన విద్యార్థులు ఆదివారం సాయంత్రం ప్రిన్సిపాల్ హామీ మేరకు ఆందోళన విరమించారు. అంతకుముందు వారు వసతిగృహం ప్రధాన గెట్ ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ.. ఓయూ వసతి గృహంలో మెస్ బిల్స్ తక్కువగా వస్తుంటే మాకు 3,900, 4.000 వేల వరకు బిల్స్ రావడం ఎంత వరకు సమంజసం అంటు ఆవేదన వ్యక్తం చేశారు. గత మే నెలలో కొంత విద్యార్థులు మెస్‌లో తింటే అందరికి మెస్ బిల్స్ వేసినట్టు అవేదన వ్యక్తం చేశారు. గత వారంలో కర్రీలో పురుగులు వచ్చాయి అని, నెలలో ఒకటి, రెండు రోజుల మెస్‌లో తింటే నెల అంత బిల్స్ కేటాయింపు చేస్తున్నట్టు ఆరోపించారు. హాస్టల్‌లో సీసీ కెమెరాల నిఘా లేదని, వైఫై సేవలు లేవని విద్యార్థులు చెప్పుకున్నారు. కొందరు విద్యార్థులకు రూమ్స్ లేక మెస్ హల్‌లో ఇస్తే అక్కడ బెడ్స్ లేవని, ఫ్యాన్స్, కిటికీలు లేవని విద్యార్థులు ఆరోపించారు. పలుమార్లు వినతిపత్రం ఇచ్చిన గత్యంతరం లేక ఆందోళన వ్యక్తం చేస్తున్నట్టు విద్యార్థులు చెప్పారు.

సమస్యల పరిష్కారానికి కృషి: ప్రిన్సిపాల్

విద్యార్థులు తమ సమస్యలు పరిష్కరించాలని వినతిపత్రం అందజేశారు. వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని, దశల వారిగా సమస్యలు పరిష్కరిస్తామని ప్రిన్సిపాల్ ప్రొ. రాజశేఖర్ అన్నారు. కొన్ని సౌకర్యాలు కల్పించాలని ఆదేశాలు జారీ చేసినట్టు చెప్పారు. ఇక వీసీ దృష్టికి సమస్యలు తీసుకు వెళ్లి సౌకర్యాలు కల్పించటానికి కృషి చేస్తానని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో నిజం కాలేజ్ అధికారులు డా.నాగేశ్వరరావు, డా.పండయ్య, డా.మార్కండేయ, డా.శశిధర్ పాల్గొన్నారు.

మాదిగ లెక్చరర్స్ రాష్ట్ర స్థాయి సమావేశం

- ముఖ్యఅతిథిగా మంద కృష్ణ మాదిగ
- మాదిగ జాతి అంతిమ పోరాటంలో లెక్చరర్స్ కీలక పాత్ర పోషించాలి



నవతెలంగాణ-ఓయూ

ఓయూ ఇంజినీరింగ్ కాలేజి ఈసీఈ ఆడిటోరియంలో మాదిగ లెక్చరర్స్ రాష్ట్ర స్థాయి సమావేశానికి ముఖ్యఅతిథిగా మందకృష్ణ మాదిగ విచ్చేసి మాట్లాడారు. దేశంలో అత్యున్నత ప్రధాన న్యాయస్థానం సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన కూడా మన రాష్ట్రంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దీనిని అమలు చేయడంలో కాలయాపన చేస్తుండడం ఏమాత్రం తగదని, తెలంగాణలో ఉన్న వివిధ కులాల మేధావులు, ప్రొఫెసర్లు, సంఘాల నాయకులు తెలంగాణలో ఉన్న ప్రధాన రాజకీయ పార్టీలు అన్నీ కూడా మద్దతు ప్రకటించిన వర్గీకరణ అమలు కాకపోవటం సమంజసం కాదన్నారు. వివిధ డిపార్ట్‌మెంట్‌లలో పనిచేస్తున్న మాదిగ లెక్చరర్లు అందరూ ప్రధాన పాత్ర పోషించి వర్గీకరణ అమలు కొరకై ముందుండాలని కోరారు. ఈ కార్యక్రమానికి సభాధ్యక్షులుగా ఎంఈఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లెపాక వెంకన్న వహించారు. ఈ సందర్భంగా వివిధ సంఘాల ప్రతినిధులు, ఎస్సీ వర్గీకరణ వెంటనే అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఫిబ్రవరి 7న జరగబోవు వేల గొంతులు లక్ష డప్పుల కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో బాధ్యతాయుతంగా పనిచేస్తామన్నారు. మాదిగ లెక్చరర్స్ కన్వీనర్ జిల్లా నరసింహ ఎంఈఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చేబర్తి యాదగిరి ఎంఈఎఫ్ నాయకులు నరసయ్య, చింత జాన్ విల్సన్, గట్టు మల్లయ్య, ఇస్మాయిల్, తెలంగాణ లెక్చరర్స్ ఫోరం అధ్యక్షులు కత్తి వెంకటేశ్వర్లు, డా.శ్రద్ధానందం, ప్రిన్సిపల్స్ సంఘ నాయకులు అవిలయ్య, డా.పసుపులేటి మద్దిలేటి, డిగ్రీ, జూనియర్, పాలిటెక్నిక్, గురుకుల మోడల్ స్కూల్, అతిథి అధ్యాపకుల సంఘాల అధ్యక్షులు డా.శ్రద్ధానందం, గాదె వెంకన్న, విద్యాసాగర్, దామర ప్రభాకర్ రుద్రవరం కృష్ణ, హిమజ, తులసి, ప్రతినిధులు పాల్గొన్నారు.

మంచినీటి పైప్ లైన్ నిర్మాణాన్ని, ప్రారంభించిన రామకృష్ణ



నవతెలంగాణ-కంటోన్మెంట్

అన్నానగర్‌లో ఆదివారం కంటోన్మెంట్ బోర్డు నామినేటెడ్ సభ్యుడు జన్యవుల రామకృష్ణ మంచినీటి పైప్ లైన్ నిర్మాణానికి భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గతంలో బస్తీ బాట కార్యక్రమంలో స్థానికులు సమస్యను తెలియచేశారని దానికి పరిష్కారంగా నేడు పనులు మొదలు పెట్టామని అన్నారు. అలాగే కంటోన్మెంట్ ప్రాంతంలో ఎక్కడ ఏ సమస్య ఉన్నా త్వరితగతిన పరిష్కారం చేసేందుకు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. బోర్డు నిధులు కేంద్ర ప్రభుత్వ నిధులతో అభివృద్ధి పనులు చేపడుతున్నామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధికి ఏమాత్రం సహకరించటం లేదని చెప్పారు. తన దృష్టికి వచ్చిన ప్రతీ సమస్యను క్షేత్ర స్థాయిలో పరిశీలించి ఒకటికి రెండు సార్లు ఆలోచించి ప్రజల అభీష్టానికి అనుగు ణంగా పనులు చేపడుతున్నామని, రానున్న రోజుల్లో నిధులు సమ కూరే అవకాశం ఉందని వాటితో అవసరం ఉన్న ప్రతీ చోటా పనులు చేపడతా మని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వార్డ్ 2 బీజేపీ అధ్యక్షులు శ్రవణ్, పూర్వ అధ్యక్షుడు మదారపు అశోక్, నాయకులు హర్షవర్ధన్, రమేష్, మమత, యాద వ్, రేఖా, కిషోర్, సతీశ్, శ్రీనివాస్, పరిశారం, మహేశ్ స్థానికులు పాల్గొన్నారు.

తెలుగు సంగమం సంక్రాంతి సమ్మేళనం-2025





- పిల్లలు తెలుగు మాట్లాడేలా తల్లితండ్రులు ప్రోత్సహించాలి
- త్రిపుర గవర్నర్ ఎన్.ఇంద్రసేనారెడ్డి

నవతెలంగాణ-సిటీబ్యూరో/అంబర్‌పేట్

తెలుగు భాష, సంస్కృతి గొప్ప వారసత్వాన్ని మరింత ఘనంగా ప్రతిబింబించేలా ప్రతిష్టాత్మక "తెలుగు సంగమం సంక్రాంతి సమ్మేళనం-2025" జరిగింది. నగరంలోని నార్సింగి ఓం కన్వెన్షన్ హాల్ వేదికగా జరిగిన ఈ ఉత్సవాల్లో 3 వేలకు పైగా తెలుగు ప్రేమికులు తదితర రంగాలకు చెందిన ప్రముఖులు పాల్గొన్నారు. తెలుగు సంగమం వ్యవస్థాపకులు, ప్రధాన పోషకులు, బీజేపీ జాతీయ నాయకుడు పి.మురళీధర్ రావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా త్రిపుర గవర్నర్ ఎన్.ఇంద్రసేనారెడ్డి మాట్లాడుతూ.. సమకాలీన దశ్యంలో తెలుగు సంస్కృతిని పరిరక్షించడం, ప్రోత్సహించడంలో తెలుగు సంగమం పాత్ర గొప్పది అన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను తెలుగు మాట్లాడేలా చురుకుగా ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు. కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. సంక్రాంతి పండుగ సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి తమ గ్రామాలకు తిరిగి రావడం చూస్తే చాలా సంతోషంగా ఉందన్నారు. పాత జ్ఞాపకాల మధ్య విలువైన సమయాన్ని గడపడం, స్థానిక పాఠశాలలు, రోడ్లను మెరుగుపరచడం వంటి కార్యక్రమాల ద్వారా వారి స్వస్థలాల అభివద్ధికి తోడ్పడటం ప్రాముఖ్యతను నొక్కి చెప్పారు. ఈ సంప్రదాయం కొనసాగింపు చాలా ముఖ్యమైనదనీ, సమాజ సౌభాతత్వానికి ఒక ముఖ్య లక్షణంగా ఉండాలని సూచించారు. ప్రఖ్యాత సినీ నటుడు, నటకిరీటి డాక్టర్ రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ తన సజనాత్మక ప్రయాణాన్ని కొనసాగించడంలో తెలుగు భాష కీలకంగా దోహదపడిందన్నారు. ఈ సందర్భంగా కూచిపూడి, అవధానం, బుర్ర కథ, ధింసా నత్యం వంటి అద్భుత జానపదాలను ప్రదర్శించారు. దీపికా రెడ్డి, మేడసాని మోహన్, కళా కష్ణ వంటి ప్రముఖ కళాకారులు తమ అసాధారణ ప్రదర్శనలతో ప్రేక్షకులను అలరించారు. తెలుగు సంస్కతికి విశేషంగా కషి చేసిన ప్రముఖులకు ఈ వేదికపై ఘన నిరాజనం అందింది. తెలుగు అస్సాం స్ఫూర్తిని ప్రతిబింబించే సినీ దిగ్గజం రాజేంద్ర ప్రసాద్ సహా పలువురిని ప్రత్యేకంగా సన్మానించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ మండలి బుద్ధ ప్రసాద్, సిలికాన్ ఆంధ్రా విశ్వవిద్యాలయం అధ్యక్షులు డాక్టర్ కూచిభొట్ల ఆనంద్, భగవద్గీత ఫౌండేషన్ వ్యవస్థాపకులు బ్రహ్మశ్రీ డాక్టర్ ఎల్.వి. గంగాధర శాస్త్రి, మాజీ సీబీఐ, జేడీ జై భారత్ నేషనల్ పార్టీ వ్యవస్థాపకులు వి.వి.లక్ష్మీ నారాయణ, చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, మెదక్ ఎంపీ రఘునందన్ రావు, ఎమ్మెల్యే కామినేని శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

కాప్రాలో స్వచ్ఛ సర్వేక్షన్ కార్యక్రమం



నవతెలంగాణ-కాప్రా

జీహెచ్ఎంసీ కాప్రా సర్కిల్ డిప్యూటీ కమిషనర్ జగన్ ఆదేశాల మేరకు స్వచ్ఛ భారత్ మిషన్‌లో భాగంగా స్వచ్ఛ సర్వేక్షన్ కార్యక్రమాన్ని కాప్రా డివిజన్ సాయిబాబా ఆఫీసర్స్ కాలనీ, లేక్ వ్యూ కాలనీ, మాధవపురి, భాస్కరరావునగర్ కాలనీ అసోసియేషన్‌కు సంబంధించిన సభ్యులు సాయిబాబా మందిరము ప్రాంగణంలో కాప్రా సర్కిల్ వారు ఏర్పాటుచేసిన (ఆర్ఆర్ఆర్) రెడ్యూస్, రియూస్, రీసైకిల్‌కు సెంటర్ల సంబంధించిన ఉపయోగాలను తెలియాజేశారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ హెల్త్ అండ్ శానిటేషన్ విభాగము నుండి సానిటరీ సూపర్వైజర్ సుదర్శన్, ఎస్ ఎఫ్ఏలు సంజీవ వసంత ఇన్‌చార్జ్ అంజలి, పారిశుద్ధ్య సిబ్బంది సిబ్బంది సాయిబాబా ఆఫీసర్స్ కాలనీ సాయిబాబా మందిరం ప్రాంగణంలో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మన ఇండ్లలో నిరుపయోగంలో ఉన్న వస్తువులను సైనిక్‌పురి చౌరస్తా మున్సిపల్ మోడల్ మార్కెట్ బిల్డింగ్ యందు ఏర్పాటు చేసిన ట్రిబుల్ ఆర్ సెంటర్‌కు అందజేయవలసిందిగా తెలిపారు. ఈ వస్తువులను అక్కడ నుంచి అవసరం ఉన్నవారు తీసుకుంటాని తెలియజేశారు. అనంతరం కాప్రా సర్కిల్ వారు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వాహనముతో RRR మెటీరియల్ కలెక్షన్ చేయ డం జరిగింది. ఈ కార్యక్రమంలో పలువురు అసోసియేషన్ సభ్యులు ట్రిబుల్ ఆర్ సత్ఫలితాలు ఇవ్వ గలవని వారంతా అభిప్రాయపడ్డారు. దీనికి కాలనీలో ఇతరులకు కూడా అవగాహన కల్పించి వస్తువులను సేకరించడానికి తమ వంతు సహకారాన్ని అందజేస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సైనిక్‌పురి ఏరియా నుంచి మనోజ్ఞ రెడ్డి, మీనా రవీంద్రన్, సాయిబాబా ఆఫీస ర్స్ కాలనీ నుంచి సిఎస్ చంద్రశేఖర్, మాధవపురి నుంచి జ్యోతి, రాజరా జేశ్వరి కాలనీ నుంచి శ్రీనివాస్, డీఎల్ఆర్ ఎంక్లేవ్ నుంచి డాక్టర్ రూప పాల్గొన్నారు.

పీఆర్ఎఫ్ డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్‌తో భద్రత



నవతెలంగాణ-బేగంపేట్

రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ (క్యూఫీ) భారతీయ రైల్వేల అంతటా భద్రతను ఆధునీకరించడం ద్వారా సంచలనాత్మక డిజిటల్ పరివర్తన ప్రయాణాన్ని ప్రారంభించింది. ఈ వ్యూహాత్మక చొరవ ప్రయాణీకుల భద్రత, కార్యాచరణ సామర్థ్యం చురుకైన ముప్పు గుర్తింపుకు ప్రాధాన్యతనిస్తుంది.

టెక్నాలజికల్ అడాప్షన్: భద్రతను మెరుగుపరచడానికి ఆక్మీ, బిగ్ డేటా అనాలిటిక్స్ బయోమెట్రిక్ ఆధారిత అతుకులు లేని కోచ్ ఎంట్రీని ఉపయోగించడం. ఫేషియల్ రికగ్నిషన్‌తో కూడిన సీసీటీవీ నిఘా, సరుకు రవాణా భద్రత కోసం జీపీఎస్ ఎనేబుల్డ్ ఎలక్ట్రానిక్ సీల్స్ కూడా అమలు చేయబడుతున్నాయి.

మొబైల్ అప్లికేషన్‌లు: రైల్ మదద్ మేరీ సహేలీ వంటి ప్రయాణీకుల-కేంద్రీకృత యాప్‌లు సమస్యలకు త్వరిత పరిష్కారం మహిళల భద్రతను అందిస్తాయి. సంగ్యాన్, చట్టపరమైన రిపోజిటరీ యాప్, అధికారుల కోసం నవీకరించబడిన చట్టపరమైన వనరులను అందిస్తుంది.

ప్రత్యేక కార్యక్రమాలు: టికెట్ టూటింగ్, మానవ అక్రమ రవాణాను ఎదుర్కోవడానికి ఆక్మాదీలూరా పెద్ద డేటా విశ్లేషణలను ఉపయోగిస్తుంది. ఇ-టౌటింగ్ వంటి డిజిటల్ నేరాలను ఎదుర్కోవడానికి సైబర్ సెల్‌లను కూడా ఏర్పాటు చేస్తున్నారు.

విజయాలు: సీఆర్ఎఫ్ "ఆపరేషన్ నాన్హే ఫరిష్టే" కింద 84,000 మంది పిల్లలను రక్షించింది బెంగళూరులో ఎఐ ద్వార నడిచే ముఖ గుర్తింపును ఉపయోగించి నేరస్తులను విజయవంతంగా పట్టుకుంది. అంతర్జాతీయ టిక్కెట్ టూటింగ్ సిండికేట్‌లు కూడా తటస్థీకరించబడ్డాయి.

భవిష్యత్ దృషి: 2030 నాటికి, స్మార్ట్ సురక్షితమైన రైలు నెట్‌వర్క్‌ను రూపొందించడానికి క్మీఫీ, అధునాతన ఆక్మీ వ్యక్తిగతీకరించిన భద్రతను ఏకీకృతం చేయాలని పీఆర్ఎఫ్ లక్ష్యంగా పెట్టుకుంది.పీఆర్ఎఫ్ దార్శనిక నాయకత్వం రియాక్టివ్ నుంచి చురుకైన నివారణ భద్రతా వ్యూహాలకు మారడాన్ని ప్రారంభించింది, ప్రయాణీకుల భద్రత కార్యాచరణ సామర్థ్యాన్ని గణనీయంగా పెంచుతుంది.

డీ సన్స్ పటోలా వస్త్ర ప్రదర్శన



నవతెలంగాణ-బంజారాహిల్స్

బంజారా హిల్స్‌లోని రోడ్ నెంబర్ 1లో గల లేబుల్స్ పాప్-అప్ స్పేస్‌లో డీ సన్స్ పటోలా ఆర్ట్స్ వస్త్ర ప్రదర్శనను నగర సామాజికవేత్త అలేఖ్య రెడ్డి ఆదివారం ప్రారంభించారు. విభిన్నమైన హ్యాండ్లూమ్ చీరలతో పాటు ముఖ్యంగా పటోలా ఆర్ట్ చీరలు, పటోలా హ్యాండ్లూమ్, సిల్క్ వస్త్రోత్పత్తులను ఒకే వేదికలో ప్రదర్శించడం అభినందనీయమని ఆమె అన్నారు. నేరుగా వీవర్ నుంచి వినియోగదారునికి అందించే ందుకు ఏర్పాటైన ఈ ప్రదర్శన ప్రతి ఒక్కరు సందర్శించి, చేనేతకారులను ప్రోత్సహించాలని కోరారు. డీ సన్స్ పటోలా ఆర్ట్స్ నిర్వాహకులు భవిన్ మాట్లాడుతూ.. నేత కార్మికులను ప్రోత్సహించడంతో పాటు చేనేత పరిశ్రమకు మార్కెట్‌ను అందించడమే ఈ ఎగ్జిబిషన్ ప్రధాన సామాజిక లక్ష్యమని వివరించారు. ఈ నెల 27వ తేదీ వరకు కొనసాగుతున్న ప్రదర్శనలో ప్రత్యేక కలెక్షన్స్ వేదికగా ఈ షోలో పటాన్ పటోలా, బనారసి, జరీ కోట, చందేరి, కాశ్మీరీ, మహేశ్వరి, వెంకటగిరి పట్టు, కంచి పట్టు, లక్నోవి చీరలు, డ్రెస్ మెటీరియల్స్ వంటి 10 వేల రకాల వస్త్రోత్పత్తులు అందుబాటులో ఉంటాయని, సిల్క్ కో-ఆపరేటివ్ సొసైటీలు తమ ఉత్పత్తులను వివిధ రాష్ట్రాల నుండి ప్రదర్శిస్తున్నాయని నిర్వాహకులు మీడియాకు తెలిపారు.

శ్రీశ్రీశ్రీ మేడాలమ్మ, కేతమ్మ మల్లికార్జున స్వామి కళ్యాణ మహోత్సవం



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

జగద్గిరిగుట్ట డివిజన్ మగ్దుమ్ నగర్ పరిధిలో ఆదివారం పొలాల బస్తీలో గల శ్రీ మల్లికార్జున స్వామి దేవాలయంలో నిర్వహించిన శ్రీశ్రీశ్రీ మేడాలమ్మ, కేతమ్మ, మల్లికార్జున స్వామి కళ్యాణ నిర్వహించారు. ఈ మహోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా కేపీ. వివేకనంద్ హజరయ్యారు. అనంతరం స్థానిక కార్పొరేటర్ కొలుకుల జగన్, సూరారం డివిజన్ కార్పొరేటర్ మంత్రి సత్యనారాయణ, మాజీ కార్పొరేటర్ గుడిమెట్ల సురేష్ రెడ్డితో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే స్వామివారి చల్లని కృపా కటాక్షాలతో ప్రజలంతా ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలతో సంతోష జీవనం గడపాలన్నారు. ఈ కార్యక్రమంలో వెంకటేశ్వర దేవస్థానం మాజీ చైర్మెన్ వేణు యాదవ్, డివిజన్ అధ్యక్షులు రుద్ర అశోక్, బీఆర్ఎస్ యువ నాయకులు కొలుకుల జైహింద్, స్థానిక నాయకులు డి.పాపులు గౌడ్, ఎస్.సాయిలు యాదవ్, నరసింహ, రాము బ్రహ్మానంద చారి, మనోజ్, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిపై అధికార, ప్రతిపక్ష నేతల మాటల యుద్ధం





• జవహర్‌నగర్ ఎవరి హయాంలో అభివృద్ధి చెందిందో చెప్పాలని బహిరంగ సవాల్ విసిరుకుంటున్న ఇరుపక్షాల నేతలు

నవతెలంగాణ - జవహర్ నగర్

(ప్రత్యేక కథనం)

కార్పొరేషన్ గడువు మరో పది రోజులలో ముగుస్తూ ఉండడంతో జవహర్‌నగర్‌లో అధికార, ప్రతిపక్ష నాయకుల మాటలు బాహాబాహికి దిగి ప్రజలను ఆశ్చర్యానికి గురిచేస్తున్నారు. ఎవరు ఎన్ని చెప్పినా జవహర్ నగర్ పంచాయతీ నుంచి మున్సిపల్ గా, ఆ తరువాత కార్పొరేషన్‌గా ఏర్పడినా ఇప్పటికీ గ్రామీణ వాతావరణం ఉందని, కొంత మేర అభివృద్ధి జరిగినా ఇంకా చేయాల్సిన అభివృద్ధి పనులు చాలా ఉన్నాయని ప్రజలు అభిప్రాయడుతున్నారు. పాలక పార్టీలు మారినా ప్రజల బతుకులు మారడం లేదని వాపోతున్నారు. ఇకనైనా ఒకరిమీద ఇంకొకరు విమర్శలు మానుకొని అభివృద్ధిలో పోటీపడి మరింత అభివృద్ధి చేయాలని ప్రజలు కోరుకుంటున్నారు. ప్రజలకు మెరుగైన వసతులు కల్పించాలంటున్నారు.

బీఆర్ఎస్ హయాంలోనే అభివృద్ధి
-రూ.300కోట్లతో అభివృద్ధి చేశాం
-ఉద్యమకారుల ఫోరం మేడ్చల్ జిల్లా అధ్యక్షులు జిట్టా శ్రీనివాస్ రెడ్డి

గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే జవహర్ నగర్ అభివృద్ధి జరిగిందని సుమారు రూ.300కోట్ల తో మాజీ మంత్రి మల్లారెడ్డి ప్రత్యేక చొరవతో అభివృద్ధి చేశామని ఉద్యమకారుల ఫోరమ్ మేడ్చల్ జిల్లా అధ్యక్షులు జిట్టా శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ప్రభుత్వాలు మారగానే పార్టీలు మారి వారి సొంత ఆస్తులు కాపాడుకోవాడినికే వెళ్లినా వారి మాటలు ప్రజలు నమ్మరని అన్నారు. గడిచిన పదేండ్లు బీఆర్ఎస్‌లో ఉండి అధికారం అనుభవించి ఈ రోజు అభివృద్ధి జరగలేదని అనడం సిగ్గు చేటన్నారు. జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్‌గా ఏర్పడ్డాక ఇప్పుడు విమర్శిస్తున్న వారంతా బీఆర్ఎస్‌లో ఉన్న వారేనని, పార్టీ మారగానే అభివృద్ధి కనిపించక పోవడం దురదృష్టక రమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక ఎలాంటి అభివృద్ధి పనులు చేసారో ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు. ఎలాంటి ఆదాయం మున్సిపల్‌కు లేకపోయినా మేము చేసిన అభివృద్ధి పనులు ప్రజలు గుర్తించి కాంగ్రెస్ పార్టీని నమ్మక మరొకసారి మల్లారెడ్డిని గెలిపించారని గుర్తు చేశారు. అప్పుడు తాము చాలా అభివృద్ధి చేశామని గొప్పలు చెప్పిన నాయకులు ఇప్పుడు మాట మార్చడం సరి కాదన్నారు. ప్రభుత్వ భూమి కబ్జాలకు గురిఅవుతుందని కాంగ్రెస్ నాయకులు మట్లాడుతున్నారని, ఎవరి బినామీల దగ్గర ప్రభుత్వ భూములు ఉన్నాయో ప్రజల ముందు బహిరంగ చర్చకు రండి తేల్చుకుందామని బహిరంగ సవాల్ చేశారు. మున్సిపల్ ఏర్పడక ముందు ఉన్న పరిస్థితులు ఇప్పుడు లేవని, ప్రతి డివిజన్‌లో సీసీరోడ్లు, డ్రయినేజీ, కూరగాయల మార్కెట్, లాంటి ఎన్నో అభివృద్ధి పనులు కండ్ల ముందు కనిపిస్తున్నాయన్నారు. అదేవిధంగా క్రీడా మైదానం, నాన్ వెజ్, వెజ్ మార్కెట్, టాయిలెట్స్ లాంటికి ల్యాండ్ కేటాయించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ వార్డు సభ్యులు బండకింది ప్రసాద్ గౌడ్, పిన్నోజు సుధాకర్ చారి, కోనేరు భాస్కర్ పాల్గొన్నారు.

అభివృద్ధిపై బహిరంగ చర్చకు సిద్ధం
-ఏడాదిలోనే చాలా అభివృద్ధి చేశాం.
- కాంగ్రెస్ నాయకులు కూతాడి ముఖేష్



గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో బీఆర్ఎస్ నాయకులు భూకబ్జాలకు పాల్పడ్డారని తమ దగ్గర ఆధారాలు ఉన్నాయని, బీఆర్ఎస్ నాయకుల సవాలును స్వీకరిస్తున్నామని ప్రజల ముందు ఎప్పుడైనా బహిరంగ చర్చకు సిద్ధమని కాంగ్రెస్ నాయకులు కూతాడి ముఖేష్ ప్రతి సవాల్ విసిరారు. బీఆర్ఎస్ నాయకులు ప్రజలకు తక్కువ చేసి వారి సొంత ప్రయోజనాలకే ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చారన్నారు. ప్రభుత్వ భూములు కబ్జాలు చేసి గెస్ట్ హౌస్, స్విమ్మింగ్ పూల్స్ నిర్మించారని తమ దగ్గర పూర్తి ఆధారాలు ఉన్నాయన్నారు. కాంగ్రెస్ హయాంలో తక్కువ కాలంలోనే ఎక్కువ జవహర్ నగర్‌ను అభివృద్ధి చేశామని ఇప్పుడు జరుగుతన్న అభివృద్ధి పనులు వారికి కనిపించడం లేదా అని ప్రశ్నించారు. రూ.87.5 కోట్లతో ప్రధాన రహదారి పనులు ప్రారంభమయ్యయని, రూ.1.14 కోట్లతో సీసీ రోడ్లు, సుమారు రూ.4 కోట్లతో డ్రయినేజీపనులు చేస్తున్నామన్నారు. రూ.205కోట్లతో ఇంటిగ్రేటెడ్ పాఠశాల, రూ.25 కోట్లతో మహిళ సమైఖ్య భవనం, రూ.5 కోట్లతో కూరగాయల మార్కెట్ ఆధునీకరణకు నిధులు మంజూరు చేశామన్నారు. గత నాలుగేండ్లలో మీరు చేసిన అభివృద్ధి మేము ఏడాదిలోనే చేశామన్నారు. మీరు చేస్తున్న అవినీతిని చూడలేకనే పార్టీ మారినట్లు, పార్టీ మారిన ప్రజల మధ్యలో ఉండి ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తున్నామన్నారు.

శ్రీ చిత్తరమ్మ దేవి 50వ స్వర్ణోత్సవ జాతర వేడుకలు







నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని గాజులరామారం గ్రామంలో వెలిచిన" శ్రీశ్రీశ్రీ చిత్తరమ్మ దేవి 50వ వార్షికోత్సవ జాతర" వేడుకలు ఆదివారం అంగరంగ వైభవంగా జరిగాయి.వారం రోజులపాటు జరిగే ఈ వేడుకలకు భక్తులు తాకిడి తో ఆలయ పరిసర ప్రాంతాలు కిటకిటలాడిపోయాయి.ఈ సందర్భంగా మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు ఈటెల రాజేందర్, స్థానిక ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్,మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్,కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ ఇన్‌చార్జి కొలను హనుమంత రెడ్డితోపాటు స్థానిక కార్పొరేటర్, గ్రేటర్ స్టాండింగ్ కమిటీ సభ్యులు రావుల శేషగిరి, కార్పొరేటర్లు కొలుకుల జగన్,మంత్రి సత్యనారాయణ, మాజీ కార్పొరేటర్ గుడిమెట్ల సురేష్ రెడ్డి, ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. అనంతరం అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ చైర్మెన్ కూన అంతయ్య గౌడ్,ప్రధాన కార్యదర్శి రాచకొండ బాలరాజ్, ధర్మకర్తల మండలి సభ్యులు అతిథులకు స్వాగతం పలికి సత్కరించారు. ఈ సందర్భంగా ఎంపీ.ఈటల మాట్లాడుతూ గత 50 సంవత్సరాలుగా ఈ ప్రాంత ప్రజలతోపాటు పరిసర ప్రాంతాల భక్తుల కొంగుబంగారమై చిత్తరమ్మ దేవి పూజలు అందుకుంటుందన్నారు. ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ మాట్లాడుతూ భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ఆలయ నిర్వాహకులు, వివిధ విభాగాల అధికారులు సమన్వయంతో పని చేయాలని ఆదేశించారు. చిత్తరమ్మ దేవి ఆశీస్సులతో నియోజవర్గ ప్రజలందరూ సుఖశాంతులతో ఉండాలని కోరారు. మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ చిత్తరమ్మదేవిని కొలి చిన భక్తులకు అన్ని శుభాలే జరుగుతాయని అన్నారు.ఆలయ చైర్మెన్ కూన అంతయ్య గౌడ్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం జాతర ఉత్సవాలకు ఈ ప్రాంతం నుండే కాకుండా పరిసర ప్రాంతాల నుండి భక్తులు పాల్గొని మొక్కలు తీర్చుకుంటారన్నారు. అమ్మవారి ఆలయాన్ని విద్యుత్ దీపాలతో శోభాయమానం గా సర్వాంగ సుందరంగా అలంకరించారు. వారం రోజులపాటు భక్తులకు ఎటు వంటి అసౌకర్యాలు కలగకుండా వాలంటీర్లను నియమించి తగిన ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. జాతర వేడుకల్లో మహిళలు బోనాల ఊరేగింపుతో పోతరా జుల నృత్యాలతో అలరిస్తూ.. తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలతో జాతర ఉత్సవాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా జీడిమెట్ల సిఐ.మల్లేష్, జగద్గిరిగుట్ట సీఐ.కేతూరి నరసింహ పర్యవేక్షణలో పోలీస్ పికెటింగ్ ఏర్పాటుచేసి ఆలయ పరిసర ప్రాంతాలు పోలీసు పటిష్ఠ బందోబస్తు నిర్వహించారు. ఆలయ పరిసర ప్రాంతాలు చుట్టు సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమంలో ధర్మకర్తల మండలి సభ్యులు పగిడి శంకర్ రెడ్డి, కూన శ్రీనివాస్ గౌడ్, పెంటారెడ్డి, అముర ఇంద్రసేన గుప్తా, డి.ఇంద్రసేనారెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షులు డాక్టర్ ఎస్.మలా రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి గిరివర్ధన్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు బక్క శంకర్ రెడ్డి, కార్యదర్శి భరత్ సింహారెడ్డి, రాష్ట్ర ఓబీసీ మోర్చా ప్రధాన కార్యదర్శి నందనం దివాకర్, డివిజన్ అధ్యక్షులు సాయినాథ్ నేత సీనియర్ నాయకులు ఎంఎస్.వాసు, తదితరులు పాల్గొన్నారు.

భారత కమ్యూనిస్టు పార్టీ 100ఏండ్ల గొప్పతనాన్ని వివరించాలి

● సీపీఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య

నవతెలంగాణ-శంకర్‌పల్లి

భారత కమ్యూనిస్టు పార్టీ 100 ఏండ్ల గొప్పతనాన్ని వాడవాడలో చాటాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య అన్నారు. శంకర్‌పల్లి మండల కౌన్సిల్ సమావేశం మండల పార్టీ కార్యదర్శి సుధీర్ అధ్యక్షతన ఆదివార ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 28న చేవెళ్లలోని కేజీఆర్ గార్డెన్‌లో జరిగే నియోజకవర్గం జనరల్ బాడీ మీటింగ్‌ను విజయవంతం చేయాలని కోరారు. భారత కమ్యూనిస్టు పార్టీ 100 వసంత ఉత్సవాల సందర్భంగా ఈ నెల 28వ తేదీన చేవెళ్లలో చేవెళ్ల నియోజకవర్గం జనరల్ బాడీ మీటింగ్ ఉంటుందని ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు హాజరు అవుతున్నారని తెలిపారు. చేవెళ్ల నియోజకవర్గంలోని చేవెళ్ల శంకర్‌పల్లి మొయినాబాద్ షాబాద్ నవబ్‌పేట్ మండలాల నుంచి నాయకులు కార్యకర్తలు, కర్షకులు రైతులు పార్టీ శ్రేయోభిలాషులు అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని జనరల్ బాడీ మీటింగ్‌ను విజయవంతం చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వము ఇచ్చిన హామీలను అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. అదేవిధంగా రైతు భరోసాను ఎకరాకు పదిహేను వేల రూపాయలు ఇవ్వాలని అర్హులైన పేదలందరికీ రేషన్ కార్డులు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని ఆయన ప్రభుత్వాన్ని కి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు నియోజకవర్గం ఇన్‌చార్జి కే రామస్వామి, ఏఐకేఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎం ప్రభు లింగం, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి వడ్ల సత్యనారాయణ, ఏఐటీయూసీ జిల్లా నాయకుడు గోపాల్‌రెడ్డి ,యాదమ్మ, చంద్రయ్య సంగమేష్, సంగమేశ్వర్, నర్సింహులు, కృష్ణ, రాములమ్మ తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
మనగు తెలుగు దినపత్రిక
మేడ్చల్-మల్కాజిగిరి-ఉప్పల్
సోమవారం | జనవరి 20, 2025 | www.navatelangana.com

ఆరు కిలోల గంజాయి స్వాధీనం



నవతెలంగాణ-కాప్రా

ఆరు కిలోల గంజాయిని అబ్కారీ పోలీసులు స్వాధీనం చేసుకున్న ఘటన రాంపల్లిలో చోటు చేసుకున్నది. అబ్కారి టాస్క్‌ఫోర్స్ సీఐ భారత్ భూషన్ తెలిపిన వివరాల ప్రకారం.. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అబ్కారి ఉపఅధికారి ముకుంద్ రెడ్డి ఆదేశాల మేరకు ఆదివారం రాంపల్లిలో దాడులు చేసి గంజాయి అమ్ముతున్న ఇద్దరిని పట్టుకున్నారు. మధ్యప్రదేశ్ చెందిన హరికుషావా వద్దనాలుగు కిలోలు, ఒరిస్సాకు చెందిన బైనాథ్ బిస్వాల్ వద్ద రెండు కిలోల గంజాయి స్వాధీనం చేసుకుని ఘట్కేసర్ అబ్కారి స్టేషన్‌లో అప్పగించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి ఇద్దరి నుంచి రెండు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. కాగా నిషేధిత డ్రగ్స్, గంజాయి కొనుగోలు చేసినా.. విక్రయించినా కఠిన చర్యలు తీసుకుంటామని మేడ్చల్ జిల్లా అబ్కారి అధికారి నవీన్ కుమార్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టాసకఫోర్స్ సీఐ భరత్ భూషణ్, ఎస్ఐ శ్రీనివాస్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

కల్లుగీత కార్మిక సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ



నవతెలంగాణ - శామీర్‌పేట

కల్లుగీత కార్మిక సంఘం మేడ్చల్ జిల్లా నూతన క్యాలెండర్‌ను సంఘం జిల్లా అధ్యక్షుడు ఉషాగౌని వెంకట నర్సయ్య ఆదివారం ఆధ్వర్యంలో శామీర్‌పేట మండల కేంద్రంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం గీత కార్మికులందరికీ కాటమయ్య సేఫ్టీ కిట్టులుఅందించాలన్నారు. వృత్తిలో మృతిచెందిన కార్మిక కుటుంబాలకు, ప్రమాదంలో గాయపడిన కార్మికులకు ఆర్థిక సాయం ఇవ్వాలని కోరారు. బీసీ కార్పొరేషన్ నుంచి ఫండ్ కేటాయించి తాటి, ఈత ఉత్పత్తుల పరిశ్రమలు స్థాపించాలన్నారు. వీటి సాధనకు నేడు కలెక్టరేట్ కార్యక్రమంలో నిర్వహించే నిరసనలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి దొంతి ఆంజనేయులు గౌడ్, శామీర్‌పేట సొసైటీ ఉపాధ్యక్షుడు యాష్కి సాయి గౌడ్, డైరెక్టర్లు తూముకుంట శేఖర్ గౌడ్, వెంకటేష్ గౌడ్, దేశం పవన్ గౌడ్, వెంకటేష్ గౌడ్, నరేష్, చంద్రశేఖర్ గౌడ్, మల్లేష్ గౌడ్‌లు పాల్గొన్నారు.

స్ఫూర్తి గ్రూప్‌లో వేమన జయంతి



నవతెలంగాణ-కాప్రా

వేమన జయంతి సందర్భంగా తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం స్ఫూర్తి గ్రూప్ ఆధ్వర్యంలో 'వేమన పద్యాలకు పట్టాభిషేకం' కార్యక్రమాన్ని సీఐటీయూ ఆఫీస్ హాల్‌లో స్ఫూర్తి గ్రూప్ బాధ్యులు గొడుగు యాదగిరిరావు అధ్యక్షతన నిర్వహించారు. ప్రారంభ సూచికగా ప్రముఖ కవి వీటీ ఆచార్యులు, ప్రముఖ విద్యావేత్త మాజీ ప్రిన్సిపాల్ పద్మ వేమన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ముఖ్యఅతిథిగా హాజరైన పీటీ చారి మాట్లాడుతూ..వేమన 300 ఏండ్లకు పూర్వం మూఢనమ్మకాలకు వ్యతిరేకంగానూ, బ్రాహ్మణీయ భావజాలాలకు వ్యతిరేకంగానూ పోరాటం చేసిన గొప్ప యోధులు అని అన్నారు. అతి సరళమైన భాషను ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా సాహిత్యాన్ని తీసుకువచ్చిన ప్రజా కవి వేమన అని చెప్పారు. బంగారు జింక అనేది ఉండదు అని తెలిసినా, ఆ జింక కొరకు పరుగులెత్తిన రాముడు దేవుడెట్లాయను అని వేమన ప్రశ్నించారని చెప్పారు. పిండాలు పెట్టే సాంప్రదాయాన్ని, ముహూర్తాలు పెట్టే ధోరణులను ఎండగట్టారని చెప్పారు. వేమన పద్యాన్ని బ్రాహ్మణీయ మనువాదులు అనగదొక్కినప్పటికీ ప్రజల నోటిలో తారాడటం ఫలితంగా ఆనాడు ఇంగ్లీష్ దొర బ్రౌన్ ప్రజల్లో ఉన్న వేమన పద్యాలను బయటికి తీసి గ్రంథస్తం చేశారని గుర్తు చేశారు. బ్రౌన్ తెలుగు భాషను తెలుసుకొని వేమన పద్యాలను ఇంగ్లీషులో అనువదించారని చెప్పారు. నేటి సమాజానికి వేమన పద్యాలు ఎంతో ఉపయోగంగా ఉంటాయన్నారు. నేటి పాలకులు ప్రజల్లో మతమౌఢ్యాన్ని పెంచి పోషించేందుకు ప్రయత్నిస్తుందని, దానికి వ్యతిరేకంగా గట్టిగా నిలబడాలని చెప్పారు. బంగారు ఆచార్యులు మాట్లాడుతూ వేమన పద్యాలు తెలుగువారికి, తెలుగుతనానికి ఎంతో గౌరవాన్ని తెచ్చిపెట్టాయన్నారు. పద్మ మాట్లాడుతూ..వేమన పద్యాలు పాట రూపంగా చదివి వినిపించారు. కర్రె మల్లేశం వేమన బోధించిన విధంగా అందరికీ విద్య అవసరమన్నారు. శివన్నారాయణ, శ్రీమన్నారాయణ, రుక్కయ్య, గిరీష్, శారద, గుమ్మడి హరిప్రసాద్, రోజా రాణి, ప్రొఫెసర్ మధుకర్ వేమన పద్యాలు పాటలుగా పాడి వినిపించారు. రషీద్ మాట్లాడుతూ మనువాదులు బ్రాహ్మణీయ భావజాలంతో వేమనను సైతం తప్పుగా చిత్రీకరించే ప్రయత్నిస్తున్నారని, దానిని ఎదురొడ్డాలని చెప్పారు. వేమన ఆనాటికి ఈనాటికి విప్లవకారుడు అని చెప్పారు.

అనంతరం వేమన పద్యాలకు పట్టాభిషేకం పట్టి వేమన పద్యాలు చదివి వినిపించిన వారికి పీటీ చారి, ప్రముఖ రచయిత శతాధిక నవ యువకులు రామిశెట్టి రోశయ్య రచించిన పుస్తకాలను బహుమతు లుగా అందజేశారు. అనంతరం వేమన చిత్రప టానికి సభికులందరూ పూలను వేసి నివాళులర్పించారు. శారద వందల సమర్పణతో కార్యక్రమం ముగిసింది. ఈ కార్యక్రమంలో గొడుగు యాదగిరిరావు, పి ఎస్ ఎన్ మూర్తి, ఎన్. శ్రీనివాస్, జి. శ్రీనివాసులు, వెంకటేశ్వర రావు, రుక్కయ్య, శివన్నారాయణ, వెంకన్న, ఆచార్యులు, పద్మ, శారద, రోజా రాణి, సిహెచ్ నాగేశ్వరరావు, రషీద్, ప్రొఫెసర్ మధుకర్, జి శివరామకృష్ణ, హరి ప్రసాద్, కర్రె మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

'సంక్షేమ' సర్వే షురూ

- లబ్దిదారుల ఎంపికకు క్షేత్రస్థాయిలో అధికారుల పర్యటన
- గణతంత్ర్య దినోత్సవం రోజున 4 పథకాల అమలుకు శ్రీకారం
- శాటిలైట్ మ్యాపింగ్‌తో సాగు భూముల గుర్తింపు
- ఈ నెల 21 నుంచి గ్రామ సభలు
- 25న తుదిజాబితాపై ఇన్‌చార్జి మంత్రి ఆమోద ముద్ర

నవతెలంగాణ-సిటీబ్యూరో

గణతంత్ర్య దినోత్సవం రోజున రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్లు, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్త రేషన్ కార్డుల మంజూరుకు సన్నద్ధమవుతోంది. జిల్లా ఉన్నతాధికారులతోపాటు రెవెన్యూ, వ్యవసాయ, గృహ నిర్మాణశాఖ అధికారులు, సిబ్బంది క్షేత్ర స్థాయిలో సర్వే చేపడుతూ లబ్దిదారులను గుర్తిస్తున్నారు. ఈ నెల 20వ తేదీలోపు సర్వే ప్రక్రియ పూర్తి చేసి 21 నుంచి 24వ తేదీ వరకు రెవెన్యూ గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించి అర్హుల జాబితాను రూపొందించనున్నారు. ఈ నెల 25వ తేదీన అర్హుల జాబితాకు ఇన్‌చార్జి మంత్రి ఆమోద ముద్ర వేయాల్సి ఉంది. జిల్లా కలెక్టర్ గౌతమ్, అదనపు కలెక్టర్లు విజయేందర్‌రెడ్డి, రాధికాగుప్తా ఎప్పటికప్పుడు సర్వేను పరిశీలిస్తున్నారు. సాగుకు యోగ్యమైన భూమికే పరిహారం అందించాలనే లక్ష్యంతో శాటిలైట్ మ్యాపింగ్ ద్వారా సాగు భూములు, గుట్టలు, కాలువలు, ప్లాట్లు, ఇండ్లు తదితర ప్రాంతాలను గుర్తిస్తున్నారు. ధరణి పోర్టల్‌లో నమోదైన భూముల ఆధారంగా సర్వే చేపడుతున్నట్టు సమాచారం.



సర్వే సరళిని పరిశీలిస్తున్న కలెక్టర్ గౌతమ్, తదితరులు (ఫైల్)

నాలుగు అంశాలే ప్రధానం

రెవెన్యూ గ్రామాన్ని యూనిట్‌గా తీసుకుని భూ భారతి, ధరణి పోర్టల్ సాఫ్ట్‌వేర్ నుంచి ఆర్ఓఆర్ రికార్డును తీసుకుని రెవెన్యూ, మండల పరిషత్, అగ్రికల్చర్ అధికారులు తుది సర్వేను నిర్వహించి జాబితాను సిద్ధం చేయనున్నారు. గృహాలు, కాలనీలుగా మారిన వ్యవసాయ భూములు, రియల్ ఎస్టేట్ లే అవుట్లు, పరిశ్రమలు, సాగునీటి కాలువలకు కేటాయించిన భూములు, ప్రభుత్వ అవసరాలకు సేకరించిన భూములు, సాగుకు యోగ్యంగా లేని భూములను గుర్తిస్తున్నారు.

సాగు భూమికే రైతు భరోసా

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో 40,960 మంది రైతులకు 77,984 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. ఇందులో ప్రతి ఏటా వానా కాలం సీజన్‌లో దాదాపు 35వేల ఎకరాలు, యాసంగిలో దాదాపు 25వేల ఎకరాల్లో వివిధ పంటలను సాగు చేస్తున్నారు. ఈ లెక్కలు చూస్తే 50శాతం భూముల్లో పంటలు సాగు కావడం లేదు. రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం మేరకు ఈ సాగుకాని భూములకు భరోసా దక్కే అవకాశం లేదు. జిల్లాలో సాగులో ఉన్న పంట భూముల్లో పండ్లు, కూరగాయల తోటలు, ఆయిల్‌ఫాం తదితర ఉద్యానవన పంటలకు సైతం రైతు భరోసా ఇవ్వాల్సి ఉంటుంది. అర్హుల జాబితాను సిద్ధం చేసేందుకు గ్రామ సభల నిర్వాహణకు ఇప్పటికే అధికారులు షెడ్యూల్ రూపొందించారు. గత ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేసిన ప్లాట్లు, పెట్రోల్ పంపులు, భవంతులు, మైనింగ్ అనుమతి పొందిన భూములకు కొన్ని చోట్ల పెట్టుబడి సాయం అందించారు. ఈ సారి అలాంటి పొరపాట్లకు ఆస్కారం లేకుండా అర్హులకే రైతు భరోసా అందించాలని కసరత్తు చేస్తున్నారు.

కొందరికే ఇందిరమ్మ ఆత్మీయ భరోసా

రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల జారీ చేసిన నిబంధనల మేరకు గత ఆర్థిక సంవత్సరంలో కనీసం 20 రోజులు ఉపాధి పనులు చేసిన వారికి ఇందిరమ్మ ఆత్మీయ భరోసా ఇచ్చేందుకు ప్రణాళిక సిద్ధమవుతోంది. ఆయా కుటుంబాలకు ఏడాదికి రూ.12వేలు రెండు విడతల్లో ఇవ్వనున్నారు. ఈ పథకం లబ్దిదారులను సైతం గ్రామ సభల్లో చర్చ నిర్వహించి తుది జాబితాను సిద్ధం చేయాల్సి ఉంది. జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారుల లెక్కల ప్రకారం మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా వ్యాప్తంగా 18,014 జాబ్ కార్డులు ఉండగా, ఇందులో 19,387 మంది కూలీలు ఉన్నారు.

కబేళా కార్మికులపై అధికారుల బెదిరింపులు ఆపాలి



- సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎండీ అబ్బాస్

నవతెలంగాణ-సిటీబ్యూరో

జియాగూడలో కబేళాను మూసివేస్తామని, ఇక్కడి నుంచి కార్మికులు వెళ్లిపోవాలని కబేళా కార్మికులను జీహెచ్ఎంసీ అధికారులు బెదిరించడం మానుకోవాలని, జీహెచ్ఎంసీ అధికారులు ఆధునిక కబేళాను నిర్మించి కార్మికులకు న్యాయం చేయాలని సీపీఐ(ఎం)రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎండీ అబ్బాస్ డిమాండ్ చేశారు. ఆదివారం జియాగూడ కబేళాలో ఎండీ అబ్బాస్ నాయకత్వంలో సీపీఐ(ఎం) హైదరాబాద్ సౌత్ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జి. విటల్, జియాగూడ పార్టీ నాయకులు నరసింహ, కబేళా కార్మిక సంఘం నాయకులు శశికాంత్‌ల బృందం పర్యటించింది. కబేళాలో పనిచేస్తున్న వందలాది మంది కార్మికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అబ్బాస్ మాట్లాడుతూ.. జియాగూడ కబేళాలో 5000 మందికి పైగా కార్మికులు పనిచేస్తూ జీవనోపాధి పొందుతున్నారని, ఆధునిక కబేళాను నిర్మించాల్సిన జీహెచ్ఎంసీ అధికారులు తమ బాధ్యతను విస్మరించి, 25వ తేదీ నుండి కబేళాను మూసివేస్తామని బెదిరించడం సరైనదికాదన్నారు. కబేళా అపరిశుభ్రంగా ఉన్నదని, న్యూసెన్స్ ఉందని దాన్ని వెంటనే మూసివేయాలని, లేదంటే మీపై చర్యలు తీసుకుంటామని కార్మికులకు నోటీసులు జారీ చేయడం అన్యాయమన్నారు. దీంతో కార్మికులు తమ ఉపాధి పోతుందని భయాందోళనలకు గురవుతున్నారని వాపోయారు. అధికారులు బెదిరింపులు వేధింపులు ఆపకపోతే ఆందోళన నిర్వహిస్తామన్నారు. కార్మికులకు ఇచ్చిన నోటీసులను వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. 2013లో ఆధునిక కమేళా నిర్మించాలని హైకోర్టు చెప్పినప్పటికీ అధికారులు, ప్రభుత్వం హైకోర్టు తీర్పును అమలు చేయకుండా మీనమేషాలు లెక్కిస్తున్నాయని విమర్శించారు. కార్మికులు భయపడాల్సిన అవసరం లేదని, గతంలో కబేళాను చెంగిచెర్లకు తరలించాలని కార్మికుల కు వ్యతిరేకంగా ప్రభుత్వం నిర్ణయం తీసుకున్న ప్పుడు సీపీఐ(ఎం) పోరాటం చేసి నిలువరించిందన్నారు. ఇప్పుడు కూడా కార్మికులకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. హైకోర్టు తీర్పు ప్రకారం ఆధునిక సౌకర్యాలతో కబేళాను నిర్మించి కార్మికులకు న్యాయం చేసే వరకూ సీపీఐ(ఎం) పోరాడుతుందన్నారు. త్వరలోనే సమస్యలను జీహెచ్ఎంసీ కమిషనర్‌కు దృష్టికి తీసుకెళ్తామన్నారు.

ప్రతి ఒక్కరూ జాతీయ భావాన్ని అలవర్చుకోవాలి : కార్పొరేటర్ శ్రవణ్



నవతెలంగాణ-నేరేడ్‌మెట్

ప్రతి ఒక్కరూ జాతీయత భావాన్ని అలవర్చుకోవాలని మల్కాజిగిరి కార్పొరేటర్ శ్రవణ్ అన్నారు. ఆదివారం మల్కాజిగిరి సర్కిల్ సఫిల్‌గూడ చౌరస్తా వద్ద నుండి అనుటెక్స్ వరకు ఏర్పాటు చేసిన రన్ ఫర్ భారత్‌మాత కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ జాతీయ భావాన్ని అలవర్చు కోవాలని, భారతీయ సంస్కృతీ సంప్రదాయాలను తెలుసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రాములు, నందు యాదవ, వెంకట్ యాదవ్, నవీన్, సుకేష్, పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరాలను వినియోగించుకోవాలి



నవతెలంగాణ-ఘట్కేసర్

ప్రజలు ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని నీలిమ ఆస్పత్రి సీఓఓ సూర్యదేవర నీలిమ అన్నారు. ఆదివారం ఘట్కేసర్‌మున్సిపాలిటీ పరిధిలోని అంకుషాపూర్ గ్రామంలో నీలిమ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరంలో 547 మంది పాల్గొని పలు పరీక్షలు చేయించుకున్నారు. ఈ సందర్భంగా నీలిమ మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాలలో నిర్వహిస్తున్న ఉచిత వైద్య శిబిరాలను గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆరోగ్య నియమాలను పాటిస్తూ వ్యాధులు దరిచేరకుండా చూసుకోవాలన్నారు. క్యాంపు జరిగిన ప్రతి గ్రామంలో పేద ప్రజలకు నీలిమ హాస్పిటల్ 50శాతం డిస్కౌంట్ కార్డును అందజేస్తుందన్నారు.

ప్రతి గర్భిణీ స్త్రీకి ప్రతి నెలా 9వ తారీకు ఉచితంగా పరీక్షలు జరుగుతు న్నట్టు తెలిపారు. నార్మల్ డెలివరీ ఉచితంగా, సీజేరియన్‌కు పదివేలతో వైద్యం అందిస్తున్నట్టు తెలిపారు. మేడ్చల్, యాదాద్రి, జిల్లాలోని గ్రామాల్లో 82 క్యాంపులు నిర్వహించి దాదాపు 44 వేల మందికిపైగా వైద్యం అందించినట్టు చెప్పారు. కార్యక్రమంలో బద్దం నరసింహారెడ్డి, చలువాది ప్రవీణ్‌రావు, లక్ష్మీనరసింహారెడ్డి, కాళిదాసు గౌడ్, దేవేందర్ రెడ్డి, కృష్ణాగౌడ్, గణేష్, క్యాంప్ నిర్వాహకుడు ఎడ్ల భరత్ రెడ్డి, వైద్యులు, తదితరులున్నారు.

వృద్ధ మహిళలకు చీరలు, పండ్లు పంపిణీ



నవతెలంగాణ-నేరేడ్‌మెట్

నేరేడ్‌మెట్‌లోని మదర్స్ నెస్ట్ ఓల్డ్ ఏజ్ ఆశ్రమంలో హ్యూమన్ రైట్స్ ఆర్గనైజేషన్ ఆల్ ఇండియా మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా జనరల్ సెక్రటరీ గౌసియా, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా సెక్రటరీ చైతన్యల ఆధ్వర్యంలో వృద్ధులకు చీరలు, పండ్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హ్యూమన్ రైట్స్ ఆర్గనైజేషన్ ఆల్ ఇండియా వైస్ ప్రెసిడెంట్, తెలంగాణ రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ మోమిన్ బాషా ముఖ్యఅతిథిగా పాల్గొని వారి చేతుల మీదగా వృద్ధ మహిళలకు చీరలు, పండ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మనకు ఉన్న దాంట్లో కొంతైనా పేద వారిని ఆదుకోవడానికి ముందుకు వచ్చి, తమకు తోచిన సహాయం అందించాలని కోరారు. ఈ కార్యక్రమం లో హ్యూమన్ రైట్స్ ఆర్గనైజేషన్ ఆల్ ఇండియా తెలంగాణ స్టేట్ మహిళా ఇంచార్జి ఆశ, తెలంగాణ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ నరేష్, జనరల్ సెక్రటరీ ఉదయ్ శంకర్, గ్రేటర్ హైదరాబాద్ వైస్ ప్రెసిడెంట్ కృష్ణ, గ్రేటర్ హైదరాబాద్ మహిళా వైస్ ప్రెసిడెంట్ సంగీత, తదితరులు పాల్గొన్నారు.

దమ్మాయిగూడలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన



నవతెలంగాణ-కీసర

దమ్మాయిగూడ పురపాలక సంఘం పరిధిలో చైర్ పర్సన్ వసుపతి ప్రణీత గౌడ్ అధ్యక్షతన మేడ్చల్ నియోజకవర్గ శాసనసభ్యులు చామకూర మల్లారెడ్డి రూ.2,41,50,000/-(రెండు కోట్ల నలభై ఒక లక్ష యాభై వేల రూపాయల) తో వివిధ వార్డులలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. 14వ వార్డులో రూ.30 లక్షలతో సీసీరోడ్డు నిర్మాణం, 13వ వార్డులో రూ.25 లక్షలతో సీసీరోడ్డు, 17 వ వార్డులో రూ. 13.50 లక్షలతో సీసీ రోడ్డు, భూగర్భ మురుకి కాలువ నిర్మాణం, 8వ వార్డులో రూ. 28.00 లక్షలతో సీసీ రోడు, భూగర్భ మురుకి కాలువ నిర్మాణం, 4 వ వార్డులో రూ. 35.00 లక్షలతో సీసీరోడ్డు, భూగర్భ మురుకి కాలువ నిర్మాణం, 4 వ వార్డులో రూ. 35.00 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణం, భూగర్భ మురుకి కాలువ నిర్మాణం, 2వ వార్డు ఆర్జీకే కాలనిలో రూ. 75.00 లక్షలతో కమ్యునిటీ హాల్ నిర్మాణం పనులకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి, చైర్ పర్సన్ వసుపతి ప్రణీత గౌడ్, మున్సిపల్ కమిషనర్ ఏ.నాగమణి , డీఈఈ ఎస్ బాల మురళీ, కౌన్సిలర్లు నాను నాయక్ , మంగళ్ పురి వెంకటేష్ , సంపంన్ బోల్ స్వప్న , రమేష్ గౌడ్ , మోర మౌనిక,రామారం శ్రీహరి గౌడ్, బీ ఆర్ ఎస్ నాయకులు వసుపతి శ్రీకాంత్ గౌడ్ ,సపంన్ బోల్ హరి గౌడ్,మోర నరహరి రెడ్డి, తిరుపతి రెడ్డి, తదితరులున్నారు.

క్షత్రియ సమాజ్ సంఘం అభివృద్ధికి కృషి చేస్తా

- ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



నవతెలంగాణ-కాప్రా

క్షత్రియ సమాజ్ సంఘం వారి సమస్యల పరిష్కారానికి తప్పకుండా కృషి చేస్తానని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి హామీ ఇచ్చారు. బస్వర్ క్షత్రియ సమాజ్ హైదరాబాద్ ఆధ్వర్యంలో కాప్రాలో ఏర్పాటు చేసిన హెల్త్ క్యాంపునకు ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో ఏఐసీసీ మెంబర్ కాంగ్రెస్ నాయకులు గౌరీ శంకర్, బీఆర్ఎస్ నాయకులు బైరీ నవీన్ గౌడ్, క్షత్రియ సమాజ్ రాష్ట్ర అధ్యక్షుడు ఉమేష్, కాప్రా సర్కిల్ అధ్యక్షుడు కిషోర్, జాయింట్ సెక్రటరీ విజయ్, మహిళా అధ్యక్షురాలు, విజయ లక్ష్మి, శ్రీనివాస్ రావు తదితరులు పాల్గొన్నారు.

మున్నూరు కాపులు ఐక్యంగా ఉండాలి : ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న



నవతెలంగాణ-జవహర్‌నగర్

మున్నూరుకాపుల్లో చైతన్యం పెరుగుతుండటం మంచి పరిణామం అని, ఐక్యంగా ఉండి పోరాడాలని ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న అన్నారు. ఆదివారం జవహర్ నగర్‌లో మున్నూరుకాపు సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన క్యాలెండర్ ఆవిష్కరణ సమావేశానికి హాజరై జవహర్‌నగర్ మేయర్‌దొంతగాని శాంతి కోటేశ్ గౌడ్, డిప్యూటీ మేయర్ రెడ్డిశెట్టి శ్రీనివాస్, కార్పొరేటర్ పానుగంటి బాబు, మున్నూరుకాపు సంఘం మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు మామిండ్ల శ్రీనివాస్ పటేల్‌లతో కలిసి క్యాలెండర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మున్నూరు కాపు సంఘం సభ్యులు సంఘం భవనం కోసం స్థలం కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై మల్లన్న స్పందిస్తూ మేడ్చల్ జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి స్థలం కేటాయింపు జరిగేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు పలుగుల రాజేశ్వర్ పటేల్, గౌరవ అధ్యక్షుడు రామ్మోహన్ పటేల్, ఉపాధ్యక్షులు అవుశర్ల నాగభూషణం, ఎలుగల మధుసూదన్ పటేల్, కోశాధికారి మహేందర్ బాబు పటేల్, సలహాదారులు పోరెడ్డి వెంకటేశ్వర్లు, తాడెం యాదగిరి, జవహర్‌నగర్ మున్నూరుకాపు సంఘం ప్రతినిధిలు పలుగుల సురేందర్ పటేల్, ధనిశెట్టి విశ్వనాథ్ పటేల్, మంచికంటి శేఖర్ పటేల్, సంఘం కార్యకవర్గ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

గట్టు మైసమ్మను దర్శించుకున్న వజ్రేష్ యాదవ్



నవతెలంగాణ-ఘట్కేసర్

ఘట్కేసర్ మున్సిపాలిటీ పరిధిలో గట్టు మైసమ్మ జాతర సందర్భంగా ఆలయ కమిటీ ఆహ్వానం మేరకు టీపీసీసీ ఉపాధ్యక్షులు, తోటకూర వజ్రేష్ యాదవ్ ఘట్కేసర్ మున్సిపాలిటీ చైర్మెన్ మల్లి పావని జంగయ్య యాదవ్‌తో కలిసి ఆదివారం గట్టుమైసమ్మను దర్శించుకున్నారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు వారిని శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఘట్కేసర్ ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ నియోజకవర్గం బీ బ్లాక్ అధ్యక్షులు వేముల మహేష్ గౌడ్, ఘట్కేసర్ మున్సిపాలిటీ అధ్యక్షులు మామిడ్ల ముత్యాలు యాదవ్, ఘట్కేసర్ మున్సిపాలిటీ కౌన్సిలర్లు,సింగిరెడ్డి శ్రీకాంత్ రెడ్డి,తూంకుంత మున్సిపాలిటి అధ్యక్షులు జైపాల్ రెడ్డి,ఘట్కేసర్ మున్సిపాలిటీ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు బొక్క సంజీవ రెడ్డి,ఘట్కేసర్ మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ నాయకుడు తదితరులు పాల్గొన్నారు



నాచారం మాదిగ సంఘం ఆధ్వర్యంలో మందకృష్ణ మాదిగ మద్దతుగా లక్ష డప్పులు కార్యక్రమం నాచారం నుండి 100 డప్పుల కార్యక్రమంలో మాదిగ నాయకులు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. - నవతెలంగాణ,చర్లపల్లి

భవానీ నగర్ కాలనీలో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

- ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి
- భవానీ నగర్ కాలనీ క్యాలెండర్ ఆవిష్కరణ



నవతెలంగాణ - చర్లపల్లి

భవానీ నగర్ కాలనీ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. ఆదివారం భవానీ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. భవానీ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు రాగిరి మోహన్ రెడ్డి కాలనీలో డ్రయినేజీ, రోడ్లు అభివృద్ధి, దోమల నివారణకు కృషి చేయాలని ఎమ్మెల్యేను కోరారు. ఈ సందర్భంగా కాలనీలో డ్రయినేజీ వ్యవస్థ, రోడ్లు తదితర సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో కృష్ణారెడ్డి, వినోద, హరినాథ్ రెడ్డి, భవానీ, అశోక్, భాస్కరాచార్యులు, రాయుడు, విష్ణువర్ధన్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి, సుధాకర్ రెడ్డి, రమేష్ చారి, శ్రీధర్ రెడ్డి, నవీన్ గౌడ్, నల్లగొండ భూపాల్ రెడ్డి, వీర ప్రతాపరెడ్డి, టి.రామచందర్, హనుమంత్ రెడ్డి, పిసి చారి, రాములు, వెంకటేష్, ఏ.పాండురంగం భాస్కర్ రెడ్డి, టెలిఫోన్ రమేష్, సురేందర్, జనార్దన్ రెడ్డి, శేఖర్ రెడ్డి, టి.రాజాబాబు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

నవతెలంగాణ -శామీర్‌పేట

మరమ్మత్తుల కారణంగా ఉద్దమర్రి విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని ఉషారుపల్లి, కేశ్వాపూర్, ఎల్లగూడ ఫిడర్ల పరిధిలోని ఉషారు పల్లి, బండకాడిపల్లి, ఉద్దమర్రి పౌల్ట్రీ ఫామ్స్, అద్రాస్‌పల్లి, ఎల్లగూడ, కేశ్వాపూర్ గ్రామాల్లోని గృహలతోపాటు వ్యవసాయ బావులకు సోమవారం (నేడు) ఉదయం 10:30గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నట్లు శామీర్ పేట విద్యుత్తు ఏఈ రాఘవేందర్ రావు ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. విద్యుత్తు వినియోగదారులు సహకరించాలని కోరారు.



కాప్రా మండల పరిధిలోని జమ్మిగడ్డ ప్రాంతం బీజేఆర్ కాలనీలో ప్రతి ఆదివారం జ్ఞానమాల టీం ఆధ్వర్యంలో జ్యోతిరావు పూలే, డా బి.ఆర్. అంబేద్కర్, బాబు జగ్జీవన్ రామ్ విగ్రహాలకు సమర్పించే జ్ఞానమాల కార్యక్రమం 138వ వారానికి చేరింది. ఈ ఆదివారం జ్ఞానమాల టీం ఆర్గనైజర్ తాడూరి గగన్ కుమార్, సభ్యులు నర్సింహ్మా చారి, నరేందర్ రావు, రవి నాయక్, నగేష్, తదితరులు మహనీయులకు పూలమాలతో



ముందే మాట్లాడుకోండి..

పెండ్లి చేసుకోబోయే ఇద్దరికీ ఒకరికొకరు నచ్చడమేకాదు, అన్ని విషయాల్లోనూ ఏకాభిప్రాయం అవసరం. అన్ని అంశాల్లోనూ సాధ్యం కాకపోతే, కొన్ని ప్రధానమైన విషయాల్లోనైనా ఇద్దరూ ఒకేమాట మీద ఉండాలి. అప్పుడే పెండ్లి తర్వాత అభిప్రాయభేదాలు రాకుండా సంతోషంగా ఉంటారు. అయితే ఈ మధ్య విడిపోతున్న జంటల్ని గమనిస్తే ఆర్థికపరమైన ఇబ్బందులే ఎక్కువగా ఉంటున్నాయి. కాబట్టి కాబోయే జీవిత భాగస్వామితో కొన్ని ఆర్థికపరమైన విషయాలు ముందే చర్చిస్తే మంచిది. ఆ ఆర్థికపరమైన అంశాలు ఏంటో ఈ రోజు తెలుసుకుందాం.

ముందుగా మీకు కాబోయే జీవిత భాగస్వామితో మీ ఆర్థిక విషయాల గురించి నిజాయితీగా మాట్లాడండి. మీ ఆదాయం, పొదుపు, అప్పులు, ఆర్థిక లక్ష్యాలు, ఖర్చుల గురించి చర్చించండి. ఇలా చేయడం వల్ల కాబోయే దంపతుల ఆర్థిక నేపథ్యం తెలుస్తుంది. అలాగే పరస్పర ఆర్థిక ప్రాధాన్యతలను తెలియజేయడానికి వీలవుతుంది. ఇలా చేయడం వల్ల ఒకరిపై ఒకరికి నమ్మకం పెరుగుతుంది.

ఆర్థిక లక్ష్యాలు


కాబోయే దంపతులు స్వల్ప లేదా దీర్ఘకాలిక లక్ష్యాలపై చర్చించుకోవాలి. ఇల్లు కొనడం, పెట్టుబడులు పెట్టడం లాంటివే కాకుండా, కుటుంబ ప్రణాళికల గురించి కూడా చర్చించుకోవాలి. పిల్లలు పుట్టిన తర్వాత వారి పెంపకం, చదువుల కోసం డబ్బు పొదుపు గురించి మాట్లాడుకోవాలి. వ్యక్తిగత, ఉమ్మడి లక్ష్యాల గురించి చర్చించుకోవడం కూడా మంచిది.

పెండ్లి, హనీమూన్ ఖర్చులు

పెండ్లి ఖర్చులు, హనీమూన్ కోసం కొంత బడ్జెట్‌ను పక్కకు తీయాలి. పెండ్లికి పెట్టబోయే ఖర్చుపై కాబోయే దంపతులిద్దరూ ముందుగా చర్చించుకోవాలి. తదనుగుణంగా మీ ఆర్థిక ప్రణాళికలను ప్లాన్ చేయండి. అయితే వీలైనంత వరకు తక్కువ ఖర్చుతో పెండ్లి చేసుకోవడం మంచిది. ఈ ఖర్చుల కోసం అప్పులు చేయకుండా ఉండడం మరీ మంచిది.

ఖర్చులలోనూ భాగస్వామ్యం

కాబోయే దంపతులిద్దరూ ఉద్యోగులైతే ఇంటి అద్దె, కిరాణా సామాగ్రి, ఇతర ఖర్చులను ఇద్దరు షేర్ చేసుకోవాల్సి ఉంటుంది. కొంతమంది ఖర్చులను సమానంగా విభజించుకుంటారు. మరికొందరు వ్యక్తిగత ఆదాయం ఆధారంగా ఖర్చు చేస్తుంటారు. ఈ విషయాలపై కాబోయే జంట ముందే మాట్లాడుకుంటే వారి భవిష్యత్‌కు మంచిది.



అత్యవసర నిధి

వైద్యం, ఉద్యోగం పోయినప్పుడు ఈ అత్యవసర నిధి ఉపయోగపడుతుంది. అలాగే మీకు ఆర్థిక భద్రతను అందిస్తుంది. దీని కోసం మూడు నుండి ఆరు నెలలకు సరిపడా డబ్బులను ఆదా చేయడం మంచిది. ఇలా భాగస్వామ్య అత్యవసర నిధిని ప్రారంభించడం వల్ల మీరు కష్ట సమయాల్లో లోన్‌లు, అప్పులపై ఆధారపడాల్సిన అవసరం ఉండదు. ఇలాంటి విషయాలపై కూడా కాబోయే జంట చర్చించుకోవాలి.

ఆడంబరాలు వద్దు

మీ దగ్గర డబ్బులు లేనప్పుడు పెండ్లి విషయంలో ఆడంబరాలను పోవద్దు. వీలైనంత వరకు తక్కువ ఖర్చుతోనే మ్యారేజ్ చేసుకోండి. ఒకవేళ అప్పు తీసుకుని పెండ్లి చేసుకునేటప్పుడు అది మీ స్తోమతకు మించిపోకుండా చూసుకోండి. ఆర్థిక ఒత్తిడిని తగ్గించుకోవడానికి ఎడ్యుకేషన్ లోన్స్, క్రెడిట్ కార్డు, పర్సనల్ లోన్స్ వంటి అప్పులను తీర్చేయండి. ముందుగా అధిక వడ్డీ రేటు ఉన్న అప్పులను కట్టేయండి. దీని వల్ల మీకు కొంత భారం తగ్గుతుంది.

ఆరోగ్య బీమా పాలసీ

ప్రతి కుటుంబానికి ఆరోగ్య బీమా పాలసీ చాలా అవసరం. అత్యవసర సమయాల్లో ఇది బాగా ఉపయోగపడుతుంది. అందుకే హెల్త్ ఇన్సూరెన్స్ పాలసీ గురించి కూడా కాబోయే దంపతులు చర్చించుకోవాలి.

ఉమ్మడిగా పెట్టుబడులు

దంపతులిద్దరూ కలిసి పెట్టుబడులు పెట్టడం వల్ల బలమైన ఆర్థిక భవిష్యత్తు ఉంటుంది. పొదుపు ఖాతాలు, ఫిక్స్‌డ్ డిపాజిట్లు, మ్యూచువల్ ఫండ్లు, స్టాక్స్‌లలో పెట్టుబడులు పెట్టడంపై కలిసి చర్చించుకోండి. జాయింట్ ఇన్వెస్ట్‌మెంట్ ఖాతాను ఓపెన్ చేయండి. అలాగే ఏవైనా ఆస్తులను కూడా కొనుగోలు చేయవచ్చు.

పొదుపుపై చర్చలు

ఖర్చు, పొదుపుపై ఎక్కువగా చర్చించుకోండి. మీ దీర్ఘకాల, వ్యక్తిగత లక్ష్యాల కోసం నెలవారీగా ఎంత పొదుపు చేయాలనుకుంటున్నారో చర్చించుకోండి. దీని ప్రకారం మీ భవిష్యత్తును ప్రారంభించుకోండి.

వీలునామా

ఎస్టేట్ ప్లానింగ్ అనేది కూడా ముఖ్యమే. కానీ దీన్ని చాలా మంది పట్టించుకోరు. పెండ్లయిన తర్వాత వీలునామాను రాయడం వల్ల ఒకవేళ ఏదైనా జరగరానిది జరిగితే మీ ఆస్తులు మీరు అనుకున్నవారికి సురక్షితంగా దక్కుతాయి. ఈ విషయంపై కూడా ముందే చర్చించుకోవడం మంచిది. ■

గుండె ఆరోగ్యానికి...



గుండె ఆరోగ్యంగా ఉండాలంటే వారానికి కనీసం 150 నిమిషాలు మితమైన వ్యాయామం చేయాలని నిపుణులు సిఫార్సు చేస్తున్నారు. అయితే.. గుండె బలోపేతానికి నిపుణులు చెబుతున్న ఉత్తమ వ్యాయామాలు ఏమిటో చూద్దాం....

రోజూ నడవాలి

నడక చాలా సులభమైన వ్యాయామం. ముఖ్యంగా స్పీడ్ వాక్ గుండె బలోపేతానికి ఒక మార్గం. ఇది హృదయ స్పందన రేటును పెంచుతుంది, ఇతర వ్యాయామాల కంటే సులభంగా ఉంటుంది. ఏ సమయంలోనైనా.. ఎక్కడికైనా నడవవచ్చు. ఇందుకు కావలసిందల్లా మంచి సౌకర్యవంతమైన బూట్లు. రోజుకు కనీసం 60 నిమిషాలు నడవాలి.

బరువు శిక్షణ

బరువు శిక్షణ కండరాల బలాన్ని పెంపొందించడానికి, కొవ్వును కరిగించేందుకు ఎంతో సహాయపడుతుంది. బరువును అదుపులో ఉంచుకునేందుకు జిమ్‌కి వెళ్లవచ్చు. అలాగే ఇంట్లోనే వ్యాయామాలూ చేయవచ్చు. పుష్-అప్‌లు, స్క్వాట్‌లు, పుల్-అప్‌లు కండరాలను బలోపేతం చేయడానికి, ఎముక, గుండె ఆరోగ్యానికి దోహదం చేస్తాయి.

స్విమ్మింగ్

స్విమ్మింగ్ అనేది కేవలం రిఫ్రెష్ వ్యాయామం మాత్రమే కాదు. స్విమ్మింగ్... పూర్తి శరీర వ్యాయామం. ఇది మన శరీరాన్ని మాత్రమే కాకుండా గుండెను కూడా బలోపేతం చేస్తుంది. ఇతర వ్యాయామాల మాదిరిగా కాకుండా స్విమ్మింగ్ మన శరీరం మొత్తాన్ని బలోపేతం చేస్తుంది.

యోగాతో

యోగా... గుండె ఆరోగ్యానికి ఎంతో ఉపయోగపడుతుంది. యోగా చేయడం వల్ల మీ కండరాలు బలపడతాయి. వాటిని సరైన అమరికలోకి తీసుకురావచ్చు. కొన్ని రకాల యోగా మీ హృదయ స్పందన రేటును పెంచుతుంది. అదే సమయంలో మీ రక్తపోటును తగ్గిస్తుంది.

సైక్లింగ్ చేయాలి

సైక్లింగ్‌తో మనం ఊహించిన దానికంటే ఎక్కువ ప్రయోజనం కలుగుతుంది. ఇది గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గిస్తుంది. ఇది మీ హృదయ స్పందన రేటును పెంచడంలో సహాయపడుతుంది. సైక్లింగ్ మీ మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది.

స్కిప్పింగ్ తప్పనిసరి

స్కిప్పింగ్ కూడా చాలా మంచి వ్యాయామం. ఇది మీ హృదయ స్పందన నిమిషానికి 150-180 బీట్స్‌లో ఉంచుతుంది. ఇది రక్తం ఒత్తిడితో ప్రవహించేలా చేస్తుంది. శరీరాన్ని పూర్తిగా శుభ్రపరుస్తుంది. శరీరం అంతటా ఆక్సిజన్, పోషకాల బదిలీ సామర్థ్యాన్ని పెంచుతుంది. ఈ వ్యాయామం ఎప్పుడైనా చేయవచ్చు. రోజుకు 15 నిమిషాలు సరిపోతుంది. ■

ట్రంప్ ప్రమాణస్వీకార వేళ
హోరెత్తిన నిరసనలు


(మొదటిపేజీ తరువాయి)

'స్టాండప్...ఫైట్ బ్యాక్', 'ట్రస్ట్ బ్లాక్ ఉమెన్', 'ఉయ్ కాంట్ బి సైలెంట్' అంటూ వారంతా నినాదాలు చేశారు. 'సఖి ఫర్ సౌత్ ఆసియా సర్వైవర్స్' సహా పలు స్వచ్ఛంద సంస్థలు పీపుల్స్ మార్చ్ పేరిట నిరసన చేపట్టాయి. పీపుల్స్ మార్చ్‌ని గతంలో ఉమెన్స్ మార్చ్ అని పిలిచే వారు. 2017 నుంచి ప్రతి సంవత్సరం ఇది జరుగుతోంది. ట్రంప్ వ్యతిరేక పోస్టర్లు, బ్యానర్లను ప్రదర్శించిన నిరసనకారులు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. టెస్లా యజమాని ఎలన్ మస్క్ సహా ట్రంప్ సన్నిహిత మద్దతుదారులను కూడా వారు వదిలిపెట్టలేదు. 2017 జనవరిలో ట్రంప్ తొలిసారి అమెరికా అధ్యక్షుడిగా ప్రమాణస్వీకారం చేసినప్పుడు సైతం వీరు ఇదే రకంగా నిరసన ప్రదర్శన నిర్వహించారు.

నగరంలోని మూడు వేర్వేరు పార్కుల నుంచి ప్రారంభమైన నిరసన ప్రదర్శనలు లింకన్ మెమోరియల్ సమీపాన కలిసిపోయాయి. 'ఫాసిజానికి తలవంచబోమని సమాజానికి చాటిచెప్పేందుకే భారీ ప్రదర్శన చేపట్టాం' అని పీపుల్స్ మార్చ్ తెలిపింది. ప్రమాణస్వీకారానికి ముందు అనేక కార్యక్రమాలకు హాజరయ్యేందుకు ట్రంప్ ఇప్పటికే వాషింగ్టన్ చేరుకున్నారు. అదే సమయంలో నిరసన ప్రదర్శనలు జరగడం గమనార్హం. అబార్షన్ యక్షన్ నౌ, టైమ్ టు యాక్ట్, సిస్టర్‌సాంగ్, ఉమెన్స్ మార్చ్, పాప్యులర్ డెమొక్రసీ ఇన్ యాక్షన్, హర్రియట్స్ వైల్డెస్ట్ డ్రీమ్స్, ది ఫెమినిస్ట్ ఫ్రంట్ నౌ, ప్లాన్డ్ పేరెంట్‌హుడ్, ది నేషనల్ ఉమెన్స్ లా సెంటర్ యాక్షన్ ఫండ్, సియర్రా క్లబ్, ఫ్రంట్‌లైన్ వంటి స్వచ్ఛంద సంస్థలు ఈ ప్రదర్శనలో భాగస్వాములయ్యాయి. న్యూయార్క్, సియాటెల్, చికాగో వంటి ఇతర నగరాలలో కూడా నిరసన ప్రదర్శనలు జరిగాయి. తాము మహిళలు, సమానత్వం, ఇమ్మిగ్రేషన్‌కు మద్దతుగా వచ్చామని బ్రిట్టానీ మార్టినెస్ అనే యువతి చెప్పారు. ట్రంప్ విధానాలు, విలువలపై నిరసనకారులు మండిపడ్డారు.

మరోసారి రైతు ఉద్యమానికి తలవంచిన మోడీ సర్కార్

(మొదటిపేజీ తరువాయి)



మంత్రిత్వ శాఖకు చెందిన అధికారుల ప్రతినిధి బృందం దల్లేవాల్‌తో సమావేశమైంది. సంయుక్త కిసాన్ మోర్చ, కిసాన్ మజ్దూర్ మోర్చకు చెందిన ప్రతినిధులతో కూడా అధికారులు సమావేశమయ్యారు. వైద్య సాయం పొందితే ఆరోగ్యం కుదుటపడుతుందని, అప్పుడు ప్రతిపాదిత సమావేశంలో పాల్గొనవచ్చునని దల్లేవాల్‌కు అధికారులు నచ్చచెప్పారు. అందుకు దల్లేవాల్ అంగీకరించారు. దల్లేవాల్‌కు సెలైన్ ఎక్కించి వైద్య సాయం అందిస్తున్న చిత్రాలను రైతులు విడుదల చేశారు.

ప్రతిపాదిత సమావేశం చండీగఢ్‌లోని మహాత్మాగాంధీ స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్‌లో ఫిబ్రవరి 14వ తేదీ సాయంత్రం ఐదు గంటలకు జరుగుతుంది. రైతులు నిరసన తెలుపుతున్న కన్నౌరిలో వ్యవసాయ శాఖ సంయుక్త కార్యదర్శి ప్రియ రంజన్ విలేకరులతో మాట్లాడుతూ క్షీణిస్తున్న దల్లేవాల్ ఆరోగ్య పరిస్థితిని దృష్టిలో పెట్టుకొని కేంద్రం ఉన్నత స్థాయి ప్రతినిధి బృందాన్ని పంపిందని చెప్పారు. చర్చలకు ఆహ్వానిస్తూ దల్లేవాల్, రైతు సంఘాలకు ఆయన లేఖలు కూడా రాశారు. ప్రతిపాదిత సమావేశంలో రైతులతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అధికారులు చర్చలు జరుపుతారని ఆయన తెలిపారు. పంట ఉత్పత్తుల కనీస మద్దతు ధరలకు చట్టబద్ధత కల్పించడం సహా వివిధ డిమాండ్లపై గత 11 నెలలుగా రైతు సంఘాల ఆధ్వర్యంలో అన్నదాతలు శంభు, కన్నౌరి సరిహద్దు పాయింట్ల వద్ద ఆందోళన సాగిస్తున్న విషయం తెలిసిందే.

'సాగే'దెట్లా?

(మొదటిపేజీ తరువాయి)

రైతులు, ప్రజలను సమీకరించి సమరశీల పోరాటం సాగించాయి. విజయం సాధించాయి. రాష్ట్ర ప్రభుత్వం నుంచి పెట్టుబడి సాయాన్ని సాధించింది. వరి ధాన్యం కొనేందుకు ఎక్కువ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసేలా సర్కారుపై వత్తిడి తెచ్చి తెలంగాణ రైతు సంఘం విజయం సాధించాయి. రైతు ఆత్మహత్యలకు నష్టపరిహారం, రైతు బీమా వంటి పథకాలను సాధించింది. భూములు కోల్పోయిన రైతులకు న్యాయం జరిగేలా న్యాయ పోరాటం చేసింది.

కాంగ్రెస్ హామీల్లో 'కౌలు రైతు' కీలకమైంది

గత బీఆర్ఎస్ ప్రభుత్వం కౌలు రైతును గుర్తించబోమంటూ తేల్చి చెప్పింది. కాంగ్రెస్ పార్టీ తన ఎన్నికల మ్యానిఫెస్టోలో కౌలు రైతును గుర్తిస్తామంటూ చెప్పింది. దీంతోపాటు రైతు రుణమాఫీ చేస్తామన్న కాంగ్రెస్ ప్రభుత్వం 60శాతం పూర్తి చేసింది. రైతు భరోసా ఎకరాకు ఐదు వేల ఉన్న దాన్ని రూ. 7500కు పెంచుతామంటూ ప్రకటించింది. రూ.6వేలకు మాత్రమే పెంచింది. వానాకాలానికైతే ఇవ్వనేలేదు. యాసంగికి ఇస్తామని ప్రకటించింది. కౌలు రైతుల విషయంలో నాన్చుడు దోరణి ప్రదర్శిస్తున్నది. సాగులో కౌలు రైతులు (25 లక్షల మంది) 35 శాతం ఉన్నారు. వారి పక్షాన తెలంగాణ రైతు సంఘం నికరంగా పోరాడుతున్నది. వారికి రుణార్హత కార్డులు ఇవ్వడం వల్ల బ్యాంకు రుణాలు, పెట్టుబడి సాయం, తమ పంటను అమ్ముకునే అవకాశం వంటి సౌకర్యాలు లభిస్తాయి.అందుకే కౌలు రైతుల గుర్తింపు కోసం కాంగ్రెస్ ప్రభుత్వంపై ఒత్తిడిపెంచబోతున్నది.

తెగిన గాలిపటంలా సాగు ప్రణాళిక

సాగు ఎటువైపు పోతుందో సర్కారుకు స్పష్టత లేదు. వ్యవసాయ ప్రణాళిక రూపొందించకపోవడంతో ఆహార సమతుల్యత ఏర్పడుతున్నది. పండ్లు, కూరగాయలను 60శాతం దిగుమతి చేసుకుంటున్నాం. 'ఏ పంట ఎంత విస్తీర్ణంలో వేయాలి. మన అవసరమెంత? రైతులకు ఏ విధంగా అవగాహన కల్పించాలి' అనే విషయాల్లో సర్కారుకు స్పష్టత లేదు. వ్యవసాయ అనుబంధ ఉత్పత్తులకు మద్దతు ధర లేదు. దానికి అనుబంధంగా కొన్ని పరిశ్రమలను స్థాపించాల్సిన అవసరమున్నది. కల్తీ, నకిలీ విత్తనాలతో రైతు మోస పోతున్నారు. ఎరువు, పురుగు మందులు ఎలా వాడాలో షాపు యాజమానులే చెబుతున్నారు.

శిక్షణ పొందిన అధికారులు మాత్రం ప్రేక్షకపాత్ర పోషిస్తున్నాడు. సాగు నీటి ప్రాజెక్టుల విషయంలో కూడా ప్రాధాన్యతా క్రమంలో నిర్మించాల్సి ఉన్నది. నారాయణ పేట- కోడంగల్ ఎత్తిపోతల పథకం తరహాలో వెనకబడిన ప్రాంతాల్లో సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేయాల్సి ఉంది. ఈ విషయంలో బీఆర్ఎస్ బాటలోనే కాంగ్రెస్ నడుస్తున్నదనే అభిప్రాయం వ్యక్తమవుతున్నది. ట్రిబుల్‌ఆర్ రోడ్డు నిర్మాణంలో భూములు కోల్పోతున్న రైతులకు రూ. 20 నుంచి రూ.25 లక్షల ఇచ్చి చేతులు దులుపుకోవాలని ప్రభుత్వం చూస్తున్నది. అక్కడ మార్కెట్ ధర కోటి రూపాయలు పలుకుతున్నది. ఈ సమస్యలన్నింటిపై రైతు సంఘం పోరాట కార్యాచరణ రూపొందిస్తున్నది.

సమగ్ర భూ సర్వేతోనే సమస్యలు పరిష్కారం

దశాబ్దాల క్రితం భూమికి హద్దులు నిర్ణయించారు. కాలక్రమేణా హద్దుల్లో ఎన్నో మార్పులు జరిగాయి. సమగ్ర భూ సర్వేతోనే పలు సమస్యలు పరిష్కారమవుతాయని తెలంగాణ రైతు సంఘం భావిస్తున్నది.

రికార్డులకు, భూ సరిహద్దులకు తేడాలు రావడంతో రైతు సమస్యలు పెరిగాయి. బీఆర్ఎస్ సర్కారు తెచ్చిన ధరణి పోర్టల్ నుంచి కాస్తుకాలమ్ తొలగించడంతో సమస్య మరింత జఠిలమైంది. రైతులు సాగు హక్కును కోల్పోయారు. రైతుల్లో అసంతృప్తి పెరిగింది. ఆత్మహత్యలు జరిగాయి. అధికారులపై దాడులు జరిగాయి. ఈ క్రమంలో కాంగ్రెస్ పార్టీ ధరణి పోర్టల్ రద్దు చేస్తామని ప్రకటించింది. అధికారంలోకి రాగానే ధరణి పోర్టల్ స్థానంలో భూ భారతి తెచ్చింది. కాస్తు కాలమ్‌ను పొందుపరించింది.

మద్దతు ధర సాధనకు ఐక్య ఉద్యమాలు
- టి. సాగర్, ప్రధాన కార్యదర్శి, తెలంగాణ రైతు సంఘం

(మొదటిపేజీ తరువాయి)

కోసం భూమి సేకరిస్తున్నది. కానీ పరిహారం విషయంలో మాత్రం నిర్లక్ష్యం చేస్తున్నది. వీటన్నింటిపై భవిష్యత్తులో రైతాంగ ఉద్యమాలు నిర్మిస్తాం.

రుణమాఫీ కాలే.. రైతుభరోసా రాలే

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్



కాంగ్రెస్ ఏడాది పాలనలో రాష్ట్రంలో 402 మంది రైతులు ఆత్మహత్యలకు పాల్పడ్డారని మాజీ మంత్రి హరీశ్‌రావు ఒక ప్రకటనలో విమర్శించారు. ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు రైతులకు శాపంగా మారాయని పేర్కొన్నారు. రైతులకు భరోసా కల్పించడంలో కాంగ్రెస్ సర్కారు పూర్తిగా విఫలమైందనీ, వరుసగా జరుగుతున్న ఆత్మహత్యలే అందుకు నిదర్శనమని వ్యాఖ్యానించారు. 24 గంటలు గడవకముందే రుణభారంతో ఆదిలాబాద్‌లో మరో రైతు రాథోడ్ గోకుల్ ఆత్మహత్య చేసుకోవడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోందని అన్నారు. "కేసీఆర్ వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చితే, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంక్షోభంలోకి నెట్టారు. రుణమాఫీ జరగకపోవడంతో రైతులు కలెక్టరేట్లు, వ్యవసాయ కార్యాలయాలు, బ్యాంకుల చుట్టూ తిరుగుతూ విసిగి పోతున్నారు. ఉన్న భూములు కుదవ పెట్టి అప్పుల పాలవుతున్నారు. వడ్డీలు, అసలు చెల్లించలేక చివరికి ఆత్మహత్యలు చేసుకుంటున్నారు" అని హరీశ్‌రావు ఆందోళన వ్యక్తం చేశారు. మరణించిన కుటుంబాలకు రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని డిమాండ్ చేశారు. రైతుల ఆత్మహత్యలు ముమ్మాటికి ప్రభుత్వ హత్యలేననీ, వాటికి సీఎం రేవంతే బాధ్యత వహించాలని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పినట్టుగా అందరికీ రుణమాఫీ, రైతు భరోసా, అన్ని పంటలకు రూ. 500 బోనస్ అమలు చేసే దాకా నిలదీస్తూనే ఉంటామని పేర్కొన్నారు. రుణమాఫీ కాలేదనీ, రైతు భరోసా రాలేదని ఆత్మహత్యలు చేసుకోవద్దని ఆయన రైతులకు విజ్ఞప్తి చేశారు. రేషన్ కార్డుల జారీలో కోతలు పెట్టబోమని ప్రభుత్వం ప్రకటించడాన్ని ఆయన స్వాగతించారు. అయితే అది ప్రకటనలకే పరిమితం కాకుండా ఆచరణలో అమలు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సర్కార్ రేషన్ కార్డుల విషయంలో తప్పిదాలకు పాల్పడితే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేపడుతామని హెచ్చరించారు.

మూడు గంటలు ఆలస్యంగా అమల్లోకి కాల్పుల విరమణ..



జెరూసలెం : ముగ్గురు బందీలను విడుదల చేయనున్నట్టు హమాస్ పేర్లు ప్రకటించడంతో కాల్పుల విరమణ ఒప్పందం ఆదివారం అమల్లోకి వచ్చింది. షెడ్యూల్ ప్రకారం మూడు గంటలు ఆలస్యంగా ఒప్పందం ప్రారంభమైంది. స్థానిక కాలమానం ప్రకారం .. ఉదయం 11.45 గంటలకు గాజాలో హమాస్‌తో సంధి ప్రారంభమైనట్టు ఇజ్రాయిల్ ఓ ప్రకటనలో తెలిపింది. 15 నెలలుగా గాజాపై ఇజ్రాయిల్ సాగిస్తున్న అమానుష మారణకాండను ఈ ఒప్పందం నిలువరించనుంది.

ఇజ్రాయిల్ కాల్పుల్లో 13 మంది మృతి

ఒప్పందం ఖరారైన చివరి నిమిషం వరకు ఇజ్రాయిల్ సైన్యం గాజాపై దాడులు చేస్తూనే ఉందని గాజా పౌర రక్షణ సంస్థ తెలిపింది. స్థానిక కాలమానం ప్రకారం .. ఉదయం 8.30 గంటల నుంచి ఇజ్రాయిల్ వైమానిక, ఫిరంగి దాడులు జరిపిందని, 13 మంది పాలస్తీనియన్లు మరణించారని పాలస్తీనా వైద్యులు తెలిపారు. ఇజ్రాయిల్ ప్రధాని నెతన్యాహూ ఆదేశాల మేరకే గాజా ప్రాంతంలో దాడి కొనసాగిస్తున్నట్టు సైన్యం పేర్కొంది. ఒప్పందం ప్రారంభం కావడానికి గంట ముందు విడుదల చేసిన ఓ ప్రకటనలో .. హమాస్ విడుదల చేయవలసిన బందీల జాబితాను ఇజ్రాయిల్ స్వీకరించే వరకు కాల్పుల విరమణ ఉండదని తాను సైన్యానికి సూచించినట్టు ప్రధాని కార్యాలయం తెలిపింది.

హైదరాబాద్‌లో భారీ ఐటీ పార్క్

(మొదటిపేజీ తరువాయి)

ఈ ఏడాదిలో ప్రారంభమై 2028 నాటికి పూర్తి కానుంది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, ఇన్వెస్ట్ మెంట్ ప్రమోషన్ స్పెషల్ సెక్రెటరీ విష్ణువర్ధన్‌రెడ్డి, సీఎంవో ప్రత్యేక కార్యదర్శి అజిత్‌రెడ్డి, క్యాపిటల్ ల్యాండ్ సీనియర్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మనోహర్ కియాతానీ తదితరులు పాల్గొన్నారు.

తప్పుదోవ పట్టిస్తున్న పతంజలి ప్రకటనలు

తిరువనంతపురం : ఆరోగ్య రక్షణ ఉత్పత్తులపై పతంజలి ఆయుర్వేద్ తప్పుదోవ పట్టించే ప్రకటనలు ఇస్తోందంటూ దాఖలైన ఫిర్యాదును పురస్కరించుకొని కేరళలోని పాలక్కడ్ జిల్లా కోర్టు బాబా రాందేవ్, ఆయన సన్నిహితుడు ఆచార్య బాలకృష్ణలపై బెయిలబుల్ వారంట్లు జారీ చేసింది. పతంజలి ఆయుర్వేద్ ఉత్పత్తులపై ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రకటనలు ఇస్తున్నారంటూ కేరళకు చెందిన ఓ వైద్యుడు మూడు సంవత్సరాల క్రితమే కేంద్రానికి ఫిర్యాదు చేశారు. ఆ తర్వాత కేరళలో పది, ఉత్తరాఖండ్‌లో ఒక కేసు నమోదైంది. కన్నూర్‌కు చెందిన ఆప్తమాలజిస్ట్ కేవీ బాబు దాఖలు చేసిన పలు ఫిర్యాదులను పురస్కరించుకొని కేరళ ఔషధ నియంత్రణ విభాగం రాష్ట్రంలోని తన కార్యాలయాలన్నింటికీ ఆదేశాలు జారీ చేసింది. 1954వ సంవత్సరపు డ్రగ్స్ అండ్ మ్యాజిక్ రెమిడీస్ (అభ్యంతరకర ప్రకటనలు) చట్టాన్ని ఉల్లంఘించినందుకు పతంజలిపై చట్టపరమైన చర్యలు చేపట్టాలని సూచించింది. కొన్ని పతంజలి ఆయుర్వేద ఉత్పత్తులు బీపీ, సుగర్ వ్యాధులను నయం చేస్తాయని, ఇతర ఆరోగ్య సమస్యలను కూడా తీరుస్తాయని వ్యాపార ప్రకటనలు ఇచ్చారు. అయితే ఇలాంటి ప్రకటనలు జారీ చేయడాన్ని డీఎంఆర్ చట్టం నిషేధిస్తోంది. కొన్ని ప్రత్యేక అనారోగ్యాలను నయం చేస్తామంటూ వాణిజ్య ప్రకటనలు ఇవ్వడం ఈ చట్ట ప్రకారం నేరం. హరిద్వార్ కోర్టు 2024 ఏప్రిల్ నుండి ఇప్పటి వరకూ రాందేవ్‌కు ఆరుసార్లు సమన్లు జారీ చేసిందని, అయితే ఈ విచారణల నుండి ఎలాంటి ఫలితం రాలేదని ఫిర్యాదుదారు బాబు చెప్పారు.



నైజీరియాలో పేలిన పెట్రోల్ ట్యాంకర్

అబూజ : ఉత్తర మధ్య నైజీరియాలో ఓ పెట్రోల్ ట్యాంకర్ పేలి దాదాపు 70మంది మరణించినట్టు అధికారులు శనివారం ధ్రువీకరించారు. నైజర్ రాష్ట్రంలోని సులేజా ప్రాంతంలో కొంతమంది జనరేటర్ ఉపయోగించి ఓ ట్యాంకర్ నుంచి మరో ట్యాంకర్‌లోకి పెట్రోల్ పంపు చేస్తున్న క్రమంలో ఈ పేలుడు జరిగింది. పెట్రోల్‌ను పంపు చేస్తున్న సిబ్బందితో పాటు చుట్టుపక్కల పదుల మీటర్ల దూరంలో ఉన్నవారు కూడా మరణించినట్టు నైజీరియా అత్యవసర ప్రతిస్పందన ఏజెన్సీ వెల్లడించింది. సహాయక చర్యలు కొనసాగుతున్నాయని తెలిపింది.

ఆఫ్రికా ఖండంలోనే అత్యంత జనాభా కలిగిన నైజీరియాలో సరుకు రవాణాకు సమర్థవంతమైన రైల్వే వ్యవస్థ లేకపోవడం వల్ల ఇలాంటి ప్రమాదాలు తరచుగా జరుగుతుంటాయి. గతేడాది సెప్టెంబర్‌లో నైజర్ రాష్ట్రంలో పెట్రోల్ ట్యాంకర్, ట్రక్కు ఢీకొనడం వల్ల దాదాపు 48మంది మృతిచెందారు. నైజీరియా ఫెడరల్ రోడ్ సేఫ్టీ లెక్కల ప్రకారం, 2020లో 1531 పెట్రోల్ ట్యాంకర్ ప్రమాదాలు సంభవించాయి. ఈ ప్రమాదాల్లో 535 మంది మరణించారు, 1142 మంది గాయపడ్డారు.

నవచిత్రం



మేర్లపాక గాంధీ, వరుణ్ తేజ్

క్రేజీ కాంబినేషన్‌లో..

వరుణ్‌తేజ్, దర్శకుడు మేర్లపాక గాంధీ కాంబినేషన్‌లో ఓ సినిమా రూపొందనుంది. ఈ భిన్న కలయికలో తెరకెక్కబోయే ప్రాజెక్ట్‌ను యువి క్రియేషన్స్, ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్‌టైన్‌మెంట్ భారీ స్థాయిలో నిర్మించనున్నాయి. వరుణ్ తేజ్ పుట్టినరోజు సందర్భంగా వరుణ్ తేజ్ నటించబోయే తన 15వ చిత్రానికి సంబంధించి మేకర్స్ అఫీషియల్ అనౌన్స్‌మెంట్ చేశారు. ఈ సందర్భంగా రిలీజ్ చేసిన పోస్టర్ అందరిలోనూ క్యూరియాసిటీని రైజ్ చేసింది.

పోస్టర్ ఒక ప్రత్యేకమైన కొరియన్ కనెక్షన్‌ను చూపిస్తుంది, దీనిలో ఫైర్ డ్రాగన్ లోగోతో కూడిన జాడి, మంటలతో చుట్టుముట్టబడి ఉంది. పోస్టర్ కొరియన్ టెక్స్ట్‌తో సీక్రెట్‌ని మరింత పెంచుతుంది. 'వెన్ హంటింగ్ టర్న్స్ హిలేరిస్' అనే ట్యాగ్ ప్రత్యేకంగా నిలుస్తుంది - ప్రేక్షకుల కోసం ఎంటర్టైనింగ్ అడ్వంచరస్ జర్నీని సూచిస్తుంది.


దర్శకుడు మేర్లపాక గాంధీ థ్రిల్స్, హ్యూమర్ బ్లెండ్ చేస్తూ అద్భుతమైన స్క్రిప్ట్‌ను రాశారు.

ఈ ఇండో-కొరియన్ హర్రర్ కామెడీ చిత్రంలో వరుణ్ తేజ్ యూనిక్ క్యారెక్టర్‌లో కనిపించనున్నాడని పోస్టర్, ట్యాగ్‌లైన్ చెప్పకనే చెబుతోంది.

'తొలి ప్రేమ' వంటి భారీ విజయం తర్వాత, ఆయన మరోసారి సంగీత దర్శకుడు తమన్‌తో కలిసి ఈ ప్రాజెక్ట్ చేస్తున్నారు. మార్చిలో ప్రొడక్షన్ ప్రారంభం కానుంది.

మిగిలిన నటీనటులు, సాంకేతిక సిబ్బందికి సంబంధించిన వివరాలు మేకర్స్ త్వరలో తెలియజేస్తారు.

అదృష్టంగా భావిస్తున్నా..



నరేష్ విజయ్‌కృష్ణ

'నా కెరీర్‌లో బీజీయస్ట్ ఇయర్ 2025. విభిన్న పాత్రలతో ఇటు థియేటర్‌లో అటు ఓటీటీలో ప్రేక్షకులను అలరించడం నా అదృష్టంగా భావిస్తున్నాను' అని నరేష్ విజయ్‌కృష్ణ అన్నారు.

నేడు (సోమవారం) ఆయన బర్త్ డే. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ, 'గత పదేళ్ళుగా యాక్టర్‌గా మళ్ళీ మెట్టు మెట్టు ఎదుగుతూ వస్తున్నాను. సినీ పరిశ్రమలో సక్సెస్ ఫుల్‌గా 52 ఏండ్లు పూర్తి చేసుకోవడం ఆనందంగా ఉంది. ఈ ఏడాది 'సంక్రాంతికి వస్తున్నాం' వంటి బిగ్ సక్సెస్‌తో స్టార్ట్ అయ్యాను. ప్రస్తుతం 9 సినిమాలు ఏకకాలంలో షూటింగ్‌లో ఉన్నాయి. ఇందులో రెండు లీడ్ రోల్స్ చేస్తున్నాను. నా పుట్టినరోజు సందర్భంగా రెండు పెద్ద కార్యక్రమాలు చేయబోతున్నాను. వాటిల్లో సినిమా మ్యూజియం, లైబ్రెరి అండ్ క్రియేటివ్ స్పేస్ ఫర్ యంగ్ పీపుల్. దీనిని ఘట్టమనేని ఇందిరా దేవి పేరుతో ప్రారంభించాం. అలాగే జంధ్యాల నా గురువు. ఆయన్ని చరిత్రలో ఒక భాగంగా ఉంచాలని జంధ్యాల పేరుతో డబ్బింగ్, పోస్ట్ ప్రొడక్షన్ థియేటర్‌ని ఆరంభించాం. దీంతోపాటు జంధ్యాలపై ఓ అద్భుతమైన పుస్తకం తయారు చేశాం. దీనికి సీనియర్ రైటర్ సాయినాథ్ సహకరించారు. ఈ పుస్తకాన్ని అమ్మ విజయనిర్మల పుట్టిన రోజు ఫిబ్రవరి 20న రవీంద్రభారతిలో ఘనంగా లాంచ్ చేస్తున్నాం. అలాగే ఈ ఏడాది ప్రతిష్టాత్మక విజయ కృష్ణ అవార్డ్‌ని అభిమానుల సమక్షంలో జయసుధకి ఇవ్వబోతున్నాం. జంధ్యాల వజ్రోత్సవ ఉత్సవాల సందర్భంగా యోగిబేర్ కలెక్టీవ్స్ వారి థియేటర్‌లో జంధ్యాల రాసిన రెండు నాటకాలతోపాటు ఆయన దర్శకత్వం వహించిన మూడు సినిమాలను, అలాగే విజయనిర్మల డైరెక్షన్ చేసిన మూడు సినిమాలను ప్రదర్శించనున్నారు' అని తెలిపారు.

'అగ్గిపుల్లే అలా గీసినట్టు'..



రుక్సర్ థిల్లాన్, కిరణ్ అబ్బవరం

హీరో కిరణ్ అబ్బవరం నటిస్తున్న కొత్త సినిమా 'దిల్ రూబా'. రుక్సర్ థిల్లాన్ హీరోయిన్.

ఈ చిత్రాన్ని శివమ్ సెల్యులాయిడ్స్, మ్యూజిక్ లేబుల్ సారెగమ నిర్మాణ సంస్థ ఏ యూడ్లీ ఫిలిం సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. రవి, జోజో జోస్, రాకేష్ రెడ్డి, సారెగమ నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు. విశ్వ కరుణ్ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమా ఫిబ్రవరి 14న వాలెంటైన్స్ డే సందర్భంగా గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రెడీ అవుతోంది. ఈ నేపథ్యంలో తాజాగా ఈ సినిమా నుంచి ఫస్ట్ సింగిల్ 'అగ్గిపుల్లే..'ను మేకర్స్ రిలీజ్ చేశారు. 'అగ్గిపుల్లే అలా గీసినట్టు, కోపంగా చూడకే కొట్టినట్టు, గాలి దుమారమే రేగినట్టు, ఆవేశమెందుకే నొక్కిపెట్టు...' అంటూ బ్యూటిఫుల్ మెలొడీతో సాగుతుందీ పాట. కిరణ్ అబ్బవరం, సామ్ సీఎస్ కాంబినేషన్‌లో వచ్చిన 'క' మూవీ సాంగ్స్ ఛాట్ బస్టర్స్ అయ్యాయి. ఈ నేపథ్యంలో ఈ చిత్ర ఆడియో మీద అందరిలోనూ హై ఎక్స్‌పెక్టేషన్స్ ఉన్నాయి. అలాగే 'క' వంటి బ్లాక్‌బస్టర్ తరువాత కిరణ్ అబ్బవరం నటిస్తున్న సినిమా కావడంతో కథపరంగా కూడా అంచనాలు తారా స్థాయిలో ఉన్నాయి. అందరి అంచనాలకు మించి ఈ సినిమా ఉంటుందనే దీమాని మేకర్స్ వ్యక్తం చేస్తున్నారు. ఓ వైవిధ్యమైన ప్రేమకథగా దీన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు. అలాగే దీన్ని ప్రేమికుల రోజు కానుకగా రిలీజ్ చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ చిత్రానికి ప్రొడక్షన్ డిజైనర్ - సుధీర్, ఎడిటర్ - ప్రవీణ్.కేఎల్, సినిమాటోగ్రఫీ - డానియేల్ విశ్వాస్, మ్యూజిక్ - సామ్ సీఎస్, నిర్మాతలు : రవి, జోజో జోస్, రాకేష్ రెడ్డి, సారెగమ, రచన, దర్శకత్వం - విశ్వ కరుణ్.

భారత్ చరిత్ర సృష్టించింది. ప్రథమ ఖోఖో ప్రపంచకప్‌లో టీమ్ ఇండియా చాంపియన్‌గా అవతరించింది. ప్రపంచ వ్యాప్తంగా 39 జట్లు పోటీపడిన ఉత్కంఠభరిత ప్రపంచకప్‌లో భారత మహిళల, పురుషుల జట్లు విజేతలుగా నిలిచాయి. అమ్మాయిలు నేపాల్‌ను చిత్తు చేయగా.. అబ్బాయిలు సైతం నేపాల్‌పై ఘన విజయం సాధించారు.

అమ్మాయిలు, అబ్బాయిలు ఖోఖో చాంపియన్స్

● అరంగేట్ర ప్రపంచకప్ టైటిల్స్ మన సొంతం ● ఖోఖో ప్రపంచకప్ 2025



నవతెలంగాణ-న్యూఢిల్లీ

ఖోఖో ప్రపంచకప్‌లో భారత్ అద్భుతం చేసింది. న్యూఢిల్లీ వేదికగా జరిగిన తొలి ప్రపంచకప్‌లో ఇటు అమ్మాయిలు, అటు అబ్బాయిలు విజేతలుగా నిలిచారు. ఆదివారం జరిగిన టైటిల్ పోరులో భారత మహిళల జట్టు 78-40తో నేపాల్‌పై ఘన విజయం సాధించింది. భారత పురుషుల జట్టు 54-36తో నేపాల్‌ను చిత్తు చేసింది. మెన్స్ ఫైనల్లో సూయాశ్ (భారత్) ఉత్తమ ఎటాకర్‌గా, మెహుల్ (భారత్) ఉత్తమ ఆటగాడి అవార్డులు అందుకున్నారు. మహిళల ఫైనల్లో అన్ను కుమారి (భారత్), చైత్ర బి (భారత్)లు ఉత్తమ ఎటాకర్, ఉత్తమ ప్లేయర్ అవార్డులు దక్కించుకున్నారు. ఖోఖో ప్రపంచకప్ విజేతలుగా నిలిచిన భారత జట్లకు సోషల్ మీడియా వేదికగా అభినందనలు వెల్లువెత్తాయి.

ఏకపక్షంగా కొట్టేశారు :

న్యూఢిల్లీలోని ఇందిరా గాంధీ స్టేడియంలో జరిగిన మహిళల ఫైనల్లో నేపాల్‌ను భారత్ చిత్తు చేసింది. నాలుగు క్వార్టర్ల ఆటలో తిరుగులేని ప్రదర్శన చేసింది. 78-40తో భారీ విజయం అందుకుంది. ఆరంభం నుంచి నేపాల్‌పై ఎదురుదాడి చేసిన అమ్మాయిలు.. నేపాల్ అమ్మాయిల బ్యాచ్‌ను మూడు సార్లు సింపుల్ టచ్‌తో అవుట్ చేసింది. కెప్టెన్ ప్రియాంక తొలి టర్న్‌లో అద్భుతంగా రన్ చేసింది. ఆఖరు వరకు ఆధిక్యం నిలుపుకోవటంతో పాటు ప్రత్యర్థిని కోలుకోలేని దెబ్బ కొట్టిన భారత్ 38 పాయింట్ల తేడాతో గెలుపొందింది.

పురుషుల విభాగం ఫైనల్లోనూ అదే ప్రదర్శన పునరావృతం అయ్యింది. అమ్మాయిల స్థాయిలో ఆధిపత్యం చెలాయించకపోయినా.. అద్భుత విజయమే అందుకున్నారు. నాలుగు టర్న్‌ల్లోనూ దుమ్మురేపిన టీమ్ ఇండియా సమర్థవంతంగా నేపాల్‌ను నిలువరించింది. 54-36తో సూపర్ విక్టరీ సాధించింది. మెహుల్, సుయాశ్‌లు అద్భుతంగా రాణించారు. ఖోఖో తొలి ప్రపంచకప్ లో మహిళల, పురుషుల విభాగాల్లో భారత్ చాంపియన్‌గా నిలువగా... రెండు విభాగాల్లోనూ నేపాల్ రన్నరప్‌తో సరిపెట్టుకుంది.

27 నుంచి తెలంగాణ జిల్లాల క్రికెట్ టోర్నమెంట్

పోస్టర్ ఆవిష్కరించిన ఎన్నారై డాక్టర్ సతీశ్ కత్తుల



హైదరాబాద్ : తెలంగాణ జిల్లాల అండర్-17 టీ20 క్రికెట్ టోర్నమెంట్ ఈ నెల 27 నుంచి ఆరంభం కానుంది. హైదర్‌గూడలోని తెలంగాణ జిల్లాల క్రికెట్ సంఘం (టీడీసీఏ) వ్యవస్థాపక అధ్యక్షులు, శాట్ మాజీ చైర్మెన్ అల్లీపురం వెంకటేశ్వర్ రెడ్డి నివాసంలో జరిగిన కార్యక్రమంలో ఎన్నారై వైద్యులు నాథ రమణ మూర్తి గోకుల, శ్రీనివాస్ రెడ్డిలతో కలిసి పోస్టర్‌ను ప్రముఖ అంకాలజిస్ట్, భారత సంతతి అమెరికా వైద్యుల సంఘం అధ్యక్షుడు సతీశ్ కత్తుల ఆవిష్కరించారు. 'తెలంగాణ జిల్లాల్లో క్రికెట్ అభివద్ధి చెందాలి. ఈ టోర్నమెంట్ నిర్వహణతో ప్రతిభావంతులైన క్రికెటర్లు వెలుగులోకి రానుండటం అభినందనీయం' అని సతీశ్ కత్తుల అన్నారు. అల్లీపురం వెంకటేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ..' ఈ టోర్నమెంట్‌లో ఉమ్మడి 9 జిల్లాలు సహా టీడీసీఏ ఎలెవన్ జట్లు పోటీపడుతున్నాయి. టోర్నమెంట్‌లో ప్రతిభ చూపిన క్రికెటర్ల నుంచి మూడు జట్లను తయారు చేస్తాం. మార్చి మూడో వారంలో అమెరికా క్రికెట్ అకాడమీ జట్టు ఇక్కడికి రానుంది. తెలంగాణ ఉమ్మడి జిల్లాల జట్లు, అమెరికా క్రికెట్ అకాడమీ జట్టుతో పోటీపడనున్నాయి. అంతర్జాతీయ స్థాయి పోటీతత్వం అనుభవం తెలంగాణ గ్రామీణ క్రికెటర్లకు దక్కనుంది' అని అన్నారు. తెలంగాణ జిల్లాల క్రికెట్ సంఘం ఖమ్మం, నాగర్‌కర్నూల్ జిల్లాల కన్వీనర్లు మహ్మద్ మతీఫ్, సురేందర్ రెడ్డి సహా కుమారస్వామి, బసివి రెడ్డి తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు

భారత జట్టు మేనేజర్‌గా దేవరాజ్!

చాంపియన్స్ ట్రోఫీలో కీలక బాధ్యతలు



హైదరాబాద్ : హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) కార్యదర్శి ఆర్. దేవరాజ్‌కు బీసీసీఐ కీలక బాధ్యతలు అప్పగించింది. 2025 ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీలో పోటీపడే భారత జట్టుకు టీమ్ మేనేజర్‌గా దేవరాజ్ వ్యవహరించనున్నాడు. ఫిబ్రవరి 19 నుంచి చాంపియన్స్ ట్రోఫీ ఆరంభం కానుంది. పాకిస్థాన్ పర్యటనకు భారత ప్రభుత్వం అనుమతి నిరాకరించటంతో టీమ్ ఇండియా మ్యాచులను దుబాయ్‌లో షెడ్యూల్ చేశారు. 1983 ప్రపంచకప్ సాధించిన భారత జట్టుకు హైదరాబాద్‌కు చెందిన మాన్‌సింగ్ టీమ్ మేనేజర్‌గా వ్యవహరించగా.. సుదీర్ఘ విరామం అనంతరం మరోసారి హెచ్‌సీఏ ఆఫీస్ బేరర్‌కు ఈ బాధ్యతలు దక్కటం పట్ల హైదరాబాద్ క్రికెట్ సంఘం హర్షం వ్యక్తం చేసింది.

త్వరలో మెట్రో మల్టీ లెవల్ పార్కింగ్ కాంప్లెక్స్

- 2వేల గజాల్లో 80-90కోట్లతో పీపీపీ విధానంలో ప్రాజెక్టు నిర్మాణం
- సుమారు 250 కార్లు, 200 టూవీలర్ పార్కింగ్‌కు అవకాశం
- సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించేందుకు ఏర్పాట్లు
- ఈ వారంలో ట్రయల్ రన్ నిర్వహించేలా అధికారుల ప్రయత్నాలు

ఏడేండ్ల తర్వాత నాంపల్లిలో 'ఎంఎల్‌పీ' అందుబాటులోకి..



నవతెలంగాణ-సిటీబ్యూరో

దేశంలో ఎక్కడాలేని విధంగా అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో హైదరాబాద్‌లోని నాంపల్లిలో అందుబాటులోకి తీసుకురానున్న ఆటోమేటెడ్, కంప్యూటరైజ్డ్ మల్టీ లెవల్ కార్ పార్కింగ్(ఎంఎల్‌పీ) పనులు దాదాపు పూర్తి కావొచ్చి ఎట్టకేలకు నగర ప్రజలకు అందుబాటులోకి వచ్చేస్తోంది. హైదరాబాద్ నాంపల్లిలో సుమారు అర ఎకరం స్థలంలో పబ్లిక్ ప్రయివేట్ పార్టనర్‌షిప్(పీపీపీ) విధానంలో రూ.80కోట్లకుపైనే ఖర్చు చేసి ఈ 15 అంతస్తుల భవనాన్ని నిర్మించారు. చిన్న చిన్న ప్యాచ్ పనులు రెండ్రోజుల్లో పూర్తి చేసి.. ఈ వారంలోనే ట్రయల్ రన్ నిర్వహించేలా మెట్రో అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. వచ్చే నెల మొదటి వారంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. కాగా ఈ పార్కింగ్ సదుపాయం అందుబాటులోకి వస్తే.. నగరంలో వాహన పార్కింగ్ సౌక్యరాల్లేక.. ఇబ్బంది పడుతున్న నగరవాసులకు కొంతమేర ఇబ్బందులు తొలిగిపోనున్నాయి. ముఖ్యంగా ఎగ్జిబిషన్ గ్రౌండ్‌కు, గాంధీభవన్, ఆ పరిసరా ప్రాంతాల్లోని ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చేవారికి సులువు కానుంది. ఇదిలావుంటే ఈ 'ఎంఎల్‌పీ'ని నిర్మాణానికి సంబంధించిన శంకుస్థాపన భూమి పూజను 2018 సెప్టెంబర్‌లో అప్పటి తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్.కె.జోషి, మెట్రో ఎండీ ఎన్వీఎస్ రెడ్డితో కలిసి నిర్వహించిన విషయం తెలిసిందే.

కరోనా ఎఫెక్ట్, ఇతర కారణాలతో పెరిగిన వ్యయం..!

నాంపల్లి మెట్రో రైల్ స్టేషన్‌కు కూతవేటు దూరంలో హెచ్ఎంఆర్ఎల్‌కు చెందిన అర ఎకరం స్థలంలో(2వేల గజాలు) 15 అంతస్తులుగా ఫ్రీ ఫ్యాబ్రికేటెడ్ విధానంలో మల్టీ లెవల్ పార్కింగ్ సముదాయాన్ని నిర్మిస్తున్న విషయం తెలిసిందే. ఇందులో 10 అంతస్తుల్లో వాహనాల పార్కింగ్ సౌకర్యం, అయిదు అంతస్తుల్లో కమర్షియల్ షాపులు, రెండు స్క్రీన్‌లతో కూడిన ఒక ఫిల్మ్ థియేటర్ ఉండనున్నాయి. మొత్తం 1,00,044 చదరపు అడుగుల నిర్మిత ఏరియాలో 68శాతం పార్కింగ్ కోసం, మిగిలిన 32శాతం వాణిజ్య సదుపాయాలకు కేటాయించారు. పార్కింగ్ జాగాలో 250 కార్లు, 200 ద్విచక్రవాహనాలు నిలిపే అవకాశముంది. పీపీపీ విధానంలో మెస్సర్స్ భారీ ఇన్‌ఫ్రా ప్రయివేట్ లిమిటెడ్ కంపెనీ 50 ఏండ్ల రాయితీ కాలంతో ఈ పార్కింగ్ కాంప్లెక్స్ నిర్మాణం చేపట్టింది.

అత్యున్నత సాంకేతిక పరిజ్ఞానంతో, మనుషుల ప్రమేయం లేకుండానే పార్కింగ్ వ్యవస్థ నిర్వహణ ఉంటుంది. ఇందుకోసం జర్మనీకి చెందిన పాలిస్ సంస్థ సహకారం తీసుకుంటున్నారు. ట్రాన్స్‌పోర్టర్, షటిల్, టర్బో లిఫ్ట్, టర్మినల్ వంటి నాలుగు రకాలుగా వాహనాలను పార్కింగ్ చేసే వ్యవస్థలు ఉంటాయి. అయితే మొత్తం రూ. 50-60 కోట్లతో పీపీపీ విధానంలో అందుబాటులోకి తెస్తామనుకున్నా.. ఈ ప్రాజెక్టు కాస్త.. కరోనా ప్రభావం, డెట్ ఫైనాన్సింగ్ సమస్యలు, గ్లోబల్ సప్లయ్ చైన్ అంతరాయాలు తదితర కారణాలతో రూ.80 నుంచి 90 కోట్లకు చేరినట్టు తెలుస్తోంది.

పార్కింగ్‌కు ఒక నిమిషం.. తిరిగి పొందడానికి 2 నిమిషాలు..!

మల్టీలెవల్ కార్ పార్కింగ్ కాంప్లెక్స్‌లోని గ్రౌండ్ ఫ్లోర్‌లో నాలుగు ఇన్ అండ్ అవుట్ టెర్మినల్స్.. వాహనాల నిలుపుదల కోసం టర్న్ టేబుల్ ఉంటుంది. ఈ టేబుల్‌పై వాహనదారుడు తమ వాహనాన్ని వదిలి, తమ నిర్దేశిత పనులకు హాజరుకావచ్చు. ఎంఎల్‌పీలోనికి వాహనం ప్రవేశించిన సమయంలో వాహనదారులకి స్మార్ట్‌కార్డు జారీ అవుతుంది. తరచూ ఎంఎల్‌పీని వినియోగించేవారికి 'ఆర్ఎఫ్ఐడీ' కార్డులు జారీచేయనున్నారు. వాహనదారులకి ఏ టెర్మినల్ కేటాయించినది ముందుగానే తెలియజేస్తారు. వాహనం కొలతలు ఆధారంగా కంప్యూటరైజ్డ్ పార్కింగ్ సిస్టమ్ ద్వారా వాహనాల వర్గీకరణ జరుగుతుంది. ఎస్‌యూవీ లేదా సెడాన్ వాహనానికి తగినట్టుగా పార్కింగ్ బేలు కేటాయించబడతాయి. ఆ తర్వాత ట్రాన్స్‌పోర్టర్ షటిల్ ఆ వాహనాన్ని లిఫ్ట్ ద్వారా నిర్ణీత అంతస్తులో కేటాయించిన స్థలంలో పార్క్ చేస్తుంది. ఈ మేరకు విశాలమైన, సౌకర్యవంతమైన టర్న్ టేబుల్స్ ఏర్పాటు చేశారు. ముంబయి, ఢిల్లీలో ఉన్న ఎంఎల్‌పీ పార్కింగ్ వ్యవస్థల్లో వాహనదారులు కొంత ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఆ పరిస్థితి ఇక్కడ ఉండదని మెట్రో అధికారులు చెబుతున్నారు. పార్క్ చేసిన వాహనాన్ని తిరిగి పొందడానికి, డ్రైవర్ పార్కింగ్ రుసుము చెల్లించి, పార్కింగ్ టిక్కెట్‌ను కార్డ్ రీడర్‌కు చూపగానే, ట్రాన్స్‌పోర్టర్-షటిల్ ఆటోమేటిక్‌గా కారును వాహనదారునికి అందజేస్తుంది. అదేవిధంగా డ్రైవర్ కారుని రివర్స్ తిప్పుకోవాల్సిన అవసరం లేకుండా అందజేస్తుంది. పార్కింగ్ కోసం కేవలం ఒక నిమిషం కంటే తక్కువ సమయం, తిరిగి పొందడానికి 2 నిమిషాలు మాత్రమే పట్టనుంది. ఇందులో ద్విచక్రవాహనానికి గంటలకు రూ.10, కారుకు రూ.25-30 వసూలు చేసే అవకాశం ఉందని మెట్రో అధికార వర్గాలు చెబుతున్నాయి.

ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల బరిలో 719 మంది అభ్యర్థులు

- కేజ్రీవాల్ స్థానంలో అత్యధికంగా పోటీ



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

దేశ రాజధాని ఢిల్లీలోని 70 అసెంబ్లీ స్థానాలకు 719 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. ఆప్ జాతీయ కన్వీనర్, మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ పోటీ చేస్తున్న న్యూఢిల్లీ నియోజకవర్గం నుంచి అత్యధిక సంఖ్యలో పోటీ చేస్తున్నారు. మొత్తం 1,040 నామినేషన్లు దాఖలయ్యాయి. ఉప సంహరణ గడువు తరువాత 981 నామినేషన్లను ఎన్నికల అధికారులు పరిశీలించారు. పరిశీలన అనంతరం 477 నామినేషన్లను తిరస్కరించారు. దీంతో 719 మంది అభ్యర్థులు ఎన్నికల బరిలో ఉన్నట్లు ఎన్నికల అధికారులు ప్రకటించారు. కాగా, ఇద్దరు ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రుల కుమారులైన బీజేపీకి చెందిన పర్వేష్ వర్మ (సాహిబ్ సింగ్ వర్మ కుమారుడు), కాంగ్రెస్‌కు చెందిన సందీప్ దీక్షిత్ (షీలా దీక్షిత్ కుమారుడు) న్యూఢిల్లీ స్థానంలో అరవింద్ కేజ్రీవాల్‌తో తలపడుతున్నారు. అయితే ఈ స్థానం నుంచి అత్యధికంగా అభ్యర్థులు పోటీలో ఉన్నారు. గరిష్టంగా నామినేషన్లు దాఖలయ్యాయి. మొత్తం 29 మంది అభ్యర్థులు 40 నామినేషన్లు దాఖలు చేశారు. చివరకు 23 మంది పోటీలో నిలిచారు. మరోవైపు పటేల్ నగర్, కస్తూర్బా నగర్ స్థానాల్లో అత్యల్పంగా 5 మంది అభ్యర్థులు ఎన్నికల బరిలో ఉన్నారు. ఫిబ్రవరి 5న ఢిల్లీలో ఒకే దశలో పోలింగ్ జరుగనున్నది. ఫిబ్రవరి 8న కౌంటింగ్ నిర్వహించి ఫలితాలు ప్రకటిస్తారు.

సైఫ్ అలీఖాన్‌పై దాడి కేసులో.. నిందితుడికి 24 వరకూ పోలీస్ కస్టడీ



ముంబయి : బాలీవుడ్ నటుడు సైఫ్ అలీఖాన్‌పై దాడి కేసులో అరెస్టు చేసిన వ్యక్తికి ముంబయి కోర్టు ఆదివారం ఐదు రోజుల పోలీస్ కస్టడీ విధించింది. అలీఖాన్‌పై దాడి కేసులో అంతర్జాతీయ కుట్ర కోణంపై దర్యాప్తు జరపాల్సి ఉందనే పోలీసుల వాదనను కోర్టు అంగీకరిస్తూ ఈ నెల 24 వరకూ కస్టడీకి అనుమతించింది. అలీఖాన్‌పై దాడి చేసిన వ్యక్తిగా అనుమానిస్తూ ఒక వ్యక్తిని ముంబయి పోలీసులు శనివారం థానేలో అరెస్టు చేశారు. ఆదివారం మధ్యాహ్నం 1:30 గంటలకు బాంద్రాలోని హలీడే కోర్టులో నిందితుడ్ని పోలీసులు హాజరపర్చారు. దాడికి పాల్పడిన వ్యక్తి బంగ్లాదేశ్ జాతీయుడని, అతని చర్య వెనుక ఉద్దేశాన్ని కనుగొనల్సి ఉందని పోలీసులు కోర్టుకు తెలిపారు. అంతర్జాతీయ కుట్రపై కూడా అనుమానం వ్యక్తం చేశారు. నిందితుడు 31 ఏండ్ల షరీఫుల్ ఇస్లాం షెహజాదా అని, ఇతను ఐదారు నెలలుగా ముంబయి, పరిసర ప్రాంతాల్లో నివసిస్తున్నాడని, ఇతని వద్ద భారత నివాసానికి సంబంధించిన ఎలాంటి సరైన ధ్రువీకరణ లేదని పోలీసులు మీడియాకు తెలిపిన సమాచారంలో వెల్లడించారు. భారత్‌లోకి ప్రవేశించిన తరువాత తన పేరును విజయ్‌దాస్‌గా మార్చుకున్నాడని, హౌస్ కీపింగ్ ఏజెన్సీలో పని చేస్తున్నాడని ముంబయి పోలీసులు తెలిపారు. ఇండ్లోకి చొరబడ్డం నిందితుడికి ఇదే మొదటిసారి చెప్పారు. నిందితుడ్ని అరెస్టు చేయడంలో ముంబయి పోలీసులకు ఒక లేబర్ కాంట్రాక్టర్ సహాయం చేసినట్లు ఒక అధికారి తెలిపారు. థానేలోని అటవీ ప్రాంతంలో ఉన్న ఒక లేబర్ క్యాంప్‌లో నిందితుడ్ని అదుపులోకి తీసుకున్నారు. గురువారం బాంద్రాలోని తన నివాసంలోనే సైఫ్ అలీఖాన్‌పై పలుమార్లు కత్తితో దాడి జరిగింది. ముంబయిలోని లీలావతి ఆస్పత్రిలో సైఫ్ చికిత్స పొందుతున్నాడు. ఐసీయూ నుంచి సాధారణ గదికి సైఫ్‌ను తరలించినట్టు వైద్యులు తెలిపారు. సైఫ్ ఆరోగ్య స్థితి నిలకడగానే ఉందని పోలీసులు చెప్పారు.

భూములిస్తే శానిటేషన్ వర్కర్లకు ఇండ్లు కట్టిస్తాం

- కేంద్రం పరిధిలో భూమి ఉంది : ప్రధాని మోడీకి కేజ్రీవాల్ లేఖ



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

కేంద్ర ప్రభుత్వం భూమి కేటాయిస్తే, ఢిల్లీ ప్రభుత్వం శానిటేషన్ వర్కర్లకు ఇండ్లు కట్టించి ఇస్తుందని ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం ప్రధాని మోడీకి అరవింద్ కేజ్రీవాల్ లేఖ రాశారు. ఢిల్లీలోని పారిశుధ్య కార్మికులు, ఇతర ప్రభుత్వ ఉద్యోగులకు సబ్సిడీపై భూమి కేటాయించాలని ఆ లేఖలో కోరారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ "పారిశుధ్య కార్మికులు మురికివాడల్లో నివసిస్తుండటం చూశాను. దీనిపై ప్రధానికి లేఖ రాశాను. ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఒక స్కీమ్ ప్రవేశపెట్టాలని కోరారు. ఆ పథకం కింద సబ్సిడీతో భూములను కేంద్రం కేటాయిస్తే అప్పుడు ఢిల్లీ ప్రభుత్వం వారికి ఇండ్లు కట్టించి ఇస్తుంది" అని కేజ్రీవాల్ తెలిపారు. తొలుత ఎన్‌డీఎంసీ, ఎంసీడీ పారిశుధ్య కార్మికులకు కేంద్రం భూమి కేటాయిస్తే, వారి వేతనాల నుంచి ఇన్‌స్టాల్‌మెంట్లుగా ఆ మొత్తాన్ని చెల్లించడం జరుగుతుందని చెప్పామని అన్నారు. ఇది పేద ప్రజలకు ఉద్దేశించిన పథకం అయినందున ప్రధాని అంగీకరిస్తారని ఆశిస్తున్నట్టు తెలిపారు. ఇది పూర్తయిన తర్వాత మిగతా ప్రభుత్వ ఉద్యోగులకు కూడా ఈ పథకాన్ని అమలు చేయవచ్చునని అన్నారు.

" ఎన్‌డీఎంసీ, ఎంసీడీ ఏరియాల్లో నివసిస్తున్న పారిశుధ్య కార్మికులకు సంబంధించి ప్రధాన అంశాన్ని మీ దృష్టికి తెస్తున్నాను. నగర పరిశుభ్రతలో ఈ పారిశుధ్య కార్మికులు కీలకంగా ఉన్నారు. ఉద్యోగంలో ఉన్నప్పుడు ప్రభుత్వం కేటాయించిన నివాసాల్లో ఉంటారు. అయితే రిటైర్మెంట్ తరువాత ఆ నివాసాలను విడిచిపెట్టాల్సి ఉంటుంది. వీరికి సొంతంగా ఇండ్లు కొనుక్కొనే స్తోమత కానీ, భారీ అద్దెలు చెల్లించగలిగే స్తోమత కానీ లేదు. భూములకు సంబంధించిన అంశం కేంద్ర పరిధిలోకి వస్తున్నందున, తగ్గింపు ధరలతో వారికి భూములు కేటాయించాలని కోరుతున్నాను. వారికిచ్చే ప్రభుత్వ జీతాల నుంచి ఇన్‌స్టాల్‌మెంట్స్‌గా ఆ మొత్తాన్ని కార్మికులు చెల్లిస్తారు. ఇందుకు సంబంధించిన పథకాన్ని ప్రారంభించి క్రమంగా దానిని ఇతర ఉద్యోగులకు కూడా విస్తరించాలని మిమ్మల్ని కోరుకుంటున్నాను. ఈ ప్రతిపాదనను మీరు అంగీకరించి కార్యాచరణ పథకాన్ని సిద్ధం చేస్తారని ఆశిస్తున్నాను" అని ప్రధానికి రాసిన లేఖలో కేజ్రీవాల్ పేర్కొన్నారు.

ఈ రిపబ్లిక్ డే చాలా ప్రత్యేకమైనది

- మన్ కీ బాత్‌లో ప్రధాని మోడీ



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

ఈసారి రిపబ్లిక్ డే చాలా ప్రత్యేకమైనదని ప్రధాని మోడీ అన్నారు. ఆదివారం మన్‌కీ బాత్ 118వ ఎపిసోడ్‌లో ఆయన మాట్లాడారు. దేశ రాజ్యాంగం అమలులోకి వచ్చి 75 ఏండ్లు పూర్తి అవుతున్న సందర్భంగా ఈ రిపబ్లిక్ డే చాలా ప్రత్యేక మైనదని పేర్కొన్నారు. రాజ్యాంగాన్ని మనకు అందించిన రాజ్యాంగ పరిషత్‌లోని గొప్ప వ్యక్తులందరికీ తలవంచి నమస్కరిస్తున్నానని అన్నారు. ఎన్నికల సంఘం ఎన్నికల ప్రక్రియను ఎప్పటికప్పుడు ఆధునీకరించి, పటిష్టం చేస్తోందని పేర్కొన్నారు. సాంకేతికతను ఉపయోగించి నిష్పక్షపాతంగా పోలింగ్ ప్రక్రియ నిర్వహిస్తుందని అన్నారు. యువత స్టార్టప్ సంస్థల వైపు ఆకర్షితులవుతున్నారని, దీనివల్ల స్టార్టప్ ఇండియా రూపుదిద్దుకుంటోందని తెలిపారు. సమాజంలోని పరిస్థితులు మారుతున్నాయని, దేశం డిజిటల్ యుగంలోకి ప్రవేశిస్తోందని అన్నారు.దేశాభివ ృద్ధిలో మహిళలు కీలక పాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు. ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న మహాకుంభ మేళా భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీక అని అన్నారు. ఈ కార్యక్రమం అన్ని ప్రాంతాల, వర్గాల ప్రజలను ఒక్కతాటిపైకి తీసుకొచ్చిందన్నారు.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State,
Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.

మూసీ ప్రక్షాళన కోసం

నేడు ప్రభుత్వ ఎజెండాగా..
మూసీ ప్రక్షాళన

సీపీఐ(ఎం) పోరుయాత్ర

ఫలించిన 180 రోజుల ఎర్రజెండా పోరాటం

మూసీ ప్రక్షాళనకై వెంటనే డీపీఆర్ ప్రకటించాలి : సీపీఐ(ఎం) యాదాద్రి భువనగిరి జిల్లా కార్యదర్శి ఎండీ జహంగీర్



నవతెలంగాణ-నల్లగొండ ప్రాంతీయ ప్రతినిధి

మూసీ వెంట మసిబారిన బతుకులను మార్చడానికి సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో 180 రోజుల పాటు సాగిన మూసీ ప్రక్షాళన పోరుయాత్ర, బస్సు యాత్ర పోరాట ఫలితమే.. నేడు కాంగ్రెస్ ప్రభుత్వ మూసీ ప్రక్షాళన ఎజెండా. మూసీ ప్రక్షాళనకై, ప్రత్యామ్నాయంగా గోదావరి-కృష్ణా జలాల సాధనకై యాదాద్రి భువనగిరి జిల్లావ్యాప్తంగా సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఉద్యమం జరిగింది. పలుమార్లు సెమినార్లు, చర్చాగోష్టులు జరిగాయి. సీపీఐ(ఎం) పోరుయాత్ర పేరుతో ఊరూరా సభలు, ఊరేగింపులు నిర్వహించి వేలాదిమందిని చైతన్యపరిచింది. లక్ష సంతకాల సేకరణ కోసం అనేక గ్రామాల్లో ఇంటింటికి వెళ్ళి సంతకాలు చేయించడంతో పాటు గ్రామాల్లో సామూహిక నిరసనలు చేపట్టారు. జిల్లాలో నిర్మిస్తున్న బస్వాపురం ప్రాజెక్టు నీటిని మూసీ కాల్వలోకి మళ్ళిస్తే కాలుష్యం నుంచి శాశ్వత విముక్తి లభిస్తుందని, దీనికనుగుణంగా ప్రభుత్వం సర్వే నిర్వహించాలని ఆపార్టీ డిమాండ్ చేసింది. ఈ సమస్యల పరిష్కారానికి జరిగే ఆందోళనా పోరాటాల్లో ప్రజలు మహోద్యమంగా కదిలి.. పాలకుల మెడలు వంచి మూసీ కాలుష్య ప్రక్షాళన సాధించుకోవాలనే లక్ష్యంగా ఎర్రజెండా ప్రజలకు అండగా నిలిచింది.

ఒకప్పుడు జిల్లాకు వరప్రదాయినిగా భావించిన మూసీనది నేడు దు:ఖదాయినిగా మారింది. వికారాబాద్ జిల్లా అనంతగిరి కొండల్లో పుట్టిన మూసీనది నల్లగొండ జిల్లా వాడపల్లి వద్ద కృష్ణానదిలో కలుస్తుంది. తెలంగాణలో పుట్టి తెలంగాణలోనే ముగించబడిన ప్రస్థానం మూసీది. హైదరాబాద్, రంగారెడ్డి, ఉమ్మడి నల్లగొండ జిల్లా ప్రజల గొంతు తడిపి బీడుబారిన భూములకు పచ్చదనాన్ని అందించింది. చారిత్రక అనుబంధం కలిగి ఈ ప్రజల జీవితాలతో పెనవేసుకొని పరవళ్లు తొక్కింది. మూసీనదికి ఐదు ఫీడల్ చానల్ ద్వారా పిల్లాయిపల్లి కాలువ, మూసీనది కాలువ, భీమలింగం కాలువ, ధర్మారెడ్డిపల్లి కాలువ, ఆసిఫ్ నగర్ కాలువతో ముడిపడి ఉంది. యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్, పోచంపల్లి, భువనగిరి, చౌటుప్పల్, వలిగొండ, రామన్నపేట, మోత్కూర్, ఆత్మకూర్‌తోపాటు నల్లగొండ జిల్లాలో చిట్యాల, నార్కట్‌పల్లి, కట్టంగూర్, నకిరేకల్, కేతేపల్లి, శాలిగౌరారం వరకు ఉంది. 40ఏండ్ల కింద ఎంతో స్వచ్ఛతను సంతరించుకున్న మూసీనీరు ఇప్పుడెందుకు కాలకూట విషంగా మారింది? దీనికి కారకులెవరు? పాలకుల బాధ్యత ఏమిటి? అని ప్రజలను చైతన్యవంతం చేసేందుకు 180 రోజులపాటు చెట్టు, పుట్ట, ఊరు, నగరం అని తేడా లేకుండా ప్రజలను చైతన్య పరిచేందుకు సీపీఐ(ఎం) పోరుబాట సాగింది. మూసీ కాలుష్యంతో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, ప్రబలుతున్న వ్యాధులకు కారకులు ఎవరు? ప్రశ్నలకు జవాబులు వెతకడమే కాదు, ఎదురు తిరిగి నిలదీయకుంటే ఈ ప్రాంత ప్రజల భవిష్యత్తు అంధకారమవుతుందని చాటిచెప్పింది.

కాలుష్యానికి కారణమిదే..

మూలాలను వెతికి ఎర్రజెండా పోరుబాట పట్టింది. ప్రతిరోజు మూసీలో వందలాది పరిశ్రమల వ్యర్థాలు, రసాయన పదార్థాలు కలుస్తున్నాయి. ఫార్మా కంపెనీలు ఇష్టానుసారంగా వదిలిన ఔషధవ్యర్థాలు, పటాన్ చెరు, జీడిమెట్ల, నాచారం పారిశ్రామిక ప్రాంత కెమికల్స్, మూసీ వెంట వెలిసిన కంపెనీల వేస్టేజీ మూసీలో కలుపుతున్నారు. అలాగే జనసాంద్రత కలిగిన హైదరాబాద్ నగరం మురికి నీరు, మానవ వ్యర్థాలు, డిటర్జెంట్ నీళ్ళు, చెత్తాచెదారంతో మూసీ తన ఉనికిని కోల్పోయి డంపింగ్‌యార్డుగా మారిపోయింది. రెండేండ్ల కింద దాదాపు 350 మిలియన్ల లీటర్ల కాలుష్యం మూసీలో కలిసేది. ఇప్పుడది క్రమంగా పెరిగి 1625 మిలియన్ లీటర్లకు చేరుకుంది. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో మూసీ నది కాలుష్య కేంద్రంగా మారింది. స్విట్జర్లాండ్‌కు చెందిన సంస్థ 'ఫార్మాస్యూటికల్ పొల్యూషన్ ఇన్ ది వరల్డ్- రివర్స్' పేరుతో అధ్యయనం చేసి 1405 దేశాల్లోని 258 నదుల్లో నీటి పరీక్షలు నిర్వహించింది. మనదేశంలోని యమున, మూసీ నదుల నీళ్ళను పరిశీలించి ప్రపంచంలోని డేంజరస్ నదుల్లో మూసీ 22వ స్థానంలో ఉన్నదని 'ది ప్రొసిడింగ్స్ ఆఫ్ ది నేషనల్ అకాడమి ఆఫ్ సైన్సెస్' అనే జర్నల్‌లో వివరాలు ప్రచురించింది. దాని ప్రకారం.. మూసీ నీటిలో 48 రకాల క్రియాశీలక ఔషధ పదార్థాల (ఏపీఐ) ఆనవాళ్ళు ఉన్నట్టు శాస్త్రవేత్తలు తమ పరిశోధనలో తెలిపారు. ద యాంటీ బయాటిక్స్ (బ్యాక్టీరియా ఇన్ఫెక్షన్లకు వాడే మందులు), యాంటీ డిప్రెసెంట్లు ఎక్కువ మోతాదులో ఉన్నాయని వెల్లడించారు. నీటిలో 0.3 మి.గ్రా. ఉండాల్సిన బయోకెమికల్ ఆక్సిడెంట్లు 172 ఎంజీ నుంచి 185 ఎంజీ వరకు చేరాయి. ఈ పరివాహక ప్రాంతంలో 70కి.మీ దాకా నీరు కలుషితమైంది. 40 లీటర్ల లోతుల్లో కాలుష్య కారకాలు ఉన్నాయి. అంతేకాదు, ఈ నీటి ద్వారా ప్రజారోగ్యం దెబ్బతిని రకరకాల క్యాన్సర్లు, కిడ్నీ జబ్బులు, చర్మ వ్యాధులు, గర్భస్రావాలు, ఆర్థరైటిస్, గొంతునొప్పి, కడుపునొప్పుతోపాటు అంతుచిక్కని వింత వ్యాధులతో వెలకట్టలేని నష్టం జరుగుతుందని సైంటిస్టులు తమ పరిశోధనల్లో తెలిపారు.

ఆరోగ్యం దెబ్బతింటున్నా.. జీవనాధారాన్ని వదలలేని పరిస్థితి

మూసీపైనే ఆధారపడిన బతుకులు ఒకవైపు తమ ఆరోగ్యం దెబ్బతింటున్నా పంటలు, భూములను వదిలివెళ్లలేక బతుకెళ్లదీస్తున్నారు. దశాబ్దాలుగా యాదాద్రి భువనగిరి జిల్లా ప్రజలు మూసీపై ఆనకట్టలు నిర్మించి.. పిల్లాయిపల్లి, ధర్మారెడ్డిపల్లి, బునాదిగాని, భీమలింగం, ఆసిఫ్‌నహర్ కాల్వల ద్వారా పంటలు పండించుకొంటున్నారు. ప్రధానంగా భూదాన్‌పోచంపల్లి, బీబీనగర్, భువనగిరి, చౌటుప్పల్, వలిగొండ, రామన్నపేట, ఆత్మకూరు, మోత్కూరు మండలాల్లో వందకుపైగా గ్రామాల్లో వరి, కూరగాయలు, ఆకుకూరలు పండిస్తున్నారు. పాడి పరిశ్రమ, మత్స్యసంపద కూడా ఇక్కడ జీవనాధారంగా ఉన్నది. అనేక అధ్యయనాల్లో తేలిన అంశాలను బట్టి పండించిన పంటలతో పాటు పాలు, మత్స్య సంపదలో కూడా పలు హానికరమైన విషపదార్థాలు ఉంటున్నట్టు తేలింది. క్రమేపీ ఈ ప్రాంతంలో పండిన పంటలు, చేపలు, వాడటానికి ప్రజలు భయపడుతున్న పరిస్థితి ఉంది. మూసీయేతర ప్రజలు ఈ పంటలను నిరాకరిస్తున్నారు. ఈ స్థితి రోజురోజుకు పెరుగుతుందే తప్ప తగ్గడం లేదు. ఈ పరిణామాలతో ప్రజల ఆరోగ్యమే కాకుండా ఆదాయమూ దిగజారుతున్నది.

నామమాత్రపు చర్యలతో చేతులు దులుపుకుంటున్న ప్రభుత్వాలు

ఇంత జరుగుతున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నామమాత్రపు చర్యలే తీసుకుంటున్నాయి. ప్రక్షాళన పేరిట హైదరాబాద్‌లో కొన్ని చోట్ల నీటి శుద్ధికేంద్రాలు పెట్టి చేతులు దులుపుకున్నాయి. నిత్యం 1500 మిలియన్ లీటర్ల మురుగు, మానవ వ్యర్థాలు వెలువడుతుంటే ఎస్‌టీపీల ద్వారా కేవలం 750 మిలియన్ లీటర్ల నీటినే శుద్ధి చేస్తున్నారు. మిగతా మురుగంతా మూసీలోనే కలుస్తుంది. ప్రజారోగ్యాన్ని తీవ్రంగా నష్టపరిచే భయానక రసాయనాలు మూసీలో కలుపుతున్న పరిశ్రమలపై కఠినచర్యలు తీసుకోకుండా పొల్యూషన్ కంట్రోల్ బోర్డు మొద్దు నిద్ర నటిస్తున్నది. మూసీపై పర్యవేక్షణ లేదు. యాదాద్రి భువనగిరి జిల్లాలో ఇప్పటి వరకు ఎక్కడా నీటి శుద్ధి కేంద్రాలు ఏర్పాటు చేయలేదు. మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ కూడా హైదరాబాద్ మేరకు పరిమితమై పనిచేస్తున్నది. అదికూడా ప్రక్షాళన వదిలి సుందరీకరణకు ప్రాధాన్యత ఇస్తున్నది. దీనివల్ల ఉపయోగం లేదు. ఇక కేంద్ర ప్రభుత్వం మూసీ ప్రాంత ప్రజల బతుకులను గాలికి వదిలేసి తమకు ఏమి పట్టనట్టుగా వ్యవహరిస్తోంది. నదుల ప్రక్షాళనకై ఎన్ఆర్‌సీపీ (జాతీయ నదుల సంరక్షణ ప్రణాళిక) జలశక్తి అభియాన్ లాంటి పథకాలు ఉన్నా మూసీ ప్రక్షాళనకు నయా పైసా విదల్చడం లేదు. తెలంగాణ మూసీ ఫ్రంట్ రూ. 8వేల కోట్ల ప్రతిపాదనలు పంపి ఏండ్లు గడుస్తున్నా నిధులు మంజూరు చేయకుండా కేంద్రం మాటలతో కాలయాపన చేస్తున్నది. ప్రతియేటా కేంద్ర బడ్జెట్‌లో నేషనల్ మిషన్ ఫర్ క్లీన్ గంగా (ఎన్ఎంసీజీ) పేరుతో గంగా ప్రక్షాళనకు వేలకోట్ల రూపాయలు కేటాయిస్తున్న ప్రభుత్వం మూసీపై ఎందుకు వివక్ష చూపిస్తుందో కేంద్రాన్ని నిలదీయాల్సి ఉంది. తెలంగాణ ప్రాంత బీజేపీ ఎంపీలు, నేతలు మూసీ ప్రక్షాళనపై సమాధానం చెప్పాలి.

ప్రజలు ఏమి అనుకుంటున్నారు...

సీపీఐ(ఎం) సుదీర్ఘ పోరాట ఫలితంగా కనువిప్పైన ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం మూసీ ప్రక్షాళన ప్రాజెక్టు చేపడ్తామని ప్రకటించింది. మూసీ పరివాహక ప్రాంతంలో ఏండ్ల తరబడి నివాసం ఉంటున్న పేద, బడుగు, బలహీన వర్గాలపై హైడ్రా పేరుతో కూల్చివేతలు మొదలుపెట్టింది. మూసీ ప్రక్షాళన జరుగుతుందా? లేక సుందరీకరణపై దృష్టి కొనసాగుతుందా అనే సందేహం ప్రజల్లో నెలకొంది. హైదరాబాద్‌లో మూసీ చుట్టూ ఏండ్ల తరబడి దశాబ్దాల కాలంగా నివాసం ఉంటున్న పేద ప్రజలను తరిమి ఆ ప్రాంతంలో రిసార్ట్స్ నిర్మాణం, పార్కులు, వాకింగ్‌ట్రాక్‌లు, సైకిలింగ్ ట్రాకులు.. నిర్మించాలన్న తపనతో అడుగులు ముందుకు వేస్తున్నట్టు కనిపిస్తుంది. సుందరీకరణ కన్నా ప్రక్షాళనపై ప్రేమ ఉంటే వెంటనే మూసీపై డీపీఆర్‌ను ప్రకటించి ప్రభుత్వం అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసి నిధులు కేటాయించాలని ప్రతిపక్ష పార్టీలు కోరుతున్నాయి.

మూసీ ప్రక్షాళనకు వెంటనే డీపీఆర్ ప్రకటించాలి



సీపీఐ(ఎం) పోరాట ఫలితంగా కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే మూసీ ప్రక్షాళనకై డీపీఆర్‌ను ప్రకటించి అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలి. మూసీ ప్రక్షాళన చేస్తున్నామని చెప్పడం తప్ప కార్యాచరణ లేదు. మల్లన్న సాగర్ ద్వారా 5 టీఎంసీల నీటిని హైదరాబాద్‌కు తరలించి హిమాయత్ సాగర్, గండిపేట చెరువులు నింపి కింది ప్రాంతాలకు కృష్ణా, గోదావరి నీటిని ఇస్తామని ప్రభుత్వం చెబుతుంది కానీ ఇప్పటివరకు స్పష్టత లేదు. మూసీ ప్రక్షాళన పేరుతో హైదరాబాద్‌లో 10 కి.మీ ప్రక్షాళన చేసి వదిలేస్తామంటే ఊరుకునేది లేదు. యాదాద్రి జిల్లా పరిస్థితి ఏంటనేది ప్రశ్నగా మారింది. ఇప్పటి వరకు ప్రభుత్వానికి ప్రణాళిక లేదు, నిధులు కేటాయించిన దాఖలాలు లేవు. మూసీనది కలుషితం చేస్తున్న పరిశ్రమలపై నేటివరకు చర్యలు తీసుకోలేదు. కనీసం నోటీసులు కూడా జారీ చేయలేదు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఎన్ని ఎస్టీపీలు మురుగునీటిని శుద్ధి చేసేందుకు ఏర్పాటు చేస్తారో స్పష్టం చేయాలి. మూసీ పరివాహక ప్రాంతంలో నివసిస్తున్న వారి కోసం బీబీనగర్ ఎయిమ్స్‌లో ప్రత్యేక విభాగం ఏర్పాటు చేయాలి. పాలకుల నిర్లక్ష్యానికి గురై ప్రజల ఆరోగ్యం, పంటలు నష్టపోయిన వారికి ప్రత్యేకంగా నిధులు కేటాయించాలి. మూసీ పరివాహక ప్రాంతాన్ని స్పెషల్ జోన్‌గా గుర్తించి అభివృద్ధి చేయాలి. బసవపురం వేగంగా పూర్తి చేసి మూసీ పరివాహక ప్రాంత కాలువలను గోదావరి నది నీటితో అనుసంధానం చేయాలి. లేకుంటే ప్రజల పక్షాన సీపీఐ(ఎం) మరోసారి పోరాటం చేస్తుంది.

-ఎండీ జహంగీర్, సీపీఐ(ఎం) యాదాద్రి భువనగిరి జిల్లా కార్యదర్శి

ప్రభుత్వ రంగంలోనే విశాఖ ఉక్కు

- శాశ్వత పరిష్కారం కోసం చర్యలు తీసుకోవాలి : ముఖ్యమంత్రికి సిపిఎం లేఖ



అమరావతి : విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలో కొనసాగేలా శాశ్వత పరిష్కారం కోసం చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వానికి సిపిఎం రాష్ట్ర కమిటీ కోరింది. ఈ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు ఆదివారం లేఖ రాశారు. స్టీల్‌ప్లాంట్‌కు అవసరమైన తక్షణ సాయంగా రూ.11,400 కోట్ల ప్యాకేజీని కేంద్ర ప్రభుత్వం ప్రకటించడాన్ని స్వాగతిస్తున్నామని, అయితే ఇది తాత్కాలిక ఉపశమనం మాత్రమేనని తెలిపారు. శాశ్వత పరిష్కారం దిశగా ఇది మొదటి అడుగు అని, స్టీల్‌ప్లాంట్ నిలదొక్కుకోవాలంటే మరికొన్ని చర్యలు తీసుకోవాలని కోరారు.

సెయిల్‌లో విలీనం చేసి దీనికి శాశ్వత పరిష్కారం చూపాలన్నది ప్రజల వాంఛ అని వివరించారు. కేంద్ర ఉక్కుశాఖ మంత్రి కుమారస్వామి ఈ అంశం భవిష్యత్తులో ఆలోచించాలని అన్నారని, అయితే, వెంటనే సెయిల్‌లో విలీనం చేయడం ద్వారా పెట్టుబడి, మార్కెట్, గనుల సమస్యలు పరిష్కారమవుతాయని సూచించారు. ఈ విషయంపై కేంద్ర ప్రభుత్వంలో ఉన్న పలుకుబడిని ఉపయోగించి సెయిల్‌లో విలీనం జరిగే విధంగా చూడాలని చంద్రబాబును కోరారు. విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ స్థిరంగా లాభాలతో నడవాలంటే దానికి సొంత గనులు కావాలని తెలిపారు. ఇంతవరకు ప్రారంభమే కాని ఆర్సిలార్ మిట్టల్ ఫ్యాక్టరీకి కూడా గనులు కేటాయించాలని కేంద్రాన్ని కోరిన విషయాన్ని ప్రస్తావించారు. పైపులైన్ ద్వారా సరఫరా జరిగేందుకు వీలుగా సొంత పోర్టును కూడా అనుమతించారని పేర్కొన్నారు.

మరి విశాఖ ఉక్కుకు ఎందుకు గనులు కేటాయించరన్న ప్రశ్న ప్రజల్లో ఉదయిస్తున్నదని తెలిపారు. గనులు కేటాయించ కుండా సంక్షోభం నుంచి బయటపడటం కష్టమని ముఖ్యమంత్రికి కూడా తెలుసునని, కావున కేంద్ర ప్రభుత్వం తక్షణం గనులు కేటాయించే విధంగా పలుకుబడిని ఉపయోగించాలని కోరారు. ప్యాకేజీ ప్రకటించడంతోపాటు విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ సమస్యపై కేంద్ర ప్రభుత్వం ఇంతవరకు ప్రకటన చేయలేదని పేర్కొన్నారు. నాలుగేళ్లుగా కార్మికుల ఆందోళనకు ముగింపు పలకాల్సి ఉందని అన్నారు. రాష్ట్రంలో ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా ప్రజాభీష్టానికి అనుగుణంగా ప్రైవేటీకరణను వ్యతిరేకించా యని తెలిపారు. ఈ ప్రతిపాదనను కేంద్ర ప్రభుత్వం ఉపసంహరించుకోకుండా ప్రైవేటీకరణ ప్రమాదం తొలగిపోదని వివరించారు. 32 మంది ప్రాణ త్యాగాలతో ఏర్పడిన విశాఖ ఉక్కు ఆంధ్రుల హృదయ స్పందనకు చిహ్నమని తెలిపారు. ప్రజల మనోభావాలను పరిగణనలోకి తీసుకుని రాష్ట్ర ప్రభుత్వం తన యావత్ పలుకుబడిని ఉపయోగించి ప్రైవేటీకరణ నిర్ణయాన్ని కేంద్ర కేబినెట్ ఉపసంహ రించుకునే విధంగా చూడాలని కోరారు. నష్టాల నుంచి గట్టెక్కి ఇది ముందుకు నడవాలంటే అదొక్కటే అంతిమ పరిష్కారమని విజ్ఞప్తి చేశారు. ప్యాకేజీ పేరుతో సిబ్బంది కుదింపును ఆమోదించొద్దని కోరారు. వలంటరీ రిటైర్‌మెంట్ స్కీం ఉపసంహరింప చేసి, కాంట్రాక్టు వర్కర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. అప్పుడే ఉత్పత్తి, ఉత్పాదకత పెరుగుతుందని, కార్మికులకు, ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలబడాలని కోరారు.

ఏపీ ప్రభుత్వ పాలసీల్లో 'ప్రపంచబ్యాంకు'

పెట్టుబడులు, కార్పొరేట్లకు అడ్డు లేకుండా లైన్ క్లియర్





విజయవాడ : తెలుగుదేశం కూటమి ప్రభుత్వ పాలనలో అన్నిటిలోనూ ప్రపంచబ్యాంకు విధానాలు గోచరిస్తున్నాయి. స్వర్ణాంధ్ర విజన్ 2047, వివిధ రంగాలపై తీసుకొచ్చిన సుమారు 22 పాలసీల్లో గతంలో ప్రపంచబ్యాంకు ఏదైతే చెప్పిందో వాటిని మళ్లీ వేర్వేరు రూపాల్లో తిరిగి తెస్తోంది. ప్రభుత్వ రంగాన్ని, ఉద్యోగులను కుదించడం, సంక్షేమాన్ని వదిలేసి యూజర్ ఛార్జీలు వసూలు చేయడం ఇలాంటి వాటిని కొత్తగా పాలసీలు, విజన్ పేరుతో అమలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సన్నద్ధమవుతోంది. రెగ్యులేటరీ కమిషన్లు, ప్రైవేటీకరణకు వీలుగా ప్రత్యేక వ్యవస్థలు ఏర్పాటు చేయనున్నారు. ముఖ్యంగా విద్యుత్, నీటిని వ్యాపారం చేయడం, అడిగిన వారికి భూములు అప్పగించడం, పట్టణ ప్రాంతాల్లో పెద్దపెద్ద వ్యాపార సంస్థలకు అనువుగా అర్బన్ ల్యాండ్ సీలింగ్ చట్టాన్ని సవరించడం, వ్యవసాయంలో యాంత్రీకరణ పెంచడం, ప్రభుత్వ ఉద్యోగాల సంఖ్యను తగ్గించడం, విదేశీ వ్యాపార సంస్థలకు ఎటువంటి అడ్డంకులూ లేకుండా చేయడం వంటి అంశాలున్నాయి. మరీ ముఖ్యంగా వ్యవసాయ భూములను పారిశ్రామిక ప్రాంతాలుగా మార్చడం, ఆహార పంటల స్థానంలో వాణిజ్య పంటలు పెంచడం, ప్రకృతి వ్యవసాయం పేరుతో ఆహార ఉత్పత్తులను తగ్గించడం(శ్రీలంక గతపాలసీ) ఇవన్నీ కూడా దండలో దారంలా ఒకదానికొకటి పెనవేసుకుపోయి ఉన్నాయి.

కొత్తగా తీసుకొచ్చే పాలసీల్లో లక్షల మందికి ఉపాధి కల్పన ఉంటుందని పేర్కొంటున్నారు. అదే సమయంలో ఉత్పాదకతలో సాంకేతికతను పెంచాలని ప్రతిపాదించారు. ఆధునీకరణ పేరిట ఇప్పటికే ఉన్న ఉపాధి పోతుంటే కొత్త ఉపాధి వస్తుందని మభ్యపెట్టడం తప్ప మరొకటి కాదు. వ్యవసాయంలో యాంత్రీకరణ, పారిశ్రామిక ఆధునీకరణ ఇందులో భాగమే. 2000 సంవత్సరంలో చంద్రబాబు తీసుకొచ్చిన సంస్కరణల్లో భాగంగా ఉద్యోగాలను ప్రైవేటుపరం చేయడం ద్వారా ఖర్చును తగ్గించుకోవాలని చూసింది. ఇప్పుడు ఇదే పద్ధతిని అమల్లోకి తీసుకువస్తున్నారు. ప్రభుత్వం ప్రైవేటు ఇండస్ట్రియల్ పార్కులు తెచ్చి రైతులు నేరుగా వారికి భూములు అప్పగించొచ్చనీ ప్రకటించడమే కాకుండా రాయితీలూ ఇస్తామని ప్రభుత్వం చెబుతున్నది. గతంలో తీసుకొచ్చిన సరళీకరణ విధానాల్లో పారిశ్రామిక అవసరాలకు తగిన విధంగా భూములు కేటాయింపులు జరపాలనేది కీలకమైన షరతు. దీన్ని ఇప్పుడు పాలసీ రూపంలో ముందుకు తీసుకొచ్చారు.

రాష్ట్రంలో వందకోట్ల పైబడి విలువైన కంపెనీలు ప్రభుత్వ లెక్కల ప్రకారమే 2800కిపైగా ఉన్నాయి. ఒకవైపు కార్పొరేట్లకు రాయితీలు కల్పిస్తూ ప్రజలకు సహజ ఆదాయవనరుగా ఉన్న భూమిని మాత్రం ఎవరి చేతి నుండి వారే నేరుగా కార్పొరేట్ల చేతుల్లో పెట్టే విధంగా చట్టాల్లో మార్పులు తీసుకొస్తున్నారు. 2013 భూసేకరణ చట్టానికి రాష్ట్రంలో 2018లో సవరణలు తీసుకొచ్చారు. అంతకుముందే 2009లో ల్యాండ్ రిఫార్మ్స్ సవరణ చట్టాన్ని తీసుకొచ్చారు. ఇవి చాలదన్నట్లు ఇటీవల నెగోషియబుల్ పాలసీ తీసుకొచ్చారు. ఇంకొంచం ముందుకెళ్లి రీసెటిల్‌మెంట్ పాలసీని పరిచయం చేస్తున్నారు. ఈ మొత్తం పాలసీలన్నిటిలోనూ భూములను అడిగిన వారికి కోరుకున్నతంత కట్టబెట్టడమే ప్రధానంగా ఉంది.

పరిశ్రమలకు అవసరమైన విద్యుత్ ఉత్పత్తికి అవసరమైన ప్లాంట్లను కూడా ప్రైవేటు భూముల్లోనే ఏర్పాటు చేసేందుకు మరో పాలసీ తీసుకొచ్చారు. దీనికి గ్రీన్ ఎనర్జీ అని పేరు పెట్టారు. పెద్దఎత్తున విద్యుత్ ఉత్పత్తి పెరిగిందని, ఆదా చేస్తున్నామని చెబుతూనే బయట మార్కెట్ నుండి అదనపు ధరకు విద్యుత్ కొనుగోలు చేసి ఆ భారాన్ని ప్రజలపై ట్రూఅప్, ఎఫ్‌పిపిఎస్ఏ పేరుతో వేస్తున్నారు. గత 10 సంవత్సరాల కాలంలో విద్యుత్ ప్లాంట్లకు రాష్ట్ర వ్యాప్తంగా 1.20 లక్షల ఎకరాలు కట్టబెట్టారు. వాటిని తీసుకున్న వారు మాత్రం తాకట్టు పెట్టి కోట్ల రూపాయలు రుణాలు తీసుకుంటున్నారు.

ఇక నీటి అవసరాలు తీర్చే పేరుతో తొలిసారిగా జలవనరుల ప్రాజెక్టుల్లో ప్రైవేటు పెట్టుబడులను ఆహ్వానించినట్లు వాటర్ పాలసీలో పేర్కొన్నారు. నీటి రెగ్యులేటరీ కమిషన్ ఏర్పాటు చేయనున్నారు. ఇప్పుడు విద్యుత్‌లాగే ఇక నీటికి కూడా వినియోగ ఖర్చు ప్రాతిపదికగా డబ్బు వసూలు చేస్తారు. చంద్రబాబునాయుడు తొలిసారి సంస్కరణలు అమలు చేసిన సమయంలో విద్యుత్‌తోపాటు నీటిని కూడా వినియోగ వస్తువుగా మార్చాలనేది కీలకాంశంగా పేర్కొన్నారు. 2008లోనే అన్ని పట్టణ ప్రాంతాల్లో మీటర్ల ద్వారా నీటిని సరఫరా చేయాలని తీర్మానాలు చేయించారు. దాని ఫలితంగా పట్టణ ప్రాంతాల్లో నీటి మీటర్లు బిగించారు. వీటి నిర్వహణ పేరుతో రెగ్యులేటరీ కమిషన్ ఏర్పాటు చేసి నీటి వ్యాపారాన్ని స్థిరీకరించనున్నారు. అంటే ప్రైవేటు వ్యక్తులు కట్టే ప్రాజెక్టులు రైతుల కోసమా వ్యాపారం కోసమా అనేది ఇట్టే అర్థం చేసుకోవచ్చు.

ఫుడ్ ప్రాసెసింగ్ పేరుతో నీటిని తక్కువగా వినియోగించే హార్టికల్చర్ సాగును ప్రోత్సహించాలని మరో పాలసీని తీసుకొచ్చారు. ప్రపంచబ్యాంకు, ఐఎంఎఫ్ షరతులు అమలు చేసిన శ్రీలంక, బంగ్లాదేశ్ ఆహార సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నాయి. ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలనేది అందులో కీలక షరతు. అలాగే ఆహార ఉత్పత్తులు తగ్గించి ప్రాసెసింగ్‌కు అవసరమైన పంటలు పండించడం షరతుల్లో కీలకమైంది. ఇప్పుడు ఈ షరతునే పాలసీ రూపంలో ముందుకు తీసుకొచ్చారు. దీనివల్ల ఆహార ఉత్పత్తులు తగ్గి ఆహార సంక్షోభం ఏర్పడటం, అది ఆర్థిక సంక్షోభాన్ని సృష్టించడం అర్జెంటైనాతోపాటు అనేక దేశాల్లో ఎదుర్కొన్న ప్రధాన సమస్య. 2017లో తీసుకొచ్చిన ఆధునిక యాంత్రీకరణ విధానం కూడా ప్రపంచబ్యాంకు షరతుల్లో భాగమే. చిన్న కమతాలను తగ్గించి కార్పొరేట్ వ్యవసాయం చేయడం కోసం ఈ షరతును బలవంతంగా రుద్దింది. అభివృద్ధి చెందిన దేశాల్లో అమలవుతున్న ఈ పద్ధతి మనలాంటి అభివృద్ధి చెందుతున్న దేశాల్లో అదీ చిన్న కమతాలున్న చోట సాధ్యం కాదు. చిన్న కమతాలను తగ్గించడమంటే రైతులను, వాటిపై ఆధారపడి బతుకుతున్న వారికీ ఉపాధి లేకుండా చేసి బయటకు తరిమి వేయడమే !

ఇంటికొక్కరు ఎంటర్‌ప్రెన్యూర్ కావాలని కొత్త పల్లవి. ఒకవైపు పెద్దపెద్ద కంపెనీలతో ఉపాధి వస్తుందని చెబుతూనే మరోవైపు ఎవరికివారే ఎంటర్‌ప్రెన్యూర్ అనడం అర్థం కాని విషయంగా మారింది. భవిష్యత్‌లో ఉద్యోగాలు ఎవరికివారే చూసుకోవాలనే విధంగా చెబుతున్నారు. 2006లో కేంద్రం ప్రపంచబ్యాంకు నిధులతో తీసుకొచ్చిన జవహర్‌లాల్ నెహ్రూ నేషనల్ అర్బన్ రెన్యువల్ మిషన్(జెఎన్ఎన్‌యుఆర్ఎం) పథకం అప్పట్లో నిధులిచ్చే సమయంలో అర్బన్ రిఫార్మ్స్(పట్టణ సంస్కరణలు) తీసుకొచ్చింది. దీనిలో కీలకమైంది. ప్రతిపనికీ యూజర్‌ఛార్జీ వసూలు చేయడం, ప్రతిసేవకూ లెక్కగట్టి ఛార్జీలు వసూలు చేయడం. అందులో భాగంగానే యూజర్ ఛార్జీలు, ఆస్తివిలువ ఆధారిత పన్నులు, వీధిలైట్ల నిర్వహణ ప్రైవేటీకరణ, శానిటేషన్ ఖర్చులు వసూలు చేయడం, తాగునీటికి ఛార్జీలు, డిఅండ్ఓ ట్రేడ్ లైసెన్సులు పెంచడం, కాలనీ అసోసియేషన్లు ఇవన్నీ కూడా సంస్కరణల్లో భాగమే వాటినే ఇప్పుడు కొత్తగా అమలుకు సిద్ధమయ్యారు. ప్రభుత్వం పూర్తిగా తన బాధ్యతల నుండి తప్పుకుని ప్రజలే పాలించుకుని, వారే పన్నులు విధించుకుని వారే నిర్వహించుకునే విధంగా షరతులు పెట్టింది. వాటిని ఇప్పుడు అన్ని పాలసీల్లో అమలు చేస్తున్నారు.

మారిటైం పాలసీ పేరుతో సముద్రతీరం మొత్తం ప్రైవేటు వ్యక్తులకు అప్పగించే విధానాలు రూపొందిస్తున్నారు. ఇప్పటికే పోర్టులు, తీర ప్రాంత రోడ్లు అదానీ చేతుల్లోకి వెళ్లిపోయాయి. ఇక మారిటైం పాలసీ అమలు చేస్తే రాష్ట్రానికి మిగిలేదేమీ లేకపోగా పోర్టులు తీసుకున్నవారి వస్తువులు రవాణా చేసేందుకు నదుపాయాలకు అవసరమైన రాయితీలు కల్పించేందుకు మాత్రమే ఆ పాలసీ ఉపయోగపడే విధంగా ఉంది. లాజిస్టిక్స్ పార్కులు కూడా వీటికి అనుబంధంగానే ఏర్పాటు చేస్తున్నారు. మొత్తంగా రాష్ట్ర ప్రజలకు ప్రభుత్వం చేసేదేమీ కనిపించకపోగా పాలసీల పేరుతో ప్రజల ముక్కుపిండి వసూలు చేయడం, ఉన్న వనరులను కార్పొరేట్లకు కట్టబెట్టడం అనేది సుస్పష్టంగా కనిపిస్తోంది.

రోడ్డు ప్రమాదంలో మనుభాకర్ అమ్మమ్మ, మేనమామ మృతి

చండీగఢ్ : భారత షూటింగ్ సంచలనం మను భాకర్ ఇంట్లో విషాదం చోటు చేసుకుంది. ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మనుభాకర్ అమ్మమ్మ, మేనమామ మృతి చెందారు. చార్ఖి దాద్రిలోని మహేంద్రగఢ్ బైపాస్ రోడ్డులో మనుభాకర్ బంధువులు ప్రయాణిస్తున్న ద్విచక్రవాహనాన్ని ఒక కారు ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగింది.

ఈ ప్రమాదం జరిగిన వెంటనే కారు డ్రైవర్ వెంటనే అక్కడి నుంచి పారిపోయినట్లు పోలీసులు తెలిపారు. గత ఏడాది జరిగిన పారిస్ ఒలింపిక్స్‌లో మను భాకర్ రెండు పతకాలు సాధించిన సంగతి తెలిసిందే. దీంతో ఒకే ఒలింపిక్స్‌లో రెండు పతకాలు సాధించిన తొలి భారత అథ్లెట్‌గా మనుభాకర్ రికార్డు సృష్టించింది. ఇటీవలే రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదగా ప్రతిష్టాత్మక మేజర్ ధ్యాన్ చంద్ ఖేల్ రత్నను మను భాకర్ అందుకుంది.





అమెరికాలో టిక్‌టాక్ సేవలు బంద్

వాషింగ్టన్ : సోషల్‌మీడియా యాప్ టిక్‌టాక్ అమెరికాలో తన సేవలను నిలిపివేసింది. ఈ యాప్‌ను నిషేధించే ఫెడరల్ చట్టం అమల్లోకి రావడానికి ముందే ఈస్టర్న్ స్టాండర్డ్ టైమ్, యాపిల్, గూగుల్ యాప్ స్టోర్‌లలో శనివారం టిక్‌టాక్ మాతృసంస్థ బైట్‌డ్యాన్స్ ప్రకటించింది. "అమెరికాలో టిక్‌టాక్‌ను నిషేధించే చట్టం అమల్లోకి రానున్నందున మీరు ఈ టిక్‌టాక్‌ను ఉపయోగించలేరు" అని వినియోగదారులకు శనివారం సాయంత్రం సందేశాన్ని పంపింది.